బాపూ - నేనూ

ఆచార్య రంగా

ముగ్గురమ్మలకు

వైతుకూలి ప్రజారాజ్యాశయ పరులు

అమ్మగా చూచుకొన్న

భారతీదేవిజీకి

మా మువ్వురు అన్నదమ్ముల కన్నతల్లి

అచ్చమాంబకు

పెంచిన తల్లి

మంగమాంబకు

ఆరాధనతో అంకితం

—రంగా

బాపూ - నేను

(BAPU BLESSES)

ఆంగ్లమూలం

ఆచార్య ఎన్. జి. రంగా

తెలుగు సేత

ఆచార్య పి. రాజన్న, యం. పి.,

డాక్టర్ వెలుగు దేవిజయంతి, యం. బి

ప్రచురణ

కిసాన్ పబ్లికేషన్స్

గోభూమి, నిడుబ్రోలు, గుంటూరు జిల్లా.

ప్ర తు లు
1 0 0 0

ప్ర చు ర ణ
మే, 1977

హరిజన నాయకులు

శ్రీ సి. వి. సిద్ధయ్యమూర్తిగారి

'భూదేవి' వారపత్రిక నుండి

పునర్ముద్రితం

సంపాదకుడు

దివ్యప్రభాకర్

ప్రతులకు

1. కిసాన్ పబ్లికేషన్స్

గోభూమి, నిడుబ్రోలు, గుంటూరు జిల్లా

2. వాహిని

భారతీ కుటీర్, రంగానగర్, విజయవాడ-10

3. దేశీ బుక్ హౌస్

నారాయణగూడ, హైదరాబాదు-29

విజయవాడ-2

సర్వోదయ ప్రెస్

విజయవాడ-6

వెల

రు. 7-50

పరిచయం

వివిధ విషయాలనుగురించి గాంధీజీ యిచ్చిన సలహా మనం పాటించినా, పాటించకపోయినా - భారతదేశం కూపొందించుకొన్నవారిలో ఆయన మహామేధావి యని మన దేశీయులంతా భావించటం కాదనలేని నిజం. అందు వల్ల మనమంతా ఆరాధించే ఆ మహాత్మునితో ఆచార్య రంగా జరిపిన కొన్ని చర్చల యథాతథ రూపాలను ఈ గ్రంథంలో దర్శిద్దాం.

సంభాషణలో తరచుగా వ్యక్తమయ్యేది ఒక వ్యక్తి ఆలోచనే అనిపించినప్పటికీ, నిజానికిది రెండు మేధలనుండి ఆవిర్భవించినదే!

స్వీయ ప్రయోజనంకోసంగాక ప్రజల సంతోషం కోసమే కృషిచేసే విశిష్ట వ్యక్తులలో ఎన్. జి. రంగా ఎన్నదగినవారు. అందువల్ల ఈ చిన్నపుస్తకం ఎంతో గొప్ప దనాన్ని సంతరించుకొంటున్నది. దీనిని పాఠకులకు అందజేస్తున్నందుకు నేను గొప్ప ఆనందాన్ని పొందుతున్నాను.

— సి. రాజగోపాలాచారి

సంపాదకీయం

"మన హృదయాలలో బాపూజీని నిలుపుకున్నాము పూజించుకుంటాము. మన 'బాపూ'ను మన ద్వారా మన ప్రజలకు అందించుకొంటూ వుండగలములే"

ఇవి ఈ గ్రంథానికి చివరి మాటలు. భారతదేశపు చరిత్రలో దుర్దినం జనవరి 30, 1948. ఆనాడు జాతిపిత భౌతికంగా పంచభూతాలలో కలిసిపోయారు. కాని నిజానికి నేటికీ ఈ దేశంలోని పవిత్ర ప్రజాస్వామ్య భక్తుల హృదయాలలో నిస్సందేహంగా జీవించే వున్నారు. ఇట్టి భక్తులలో ప్రథమశ్రేణిలో ప్రథములుగా నిలువదగిన స్వల్ప సంఖ్యాకులలో ఆచార్య రంగాగారు ఒకరు.

బాపూ కనుమూత కబురుకు చలించిపోయి ప్రపంచాన్నే మరచి వరుగెత్తి-నిర్జీవమూర్తిగా పడివున్న బాపును కనులారచూచి, కన్నీటి వల్ల చూడలేక, భక్తితో అంజలి ఘటించి, ప్రేమతో వివశులై "బాపూ ఇంకా బ్రతికే వున్నారు .... పల్కరిస్తున్నారు. సలహా లిస్తున్నారు. దారి చూపుతున్నారు" అని నిండుమనస్సుతో నమ్మకూ ఆయన చూపిన, చూపుతున్న దారినే అడుగులువేస్తూ, వేయలేని అశక్తులకు శక్తినిస్తూ, వేయటం మరుస్తున్న స్వార్థపరులను హెచ్చరిస్తూ- బాపూ అడుగుజాడల మీద మరిమరి బిరువైన ముద్రలు వేస్తూ సాగిపోతున్న నవ్యమైన, సశక్తి స్ఫూర్తి గల్గిన మహనీయుడు ఆచార్య రంగాగారు.

కొన్ని రాజకీయ గమనాలను గురించి ఆయనతో ఎంతమాత్రం ఏకీభవించని వ్యక్తులు సైతం గాంధీయమైన ఆయన నడకకు ముగ్ధులై,

ప్రపంచమంతటా ఆయనను అనుసరిస్తున్న గాంధీభక్తశిరోమణులు నేడు మనకు భారతదేశమంతటా కనుపిస్తున్నారు.

'అందువల్లనే బాపూ సజీవులు. తరతరాలకు, యుగయుగాలకు సజీవులు' అని గాంధీ శతజయంత్యుత్సవ సందర్భాలలో జరిగిన ప్రపంచ యాత్రలలో రంగాగారు పారిస్‌లో, దక్షిణాఫ్రికాలో, ఇథియోపియాలో, స్పెయిన్‌లో, ఆల్జీరియాలో, ఈజిప్టులో, ట్యునీషియాలో, సుడానులో, ఇంగ్లాండులో ఎలుగెత్తి చాటారు. 'అమెరికాగాంధి' మార్టిన్ లూథర్‌కింగ్‌కు గాంధీయ విధానంలో నివాళులర్పించారు. "గాంధీజీ సంఘదృష్టిలేని ఒంటరితనాన్ని కోరేవ్యక్తి (Individualist)" అని ఆరోపించడానికి సాహసించినప్పుడు "వ్యక్తికీ సంఘానికీ 'తగిన' ప్రాతినిధ్యమిచ్చిన ప్రజానాయకుడు గాంధీజీ" అంటూ ఆయన సత్యాగ్రహోద్యమ శక్తిని వజ్రాయుధంగా ప్రదర్శించిన కొద్దిమంది గాంధీయులలో రంగా గారొకరు.

దేశంలో, ప్రభుత్వ రంగంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం మితిమీరి పోతున్నందుకు ఆందోళన చెందుతూ రైల్వేల సంస్కరణకు ఆచార్య కృపలాని కమిటీ, ప్రభుత్వ రంగ సంస్కరణకు సంతానం కమిటీ వీర్పడి దీర్ఘకాలం చర్చలు జరిపినప్పుడు ఇంగ్లండ్, కెనడా, న్యూజిలాండ్, స్వీడన్ దేశాలు అంగీకరించిన ఆంబడ్స్‌మన్ (Ombudsman) విధానాన్ని మన దేశంలో కూడా ప్రవేశపెట్టి తీరాలని పోరాడిన వారు ఆచార్యరంగా, శ్రీ కె. ఎం. మున్షి గారలేగదా! ఈ లోక్‌పాల్, లోకయుక్తల వ్యవస్థను కేంద్రంలోని పెద్దలు అంగీకరిస్తూనే వున్నారు. అలాగే నేటి కొత్త కేంద్ర ప్రభుత్వం కూడా కావాలని అంటోంది. కొరడా చేతబట్టేదెవుడో మాత్రం తెలియటం లేదనే రంగా గారి వంటి పెద్దల ఆందోళన.

తమ రైతు కూలి ప్రజారాజ్య విధానానికి బాపూజీ ఆశీస్సులను అందుకో గల్గిన రంగాగారు- కేంద్ర ప్రభుత్వంగాని, ఏ రాష్ట్ర ప్రభుత్వంగాని సిద్ధాంతానికి సంబంధించిన ఎంతటి చిన్న అంశాన్ని అనుసరించడానికి ప్రయత్నించినా బాపూ వలెనే పార్టీ ప్రమేయం లేకుండానే సంతోషాన్ని ప్రకటించి సమర్థిస్తారు.

అఖరికి నేటి మాటనే చెప్పుకోవలసివస్తే - ఇప్పుడు లోకసభలో మెజారిటీని పొందినవారంతా మొన్న మార్చి 23 న రాజఘాటులోని బాపూ సమాధిదగ్గర ప్రమాణ స్వీకరణ చేయటాన్ని నిండుమనసుతో హర్షించిన ఏకైక యథార్థ ప్రజాస్వామ్య నాయకులు ఆచార్య రంగాగారే గదా!

'బాపూ-నేనూ' అనే ఈగ్రంథంలోని కొన్నిభాగాలు 'బాపూ-రంగా' ల బహుముఖ సాన్నిహిత్యాన్ని సర్వతోముఖంగా చాటుతున్నాయి. దేశ శ్రేయస్సు కోసం, ముఖ్యంగా గ్రామీణుల శ్రేయస్సు కోసం ఈ యిరువురు నాయకులు ఎంతటి తపన చెందుతూ చర్చలు, నిర్ణయాలు సాగించారో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చర్చలకు, నిర్ణయాలకు అందమైన అద్దమే ఈ బాపూ-నేను.

దీనిని రంగాగారు ఆంగ్లంలో **Bapu Blesses** పేరిట రచించారు. సుప్రసిద్ధ వైద్యులు, కవులు, విమర్శకులు డా. చిట్టూరి సత్యనారాయణ (మద్రాసు) సొగసుగా కూర్చి, ముద్రింపించి, అందించారు. మళ్ళీ యిప్పుడు అనువాదకులు శ్రీ రాజన్న, డా. వెలుగు దేవిజయంతి గార్ల ప్రత్యేక కృషి ఫలితంగా తెలుగు ప్రజలకు అందించ గల్గుతున్నాం.

ఇందలి సంభాషణలలోని ముఖ్యాంశాలు శ్రీ పెండూల్కర్ గ్రంథమండలి 6వ సంపుటంలోనివి. ఆయా గ్రంథకర్తలకు, ప్రచురణకర్తలకు మా కృతజ్ఞత.

ఈ అనువాద గ్రంథ ముద్రణలో శ్రద్ధవహించిన సర్వోదయ ప్రెస్ (విజయవాడ) కార్మికులను ప్రత్యేకంగా అభినందిస్తున్నాం.

* ఈ పుస్తకంలో అచ్చటచ్చట పుటలకు దిగువను ఫుట్‌నోట్సుగా చేర్చిన వాక్యాలన్నీ సంపాదకులవేగాని రచయితవి కావు. అయితే ఈ ఫుట్‌నోట్స్ చివర ఆ వాక్యాలు సంపాదకులవేనని రూఢి పరచడానికి చేర్చవలసిన "సం." అనే అక్షరం కొన్నిచోట్ల చేర్చబడక పోవటం గాని, ముద్రణ కాకపోవటంగాని జరిగినందుకు మా విచారాన్ని వ్యక్తం చేస్తున్నాం.

— దివ్యప్రభాకర్.

కృతజ్ఞత

హరిజన నాయకులు శ్రీ సి. వి. సిద్ధయ్యామూర్తిగారి సంపాదకత్వాన వెలువడిన 'భూదేవి' వారపత్రికలో - ఈ పుస్తకంలో మూడువంతులు ధారావాహికంగా 1970 లోనే ప్రచురించినందుకు శ్రీ సిద్ధయ్యామూర్తిగారికి మా కృతజ్ఞత.

— దివ్యప్రభాకర్.

ఆ నా టి ప ల్కు లు

1925 నాటినుండి బాపూ ఆత్మబలిదానం నాటివరకు ఆయనతో నేను జరిపిన చర్చల, అవగాహనల స్మృతిగుచ్ఛమిది. ఆ చివరివారంలో, ఆ ఆత్మాహుతి సమయంలో అంతకుముందెన్నడూ లేనంతగా నేను బాపూ ధ్యానంలో మగ్నమైపోతిని. బాపూతో నాకుగల సన్నిహిత సంబంధాలకు చెందిన స్మృతులన్నిటినీ సంక్షిప్తంగా వ్రాసుకొంటూ నా దుఃఖానికి ఓదార్పునీ, నా కార్యక్రమాలకు ఉత్సాహాన్నీ పొందుతూ వచ్చాను. అయితే ధ్యానముద్రలో వ్యాఖ్యలు సరిగా సాగేవికావు. అయితే ఇన్నేండ్లకు-బాపూ శతజయంత్యుత్సవాల సందర్భంలో ఆ వ్యాఖ్యలను తిరిగిచూచుకొని, లుప్తభాగాలను పూరించుకోడానికి నా స్మృతిశక్తిని కూడగట్టుకున్నాను. క్రమరహితంగా వున్న రికార్డులను వెదకుతున్నప్పుడు యిలా కూడదీసిన వ్యాఖ్యలను ఈ చిన్న పుస్తకంలో గుదిగ్రుచ్చుతున్నాను.

వీటి అవగాహనకు గాంధీ సాహిత్యంతోను, నాటి దేశ కాల రాజకీయ సాంఘిక పరిస్థితులతోను పరిచయం అవసరం. బాపూతో ముఖాముఖిని, ఆయన సమక్షంలోను జరిగిన సంభాషణల సమీకరణకు నేను ధ్యాన ముద్రితుణ్ణి కావలసి వచ్చింది. ఆ ధ్యానం ద్వారా సాధించిన స్మృతులను నా శక్తికొలది మాలగా అల్లి సమర్పిస్తున్నాను. ఈ రచనలో గాని, దీనిలో వ్యక్తం చేసిన భావాలలోగాని ఎట్టి లోటుపాట్లు కనిపించినా అవి నాకే చెందుతాయి. ఈ లోటుపాట్ల ఆధారంగా బాపూ వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని బలహీన పరచటంగాని, పొరపాటుగా చిత్రీకరించటంగాని జరగరాదని మనవి.

దరిద్ర నారాయణులను సేవించడానికి తన అనుచరులుచేసే ప్రయత్నాలకు బాపూ ఏ విధంగా సలహాలిస్తూ వుండేవారో, మార్గ దర్శకత్వం

వహించేవారో ఈ గ్రంధం వివరిస్తుంది. మా శక్తి సామర్థ్యాలను బట్టి మేము ఆయన హెచ్చరికవల్ల ప్రయోజనాలను పొందుతూ వుండేవారము. జలాశయంలోని ప్రతి జలబిందువుపైన దాని పరిమాణంతో నిమిత్తం లేకుండా సూర్యరశ్మి ఏ విధంగా సమానంగా పడుతుందో- అదే విధంగా బాపూ తన ప్రేమామృతాన్ని మా పై వర్షింప జేసేవారు. బాపూ సన్నిహిత సంబంధాన్ని పొందగల్గిన అదృష్టవంతులంతా ఆయన తమకు అందించిన ఆలోచనలను, చిరునవ్వులను తమ కృషిలో, సేవలో ప్రతిఫలింప జేసుకోగలిగేవారు, అర్ధ శతాబ్దంపాటు ఆయన నిర్వహించిన కార్యక్రమాలు, ఉద్యమాలు, ఆయన సాహచర్యం లక్షలాది ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చ గల్గినవి, తద్వారా వారు ఆయన దీవెనలను పొందగల్గినట్లు తృప్తి చెందేవారు.

ఇట్టి ప్రత్యేకావకాశాలను పొందలేకపోయినవారు కూడా ఆయన వ్యక్తిత్వం, కార్యక్రమాలు, ఆలోచనలు, ప్రబోధాలు పరిశీలించి, అనుసరించి ప్రయోజనం పొందేవారు. బాపుజీకి లభించిన యిట్టి ఏకలవ్య శిష్య ప్రముఖులలో- అమెరికాలో జన్మించిన ఆఫ్రికన్ జాతీయుడు డాక్టర్ మార్టిన్ లూథర్‌కింగ్ అత్యున్నతులు. ఈయన కూడ బాపూవలెనే హత్యకు గురియైనారు- ఇంకెంతో పిన్నవయస్సునసే!

రానున్న తరాలవారు బాపూ అడుగుజాడలలో నడవడానికి అనువుగా -నేను, నా సహచర కార్యకర్తలు పాతికేండ్లుగా మా హృదయాలలో మహాత్మునకు అందిస్తున్న నివాళులలో లేశమాత్రంగా భావిస్తూ నేనీ భావపరంపరలనే హారాన్ని ప్రియపాఠకులకు అందిస్తున్నాను.

బాపూ- నేనూ జరిపిన మరికొన్ని చర్చలను "స్వాతంత్ర్యం కోసం పోరాటం"* అనే పుస్తకంలో వివరించాను.

ఈ రచనకు నాకు తోడ్పడిన గ్రంథాలు: 'స్వరాజ్య' వార్షిక సంచిక; 'మహాత్మాగాంధీ- లాస్ట్‌ఫేస్-' వాల్యూములు-2, రచయిత:

---

* Fight for Freedom.

ప్యారేలాల్: 'మహాత్మా'- వాల్యూము-6, సంపాదకుడు: టెండూల్కర్.
ఈ గ్రంధాల ప్రచురణ కర్తలకు నా కృతజ్ఞత.

ఈనాటి పల్కులు

"భారతీయులు మహాత్ముని ప్రబోధాలను మరుస్తున్నారా?" అని ప్రపంచంలో ప్రముఖులు కొందరు ప్రశ్నిస్తున్నారు. 1969 లో ప్యారిస్‌లో జరిగిన గాంధీ శతజయంతి అంతర్జాతీయ మహాసభలలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. అప్పుడు నేను "గాంధీ బోధనలు సజీవమైనవే; భారతీయులు వాటిని మరువలేరు. మరువరు. నేటికి వారు బాపూ మార్గమునే అనుసరిస్తున్నారు" అని రూఢిగా పల్కినాను.

1971, 1977 ఎన్నికలలో మన దేశప్రజలు దరిద్రనారాయణులను సేవించెదమన్న వారికే, 'గరీబీహఠావు' సాధించెదమన్న వారికే అత్యధిక మైన మెజారిటీని పార్లమెంటులో రెండు వేర్వేరు పార్టీలకు యిచ్చి తమ ప్రజాస్వామ్య, గాంధేయ భక్తిని ఋజువు పరచుకొన్నారు.

క్రొత్త లోక్‌సభలో మెజారిటీని పొందిన జనతాపార్టి సభ్యులు రాజఘాట్‌లో గాంధిజీ సమాధివద్ద 1977 మార్చి 23 వ తేదీ ఉదయాన తమ ప్రమాణ పత్రాన్ని బాపూజీకి లాంఛనప్రాయంగా అందించుకున్నారు. ఆ ప్రమాణమే గాంధీజీ అందరికీ అందించిన దరిద్రనారాయణ సేవావ్రతం.

అటు కాంగ్రెసువారు, ఇటు జనతావారు కూడా మహాత్ముని దారిలో ఆయనబోధలను అనుసరించి దారిద్ర్యమును పొద్రోలుటే అత్యవసర ధర్మమంటున్నారు. అందుకే యిందుకై పోటీలు పడుతున్నారు.

ఇట్టి శుభసమయమునకు గాంధీజీ 1925లోనే ప్రప్రథమ పాఠమును బోధించి, నాందిపల్కిరన్న సత్యాన్ని ఈ పుస్తకం స్పష్టపరచుతున్నది.

గోభూమి, నిడుబ్రోలు

ది 7-4-77

రంగ

విషయ సూచిక

	పరిచయం	iii
	సంపాదకీయం	iv
	ఆనాటి పల్కులు, ఈనాటి పల్కులు	viii
1.	బాపూ మమ్మాశీర్వదించిరి	1
2.	బాపూజీ మా యింటికి రాక	9
3.	వేదన - ప్రార్థన	14
4.	హరిజన, సవర్ణ సమానత్వం	25
5.	వ్యక్తి సత్యాగ్రహం - పూనా ఎ. ఐ. సి. సి. 1933	29
6.	పార్లమెంటు కార్యక్రమం - కాంగ్రెసు సామ్యవాదం	32
7.	హరిజనవాడలో సమావేశాలు, 1935-'36	37
8.	సంస్థానాల్లో ప్రజోద్యమాలు	46
9.	కాంగ్రెసు మంత్రివర్గాలు (1937-'39) హైతు యాత్రలు	54
10.	దేవుని మనిషి	62
11.	లక్నో కాంగ్రెస్సు	70
12.	ఫైజ్‌పూర్ కాంగ్రెసు - హైతులు	75
13.	హైతులకు ప్రయాణం	79
14.	అజ్ఞాత వాసం	82
15.	అంతర్వి భేదాలు	85

16. ఆంధ్ర ఫిర్యాదులను గూర్చి గాంధిజీ 92
17. పర్మిట్లు, కంట్రోళ్ళ దౌర్భాగ్యం 97
18. బాపూ అందించిన నైతిక బలం 103
19. హిందూ మహమ్మదీయుల పరస్పర హింసా కాండ, దక్షిణాదిలో శాంతి 105
20. కాంగ్రెసు వర్కింగ్ కమిటీలో మహాత్ముని పాత్ర 108
21. ప్రధము లెవ్వరు? ప్రధాన మంత్రియా? కాంగ్రెసు ప్రెసిడెంటా? 114
22. వయోజన ఓటింగు హక్కుకు బాపూ సమ్మతి 123
23. గాంధీయిజం, నెగటివిజం, సోషలిజం 135
24. స్మృతి చిహ్నం 145
25. శాశ్వతుడైన బాపూ 147
26. ఆకాశవాణి - న్యూ ఢిల్లీ, నేను ధ్యానించు కొనే గాంధీజీ 152
27. పారిస్‌లో మహాత్మాగాంధీ జయంతి 165
బాపూ స్వర్గారోహణము 176
జవహర్ శ్రద్ధాంజలి 186
దేవిజీకి లేఖ 192

6-10-41

My dear Ramon,

I was delighted to hear from you and to learn that you were keeping well and that your faith in nonviolence was daily growing.

Lovingly,

Richard



"—మంచిగా ఉండాలనీ, మంచినే చేయాలనీ కోరేమనిషి ఎట్టి పరిస్థితులలోను అధికారాన్ని చేపట్ట కూడదు.

—గాంధీజీ

బాపూ - నేను

1. బాపూ మమ్మాశీర్వదించిరి

1927 లో మద్రాసులో డా॥ అన్సారి అఖిల భారత కాంగ్రెస్ సంఘమునకు అధ్యక్షుడుగా ఎన్నికయిరి. శ్రీని వాస అయ్యంగారు సమర్థుడైన నాయకుడు. ఆయన అంతకు ముందు సంవత్సరము అఖిలభారత కాంగ్రెస్ సంఘమునకు అధ్యక్షుడుగా వుండిరి. నిర్మాణాత్మకమైన కార్యక్రమముపై కేంద్రీకరించుట మహాత్మాగాంధికి తృప్తిగావున్నది. రాజాజీ ఆ మార్గములో వారికి కుడిభుజముగా నుండిరి. ఆయన గాంధీజీని బలపరచుటలో శ్రద్ధవహించుచుండిరి. పార్లమెంటు ద్వారా స్వరాజ్యోద్యమాన్ని సాగించాలనేవారు మహా త్ముణ్ణి, తమ ధోరణిని అంగీకరించమంటూ త్వరపెట్టు చుండిరి.

ఆ సెషనుకు ఖాదీ ప్రదర్శనము ముఖ్యమైన ఘట్టము. ఆ ప్రదర్శనములో యంత్రములతో తయారు చేసిన వస్తువు లనుకూడా ప్రదర్శించవచ్చునా యను విమర్శ వచ్చి నది. మిల్లుదారంతో చేసేత బట్టలపై నిషేధం నాకు యిష్టం గాలేదు.

గాంధీజీ ఆకర్షణీయమైన ఖాదీ ప్రదర్శనను తెరచిరి. శ్రీమతి భారతీదేవి రంగా మరియు నేనూ గాంధీగారిని కలు

సుకొని మనదేశ ఆర్థిక వ్యవహారములలో కుటీర పరిశ్రమల యొక్క స్థానమును గురించి మాటలాడితిమి. నేను గాంధీజీతో తమ ఉత్పత్తికొరకు యంత్రములతో తయారయిన వస్తువులను వాడుకొను చేనేతవారు, యితర కుటీరపరిశ్రమలలో పని చేయు కళాకారుల భవిష్యత్తు గూర్చి మాటలాడితిని. గాంధీ గారు వారికష్టములు నిజమైనవేయని అంగీకరించారు. చేతినూలుతో వడికిన బట్టలపై ప్రజలదృష్టి కేంద్రీకరింపజేయుటకై నిషేధము అవసరమైన దనిరి. ఖాదీమినహా, యితర చేనేత పరిశ్రమల ఉత్పత్తిపై నిషేధాన్ని గురించి మాకు సంతోషములేదని తెల్పితిమి.

బాపు : కాని వాటికొరకై చాల ప్రదర్శనశాలలున్నాయి.

రంగా : లేదండి. ఇతర ప్రదర్శనశాలలను ఖాదీ, చేనేత పరిశ్రమల ఉత్పత్తులందు ఆసక్తిలేనివారే నడుపుచున్నారు?

బాపు : వాటిని స్వదేశి అంటారు గదా.

రంగ : ఆ స్వదేశీ ప్రోత్సాహము పరిశ్రమాధిపతులకే! కళాకారులను ఎవరుచూస్తారు? వాళ్ళ ఉత్పత్తులను ఎవరు ప్రచారం చేస్తారు? ముఖ్యంగా నేత పనివారిని.

మరొకరు: నేత పనివారు ఎందుకు ఖాదీ నేయరు.

రంగ : ఒక శాతం చేనేతపనివారికి కూడ చాలినంత ఖాదీ దారం లేదు గదా! ఒక చేనేత పరిశ్రమ కేంద్రానికి కూడ సరిపోయినంత ఖాదీ దారమును

రాజాజీగారి గోభిచెట్టి పాలాయమ్ ఇవ్వలేక పోతున్నది.

అప్పుడు నేను పచ్చయప్ప కాలేజీలో ఆర్థికశాస్త్ర ఆచార్యుడుగా నియమించ బడటాన్ని అభినందించారు. భారతీదేవివైపు తిరిగి

బాపు : మీరిప్పుడు సంతోషంగా వుంటిరా?

"విద్యార్థులలో నిర్మాణ కార్యక్రమము ప్రచారములో నున్నదా?" అనివారు నన్ను అడిగిరి. ఏమిచెప్పటానికి ఇంకా సమయము రాలేదు. గత రెండు సంవత్సరములుగా నేను విద్యార్థుల వుద్యమములో వారితోకలిసి యున్నందున విద్యార్థులయొక్క స్వభావాన్ని గ్రహించగల్గు చున్నాను. వారు నిర్మాణ కార్యక్రమంవైపు ఎక్కువగా ఆకర్షితులౌతున్నట్లున్నది.

బాపు : అంటే; ఏమి నీభావము. వారికి ఖాదీ వగైరాలపై శ్రద్ధ చేయించగలవుగదా?

రంగ : విద్యార్థుల పార్లమెంటులలో సమావేశాలలో ప్రవేశించుట; ఖాదీ, చేనేత, స్వదేశ ఉత్పత్తులతో చేసిన మిల్లుబట్టలు ధరించుట, రాత్రి పాఠశాలలు; వయోజన విద్యా కేంద్రముల నడుపుట వగైరా నిర్మాణాత్మక కార్యక్రమములో ఖాదీ స్వదేశీలు ఒక భాగముగా వారు భావించు చున్నారు.

బాపు : నామాటలు వారు వారి పద్ధతిలో, వారి సౌకర్య
ముసుబట్టి ఉపయోగించుకొనుచున్నారన్నట్లుగా!
అంటూ గాంధీజీ నవ్వారు. వెన్వెంటనే సీరియస్
అయ్యారు.

బాపు : నీవు వారితో అంగీకరిస్తావా;
నేనేమి చెప్పగలను? నేను ఆశ్చర్యంనుండి కోలు
కున్నాను.

రంగ : వారిది తప్పుకాదని నేనను కొంటున్నాను.
గాంధీజీ తిరిగి నవ్వారు.

బాపు : మీరు అప్పుడే ఆచార్యులు. కాబట్టి మీరు మీ
విద్యార్థులను తక్కువ పరచలేదు.

రంగ : అయ్యా! నిర్మాణాత్మకమైన ధోరణిలో మీకార్య
క్రమాన్ని విద్యార్థులు ఆచరణచేయగల పద్ధతిలో
గమనించాలి. యువతరం యొక్క సహకారాన్ని
పొందాలి.

బాపు : రాజకీయాల గురించి ఏమిటి; నీవు అఖిలభారత
విద్యార్థి సంఘమునకు ఇచ్చట జరుగుచున్న
సభకు మూల స్తంభమని తెలిసినది.

రంగ : విద్యార్థులు భారతదేశమునకు పూర్తిస్వాతంత్ర్యం
(Complete Indipendence) కోరుతున్నారు. వారు
ఆదారిలోనున్న చిక్కులను తెలుసుకో లేకున్నారు.
కాని వారు మీచే నడుపబడుటయే కోరు
తున్నారు.

గాంధీజీ నాయొక్క ప్రభావము మద్రాసు విద్యార్థు లపై సృజనాత్మకంగా వుందని, వారు నా సలహాలను పాటిం చిరని డా॥ కజిన్నదార్వారా తెలుసుకొని తాను సంతో షించినట్లు తెల్పారు.

బాపు : శ్రీనివాస అయ్యంగార్ మరియు సత్యమూర్తి గార్ల విషయమేమిటి?

కంగ : వారుకూడ విద్యార్థుల ప్రభావాన్ని నిర్మాణాత్మ కంగా ఉపయోగించుచున్నారు.

మీరు ఆచార్యులైన పిమ్మట ఏమిచేయదలచినారు. అని వారు అడిగారు. నేను విద్యార్థులతో ప్రజా నాయకు లతో నా పరిచయాలను కొనసాగిస్తానని చెప్పాను. దానిని విద్యార్థులు అభినందిస్తారో లేదో చెప్పలేను. కళాశాల అధి కారులు ప్రజా కార్యక్రమాలలో పాల్గొనుటకు నాకు తమ సమ్మతి యిచ్చారు. నేను కాంగ్రెసు సంఘములోనే యుం డుట మంచిదగును గదాయంటూ బాపుయొక్క సలహా అడిగాను.

బాపు : ప్రజాహితైక జీవితంలో వుండేందుకు మీకాలేజీ ట్రస్టీలనుండి హక్కు సంపాదించి నందుకు సంతో షిస్తున్నాను. ఐతే ఆ హక్కును తీవ్రంగా వుప యోగించరాదు. నీవు కాంగ్రెసు సంఘములో చైతన్యవంతముగా వుండకుండుట మెరుగు. నా వంక చూడు. నేను కాంగ్రెసు మనిషినే, కాని నేను కాంగ్రెసు రాజకీయాలలో లేను. అటులే నిర్మాణాత్మకమైన పనిలో కేంద్రీకరించాము

ఎందుకు నీవు రాజకీయ విభేదాలపై ఆంతరంగిక చర్యలపై ప్రత్యేక ఆసక్తి చూపించడ మేల?

రంగా : కాంగ్రెస్ రాజకీయాలలో నాకంత శ్రద్ధ లేదు. కాని రాజకీయ శాస్త్ర తరగతులలో, నేటి రాజకీయ పరిణామాలను గూర్చి విద్యార్థులు నన్ను ప్రశ్నించి నప్పుడు నా యభిప్రాయాలను వెల్లడించే స్వాతంత్ర్యం నాకుండ నవ సరం లేదా?

గాంధీగారు ఒక్క నిమిషం ఆగాడు.

బాపు : తప్పని సరిగా వుండాలి. విద్వాంసునిలాగా నీవు నీ యభిప్రాయాలను వెల్లడించ వచ్చు ననుకొంటాను నేనేదో చెప్పనున్నట్లు వారు గ్రహించి, తానే త్వరగా చెప్పసాగారు.

బాపు : ఇక్కడనున్న స్థానిక రాజకీయాలను నీవు చెప్పవలసి వుంటుందని; జస్టిస్‌పార్టీ శాసనసభ్యులకు యుద్ధ సన్నద్ధమైన మన కాంగ్రెసు శాసనసభ్యులకు మధ్యనున్న భేదాన్ని గూర్చి చెప్పవలసి వస్తుందని నాకు తెలుసు. అది కొంత కష్టంతో కూడు కొన్నదే. కాని నీవు ఆక్స్‌ఫర్డ్ యూనియన్ చర్చలలో పాల్గొన్న వాడివి. అందువల్ల అది నీకు చాల సులభం.

ఆ మాట లంటున్నప్పుడు గాంధీగారు గొప్ప వక్త యైన సత్యమూర్తిని దృష్టిలో వుంచుకొన్నట్లుంది.

రంగా : శాసన సభలకు ఎన్నుకో బడడానికి కావల సిన స్వాతంత్ర్యాన్నిగూడ నేను పొందాను.

బాపు : ఓ! అయితే నీవు రాజాజీని గాక అయ్యం గారి ననుసరించ దలచావన్నమాట.

రంగా : కాదండీ! జమీందార్లు, వడ్డీ వ్యాపారస్తుల బ్రిటిష్ పరిపాలకుల పీడననుండి రైతుల్ని రక్షించదలచు కొన్నాను.

బాపు : సరే ప్రజలకు సాయం చేయాలనే ఆత్రుత తో వున్నావు నీవు. అది అంత చెడ్డేమీ గాదు. నీసేవను ఉపయోగించడానికి స్వరాజ్య పార్టీ ఉండనే వున్నది. నీవు నీ ఆర్థిక పరిశోధనలను కొనసాగించవా? ఖాదీ ఆర్థిక స్థితి గతుల్ని గూర్చి నీవు రచించిన వ్యాసాన్ని నేను చదివాను. అది చక్కగా వున్నది. నీవా పద్ధతిలో పనిచేయాలని నా కోరిక. నీ కళాశాల పని అందుకు హెచ్చు దోహదం కల్పి స్తుందా, వారుచెప్పినట్లు చేయడానికి నేను హామీనిచ్చాను. రైతులలోను వ్యవసాయ కూలీల లోను, గ్రామస్తులలోను, పట్టణ కార్మికులలోను వున్న వివిధ వర్గాల ఆర్థిక సాంఘిక స్థితినిగూర్చి సర్వే చేయడానికి, వాటిని పరిశీలించడానికి నేనెలా ఉద్దేశిస్తున్నానో దానినిగూర్చి వారికి వివరించి చెప్పాను. వారు నా పథకాలను మెచ్చుకొన్నారు. ఇతర కార్యక్రమాలలో పాల్గొనడానికి గాంధీగారికి సమయమవు తున్నదని వారి కార్యదర్శి సూచించాడు. వారి సెలవును తీసుకొనడానికి మేము లేచాము. వారు భారతీదేవి వైపు తిరిగి ఆమె నాశీర్వదిస్తూ.

బాపు : నీవు ఇంగ్లండుకు వెళ్ళి వుంటివని, అక్క ఫర్డులో చిత్రలేఖనాన్ని నేర్చుకొన్నావని శ్రీమతి కసిన్స్

అంటే కమలాదేవి మూలంగా తెలుసుకొన్నాను. కాని నీకు ఆ పాశ్చాత్య నాగరికత అంటలేదు. నీ నుదుటనున్న తిలకం నాకెంతో ఇష్టంగా వుంది. రంగాకు సాయపడు. మిమ్మల్నిద్దరినీ నేను దత్తు తీసుకోవచ్చునా?

లక్షలాది జాతీయ సేవకుల హృదయాలను వారీ విధంగా జయించేవారు. ఒక్క నవ్వుద్వారా గుర్తించి నట్లు, తలనాడించడం ద్వారా, నవ్వుతూ పరామర్శించడం ద్వారా ఆశీర్వదిస్తూ స్పర్శించడంద్వారా, భారతమాత స్వాతంత్ర్యం కోసం జరిగే ఉద్యమంతో దేశభక్తులైన యువకుల్ని వారు పెనవేసేవారు. ఆనాడు ఆతరువాత ఎల్లప్పుడూ నూత్నమైన మాప్రయత్నంలో బాపూజీఆశ్రమస్థులు అందుచున్నవని మాకున్నవని మేము భావించాము.

---

1) చేనేతవారి రక్షణకూడా. తమ నిర్మాణ కార్యక్రమ మందొక భాగంగా గాంధీజీ అంగీకరించ గల్గిరని 1946 లో అఖిలభారత చేనేత కాంగ్రెసు వారికి రంగాజీ తెల్పగల్గిరి.

2) కళాశాలవారు రంగాజీ రాచకీయాలలో పాల్గొన వచ్చునని మొదట్లో అంగీకరించినా, 1930 వుప్పు సత్యాగ్రహాన్ని, వైస్రాయి యిర్విన్‌కు గాంధీజీ పంపిన సవాలును రంగాజీ బహిరంగంగా బలపరచే సరికి, ప్రభుత్వపు వత్తిడికి తాళలేక, రాచకీయములను వదులుకోవలెనని కాలేజీవారు కోరిరి. ప్రజలతోనే వుంటాను అంటూ, రంగాజీ కాలేజీ వుద్యోగాన్ని త్యజించిరి.

2. బాపూజీ మా యింటికి రాక!

సిడుబ్రోలులో నేను జన్మించిన మా యింటికి 1929లో గాంధీగారు వచ్చారు. ఖాదీనిధికని వారికి కొంత ధనాన్ని కానుకగా యిచ్చే భాగ్యం నా తల్లికి కలిగింది. ఆగ్రామంలో మా కందరికి అది ఒక గొప్ప సన్నివేశం.

అది ఒక సాయంత్రం. ఆ సమావేశాన్ని జరపడానికి చాల దినాల నుండి మేము ప్రయత్నిస్తూన్నాము. ప్రియతమ్ముడైన ఆనాయకుని ఊరేగింపుకోసం ఎంతో ఉత్సాహంతో ఎదురుచూస్తూ ఆదుర్దాతో మేము నిలబడివున్నాము. ఆక్షణం రానేవచ్చింది. వారు మా వీధిలోకి వచ్చారు. వారికారు మమ్మల్ని సమీపిస్తున్నది. మా యువకులు మహాత్మాగాంధీ కీజై అనే ప్రియతమమైన నినాదాన్నిస్తూ వున్నారు. మేము కూడ వీధిలోని యీచివరినుండి ఆ నినాదాల నివ్వసాగాము. చాలత్వరగా వచ్చింది వారికారు. నాతల్లి, నాసోదరులు, నా సతీమణి నేను అందరము మా ద్వారం దగ్గర పూలమాల లతో వారిరాక కోసం వేచివున్నాము. వారు వచ్చారు. అప్పుడు మాతల్లి నావైపు చూచింది. ఏమిచేయాలి? అని తన చూపుతోను చిరునవ్వుతోను ఆమె నన్ను ప్రశ్నించింది. ఆ క్షణాన్ని ఎలా ఉపయోగించాలి? ఆ మె అంత సంతోషంగా ఉండడాన్ని నేనెప్పుడూ చూడలేదు. అప్పుడామె ఒక విధమైన భయభక్తులను, ప్రేమను, విశ్వాసాన్ని ప్రదర్శించింది. ఉత్సాహంతో, ఎంతో భక్తితో ఆమె వారికి మాలను వేసింది. నన్ను, నాసతీమణిని కూడ

మాలలను వేయమన్నది. చూచబడిన వారి హస్తంలో ఆమె తనవద్దనున్న ద్రవ్యాన్ని త్వరగా వ్రంచి నమస్కరించింది. అప్పటికే బాపూజీ నా లేఖను చూచి వున్నారు. అందువల్ల వారు నా వైపు తిరిగి—

బాపు : ఆక్సిఫర్డ్ యోధుడా! ఇదేనా మీ అయిల్లు! నీలేఖ చేరింది. ఖాదీ మీద నీవు వ్రాసిన వ్యాసాన్ని చదివాను. ధన్యవాదాలు.

రంగా : ఈమె నాతల్లి. అన్నిటికీ నే నామెకు ఋణపడి యున్నాను.

బాపూజీ కొన్ని సెకండ్లు మాతల్లి వైపు చూచారు. తిన్నగా నవ్వారు. మమ్మల్ని ఆశీర్వదించారు. తరువాత వారు ఆమెవైపు తిరిగి—

బాపు : రంగాను గూర్చి నీవు గర్వించాలి. నీనిత్తిని నాకిస్తావా? ఇతడు నాతో చేరుతాడను కొంటాను. దయచేసి నామీద కోపపడవద్దు.

వారేమంటున్నారో మాతల్లికంతగా అర్థంకాలేదు. మహాత్ముడు తన కుమారుణ్ణి గుర్తించాడని మాత్రం ఆమె అనుకొన్నది. తరువాత బాపూజీ భారతీదేవి వంకకు చూచారు. ఆమె నమస్కారాన్ని అందుకొంటూ చిరునవ్వు నవ్వారు.

భారతీదేవి— మీ దర్శనం కోసం మదరాసు నుండి ఇచ్చటికి వచ్చాము.

బాపు : ఎందుకు? నేనెన్నడూ మీ యింటిలోనేవున్నాను.

ఛాకటిడేవి : ఇదే మాయిల్లు. మదరాసులో మాకు యిల్లు లేదు.

మా తల్లి చాల ఆనంద పడింది. మేము మహా త్ముునికి చాల బాగుగా తెలుసును గనుక మేమంటే ఆమె చాల గర్వపడింది. ఊరేగింపు మరలా మొదలయింది. దానిని మేమెంత మాత్రం ఇక నిలుపలేక పోయాము. కాని బాపూజీ నాతో కొన్ని మాటలు మాట్లాడాలని ఉత్సుకత చూపారు.

బాపు : అయితే నీవుగూడ ఒక గ్రామస్తుడవే నన్నమాట. నా ఆర్థిక శాస్త్రవేత్త గ్రామస్తుడై వుండితీరాలి.

రంగా : నేను ఒక రైతును గూడ మహాత్మాజీ!

బాపు : అది మరొక మంచి మాట. కనుక నా ఆక్సఫర్డ్ యోధుడు గ్రామస్తుడే గాక ఒక రైతుగూడ. అంతకంటె నాకేంకావాలి?

మరొకరు: బాపూజీ! వారు ఆర్థికశాఖకు ఆచార్యులుగూడ.

బాపు : అది నాకు తెలుసు. అంతేగాదు. అతడొక నిజమైన గ్రామస్తుడు, ఒకరైతు, నిజమైన ఖద్దరు వాడి. నాకెంతో ఆనందంగా వుంది.

ఖాదీనిధికై మహాత్మాజీ ఆంధ్రదేశాన్ని పర్యటించనున్నాడని నాకు తెలుస్తూనే ఆక్సఫర్డ్ విశ్వవిద్యాలయానికి నేను సమర్పించిన, ఇండియాన్ ఎకనామిక్ జర్నల్లో ప్రక

టించబడిన, ఖాద్ది ఆర్థిక సిద్ధాంత వ్యాసపు ప్రతి నొకదానిని వారికి పంపాను. ఆ వ్యాసంలో నేను మిగతా వాదాలతో పాటు ఖాదీ ఏవిధంగా ఆర్థికంగా లాభదాయక మైనదో, మన దేశానికది ఆర్థికంగా ఎంత అభివృద్ధి దాయకమైనదో, ఇతర సాంఘిక లాభాలతో పాటు, మన స్త్రీలను వృద్ధులను, సరిగా పనులు దొరకని చాలమంది పేదలను అసలు పనులే లభించని నిరుపేదలను నిరుద్యోగులుగా వుంచకుండా ఖాదీ పరిశ్రమలోను ఇతర కుటీర పరిశ్రమలలోను పని కల్పించిన వారిని ప్రోత్సహించడానికి అది ఎంతగా పనికివస్తుందో వివరించాను. క్షామాలువచ్చినపుడు, వర్షాభావం ఏర్పడినప్పుడు అది ఆర్థికంగా దెబ్బతిన్న వారి కెంత లాభదాయకమో, లక్షలాది రైతులను, కూలీలను వారి స్త్రీలను బిడ్డలను భయంకరమైన ఆ ఎండలలో రాళ్ళుపగులగొట్టే ఆ కఠిన కార్యక్రమాలలోను, రోడ్ల నిర్మాణంలోను ఉపయోగించడాని కంటె కరువు నివారణ కార్యాలలోను, ఖాదీ నూలు నుత్పత్తి చేయడంలోను, కుటీర పరిశ్రమలలో వస్తువుల్ని తయారు చేయడంలోను ఉపయోగించడం ఎంత మంచిదో అందులో నేను ఋజువు గావించి వున్నాను. ఉచితంగా సగం సగం వేతనాలు చెల్లించడం కంటె, గంజి కేంద్రాలను ప్రారంభించడం కంటె చేతిత్రో నూలు వడికించడం, వడికిన నూలును చేతితో నేయించడంవల్ల ప్రభుత్వం పనులులేని వారికి పూర్తి వేతనాలివ్వడం సులభం, లాభదాయకం, అని చూపి వున్నాను.

1925లో నేను గాంధీజీకి నా యీ దృక్పథాన్ని వివరించి నప్పుడు వారు దానిని ఆమోదించారు. మరలా నేనువారితో ఈ విషయమై 1927లో సంభాషించినప్పుడు ముద్రిత మయిన నా సిద్ధాంత వ్యాసాన్ని వారిటీవల పఠించినప్పుడు విద్వద్దో షదినుండి నేను వారి ఆశయాన్ని బలపరుస్తున్నానని గ్రహించి వారు చాలా ఆనందించారు.

బాపూజీ నా వ్యాసాన్ని మెచ్చుకొంటూ మాట్లాడి నప్పుడు ప్రముఖ ఖాదీ సిద్ధాంత వాదియైన సీతారామ శాస్త్రికి నేనంటే చాల నచ్చింది. అప్పటి నుండి ఆయన, గాంధేయ కాంగ్రెసులో ప్రముఖమైన నిర్మాణ కార్య కర్తల ఆంతరంగిక విభాగంలో ననొ్నకణ్ణిగా లెక్కిస్తూ వచ్చాడు.

భారతీదేవి గూడ బాపూజీ ఆశీస్సులను పొందినారు.

బాపు:-మా చిత్రకారిణి ఎలావుంది? నా కోసం ఏమైనా చిత్రాలను రచించావా?

భార:-మీరు మరొకసారి మా గ్రామానికి వచ్చినప్పుడు మీ చిత్రాన్ని నాపరుమీద కుట్టి యిస్తాను.

బాపు:- (తన మూపుడు వేలునెత్తి ఇలా అన్నారు) అయితే మరలా నన్ను రమ్మని అంటున్నావు. అలాగే దేవుని దయ వుంటే తప్పనిసరిగా వస్తాను.

మా గ్రామానికి మరలా వస్తానని మహాత్మునిచేత అంగీకరింప జేసినందుకు మా తల్లి తనకోడలిని గూర్చి గర్వ పడినారు.

2. వేదన-ప్రార్థన

హరిజనులు హిందూ సమాజంనుండి వేరుకాకుండా వుంచడానికి తద్వారా హిందువులు విభజితమై పోకుండా నిరోధించడానికి 1932లో మహాత్ముడు తన చారిత్రాత్మక మైన ఉపవాసాన్ని ప్రారంభించినపుడు హెచ్చుగా, మనఃపూర్వకంగా ప్రార్థన యొక్క అవసరాన్ని నేను గుర్తించ గలిగాను.

అంతకు ముందు కూడ నేను ప్రార్థనలలో పాల్గొని వున్నాను. యూరపులోనే గాక మన సాంఘిక, మతకార్యా లలో నేనెప్పుడు పాల్గొని నప్పటికీ ప్రార్థనలుచేసి వున్నాను. కాని అప్పుడు నేను ప్రార్థనలో మనఃపూర్వకమైన విశ్వా సాన్ని పెంపొందించుకొని వుండలేదు. దేవుణ్ణి విశ్వసించడం బొమికలో మూలగ వుండడం లాగా సహజమైనప్పటికీ విగ్రహారాధనను నేను వ్యతిరేకించే వాణ్ణి. ప్రాపంచిక వ్యవహారాలను కొనసాగించడంలో నేనంతగా దేవునిమీద ఆధారపడేవాణ్ణిగాదు. దానిని గూర్చి నేనాలోచించవలసి వచ్చినపుడు తిరుపతి, శ్రీరంగం, రామేశ్వరం, వారణాసి, కురుక్షేత్రం మొదలైన స్థలాలను పవిత్రం గావిస్తున్నట్లు చెప్పబడుతున్న దేవుళ్ళను, వారి అవతారాలను, గ్రామ స్తులు తమ నైవేద్యాలను సమర్పించడాన్ని అనుభవం లేక నేను హేళన చేసేవాణ్ణి.

అందరిచేత ప్రేమించబడుతున్న జాతీయ నాయకు డైన మహాత్మా గాంధీగారిని రక్షించలేని నిస్సహాయ

స్థితిలో ఇతర రాజకీయ ఖైదీలతో పాటు నేను గూడ పడినప్పుడు ప్రార్థన ఒక్కటే దానికి మార్గమని గుర్తించ గలిగాను. అతని క్షేమాన్ని గూర్చిన మా కోరికలన్నియు బలపరచుకోవాలంటే, ఏదైనా శక్తిని, అది ఎంత అదృశ్యంగా వున్నప్పటికీ, ఎంత స్పర్శ కందని దైనప్పటికీ ఎంత చేరలేని దైనప్పటికి దాని నుపాసించడానికి, ఖైదీలుగా మే ముపయోగించుకోగలగ డానికి మా కందుబాటులోవున్న సాధనం ఒకే ఒక ప్రార్థన మాత్రమే. ఏదైతే అసాధ్యమనిపించిందో అని సాధ్యమైనది. మూర్ఖపు పట్టుదలతో గూడిన, మహాశక్తివంతమైన బ్రిటిష్ ప్రభుత్వం హరిజనులయెడ తా ననుసరించదలచిన విధానాలను మార్చు కొన్నది. అందువల్ల బాపూజీ రక్షించబడ్డారు. ప్రాపంచిక ఫలితాల నివ్వడానికి ప్రార్థన ఒక శక్తివంతమైన సాధన మేగాక ఒక పదునైన ఆయుధమనిగూడ నేనప్పు డభిప్రాయ పడ్డాను. ప్రార్థనసుగూర్చి నా విశ్వాసం తిన్నగా బలపడ సాగింది. మరొకసారి గాంధీగారు 1943 లో సామ్రాజ్య తత్వానికి మూలస్తంభమైన చర్చిల్ ఆధిపత్యాన వున్న బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉపవసించి మరణదేవత వక్త్రంనుండి రక్షింపబడినప్పుడు ప్రార్థన నాకొక విశ్వాసంగాను, నా జీవితంలో ఒక భాగంగాను స్థిరపడిపోయింది.

హరిజన, భంగీ వాడలలోను, సేవాగ్రాం, వార్ధాలలోను, వినయాశ్రమం, మదరాసు నగరాలలోను జరుగుతున్న గాంధీగారి ప్రార్థనా సమావేశాలలో భారతీదేవి,

నేను పాల్గొన్నాము. వాటివల్ల మేముద్ధరించబడినట్లు, మా హృదయాలు పవిత్రమైనట్లు, మా మనస్సులు శక్తివంత మయినట్లు మేమెలా ఊహించుకొనే వాళ్ళమో దానిని గూర్చి మేము పలుసార్లు చెప్పుకొన్నాము.

1946లో నేను ఇంగ్లండునుండి మన దేశానికి తిరిగి వచ్చినప్పుడు వారు ప్రార్థనలో మునిగి వుండడాన్ని చూచి నేను ఎంతో ప్రభావితుణ్ణయ్యాను - అది ఢిల్లీలోనున్న భంగీవాడలో. అప్పుడు వారిముందు వేలమంది ప్రజలు ప్రార్థనచేస్తూ కూర్చొని ఉన్నారు. అచ్చట ఆ బక్కపలచని వ్యక్తి, ఆ బాపూజీ, ఆశీనులై వున్నారు. సున్నితమైన తెల్లని ఖాదీ వస్త్రం వారి రొమ్మును కప్పివున్నది. నిమీలిత నేత్రులై కూర్చొని, రఘుపతి రాఘవరాజారాం అనే పాటకు సరిగా తన సన్నని సుదీర్ఘ హస్తాలతో తిన్నగా తాళం వేస్తున్నప్పుడు, తాము పోగొట్టుకొన్న రాజ్యాన్ని సాధించడానికది ఎంతో ఆసక్తితో తమ అరణ్యవాసకాలంలో ఆ వన ప్రాంతాలలోని తమ గృహాలలో, మనం దశాబ్దాల తరబడి ఊహించినట్లుగా, పాండవులెలా ప్రార్థనలు సలిపే వారో దానిని వారు నాకు ఫ్లాష్‌కి తెచ్చారు.

బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా గాంధీగారు జయం పొందుతారని యూరపువాసు లందరూ విశ్వసించారు. కాని జిన్నా తన భయంకరమైన 'వీటో' అధికారాన్ని ఉపయోగిస్తూ వచ్చాడు. అప్పుడు బ్రిటిష్ కార్మిక మంత్రివర్గం, కాంగ్రెస్ అధిష్ఠాన వర్గంకూడ నిరుత్సాహ

పడిపోయినవి. కాని గాంధీగారు మాత్రం మన విజయంలో హెచ్చు విశ్వాసాన్నుంచి పనిచేశారు. వేలాది ఆరాధకులు కూడ వారిలో విశ్వాసముంచారు. నేను నన్ను వారికి సంపూర్ణంగా సమర్పించు కొన్నాను. ప్రార్థనను చక్రాయుధం గావించుకొన్నాను. గాంధీగారు జయించగలరని, వారి ద్వారా భారతదేశం జయించగలదని నేను విశ్వసించాను. వారిలోనున్న ఏశక్తి వారు దేనికోసమైతే నిలబడ్డారో దానినంత టినీ వ్యతిరేకించిన జిన్నాను భయావహుణ్ణి కావించింది. ప్రార్థనయొక్క శక్తి ఎంత నిర్నిరోధమైనదో, ఎంత మహత్తర మైనదో, ఎంతశిక్షణతో కూడుకున్నదో జిన్నాకు తెలుసును గనుక స్వతంత్ర సువార్తనుగూర్చి ప్రచారం చేస్తున్నప్పుడు గాంధీగారు తన ప్రార్థనలను, ప్రార్థనా సమావేశాలను ఉపయోగించడాన్ని అతడు గట్టిగా వ్యతిరేకించాడు.

గాంధీగారు ప్రార్థనా పీఠంనుండి దిగి వస్తున్నప్పుడు నేను వారికి నమస్కరించాను. వారు నా భుజం మీద తన హస్తాన్నుంచి ఇంగ్లండులోను, ఫ్రాన్సులోను నేను పొందిన విజయాలను గూర్చి తెలుసుకొని ప్రశంసించారు. వారు ఆ పక్కనే వున్న పచ్చిక బయలులోనికి వెళ్ళడానికి సిద్ధమైనప్పుడు నన్నుకూడ వారితో రమ్మని సంజ్ఞ చేశారు. ఆ సంధ్యా సమయంలో ఆనందకరమైన ఆ పచ్చని బయలులో నడుస్తున్నప్పుడు మా శక్తి నంతటినీ త్వరగా నిర్మాణ కార్యక్రమంలో కేంద్రీకరించగల సమయం వస్తుందనే ఆశను వారు వ్యక్తపరిచారు.

బాపు:- నీవు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడయినందుకు సంతోషంగా వుందా?

రంగా:-ఏదో కొంత సేవ చేయడానికిది ఒక అవకాశమని నేను భావించాను. కాని అది చాల ప్రతిఘటనను, చాలమంది పోటీదారులను కొని తెచ్చుకోగల స్థానంగా వుంటుందని నేననుకోలేదు.

బాపు:- అందుకు నేను విచారిస్తున్నాను. ఈ క్లిష్ట సమయంలో ఆపదవి నీకు వచ్చింది.

ఏ కాలంలోనైనా అది ఒక బాధాకరమైన బాధ్యతే అవుతుంది.

నేను బాపూజీ సాయాన్ని అర్థించాను. మదరాసు మంత్రివర్గాన్ని గూర్చి, నేను దానిలో ఎలా వ్యవహరించ వలసివుంటుందో, నిర్మాణ కార్యక్రమాన్ని ఎలా ప్రోత్సహించవలసి వుంటుందో, సరియైన పరిపాలన జరిగేటట్లు ఎలా చూడవలసివుంటుందో వాటినిగూర్చి ఇంకా అనేక విషయాలను గూర్చి మేము మాట్లాడాము.

బాపు:- ప్రకాశం, పట్టాభి అనే ఇద్దరు కాకలు తీరిన నాయకులతో నీవు వ్యవహరించవలసి వుంటుంది. నీ విచ్చట లేనప్పుడు నీ వెన్నుకోబడడాన్ని వారు అంగీకరించక పోవచ్చు. ప్రకాశం నిన్ను బలపరచ వచ్చునని నే ననుకొంటాను. పట్టాభి విషయమేమిటి? బాపూజీ నన్ను బలపరచినట్లయితే నేను వారిద్దరి సహకారాన్ని పొందగలననే ఆశను నేను వ్యక్తం గావించాను.

బాపు:- అంత గట్టిగా ఎలా చెప్పగలవు? ప్రకాశం అంత సులభంగా కానివ్వడు? పట్టాభి అంత సహాయకారిగా వుండడు.

[illegible]:- మీ ఆశీస్సులతో
[illegible]:- మన ప్రార్థనలతో అని అను.
[illegible]:- మీ రచ్చట మా మధ్యలో భగవంతుణ్ణి ప్రార్థించి నప్పుడు నేనా విధంగానే ప్రార్థన గావించాను.
బాపు:- అదే సరియైన మార్గం. నీవు అనుభవం గడించావు. నీవు చాలకాలం వేచివున్నావు. దేవుని ఆశీస్సు లందుకొనే అర్హతనీకున్నది.

ప్రార్థనలలో బాపూజీ విశ్వాసం అలాటిది. తన అను చరులు బాధ్యతల్ని స్వీకరించునట్లు ఉత్సాహ పరచడానికి వారు ఉపయోగించే ఆధ్యాత్మిక సాధన మది.

వారి ఆత్మార్పణకు కొన్ని రోజులకు ముందు నేను వారి సాయం సమయ ప్రార్థనలకు వెళ్ళాను.

బాపూజీని హత్య గావించడానికి మతపిచ్చి కలిగిన వారు కొందరు పిచ్చిగా ప్రయత్నిస్తున్నారని అచట చాల మంది గుసగుస లాడుతున్నారు.

నేనా జన సమూహంలో నాలుగో వరస లోనో ఐదో వరసలోనో కూర్చొని వున్నాను - ఆయనాలోచనలతో. ఆ వరకే తమ పనిని ప్రారంభించిన వారు ముందుగానే నన్ను చ్చటే కూర్చోమని చెప్పి వుండి వుండనట్లయితే మొదటి వరసకు తోసుకొని పోవాలని నేను ఆదుర్దాపడి వుండేవాణ్ణి. మంచులాంటి తెల్లని వస్త్రాలను ధరించిన ఆ మహర్షిని నేను చూచి నప్పుడు ఎంత కఠినుడైనప్పటికీ దయారహితుడై వారిని ఎలా తాకగలడని నే ననుకొన్నాను. వారి నాశీర్వ దించడానికని దేవతలు గూడ తిన్నగా వారిదగ్గరకు వస్తారని

నేను తలచాను. తాను కూర్చున్న విధంగా వారు మూడడుగుల ఎత్తుమాత్రమే వున్నారా? కాదు, వారు ఆ సీలాకాశాన్ని అందుకొంటున్నట్లు నేను భావించాను. వారి శిరస్సు నభంలోవున్న తేజో మండలాన్ని తాకుతున్నట్లు, వారి భుజాలు ధ్రువాల వైపు విస్తరించినట్లు, కంచువర్ణంతో కూడిన వారి నెమ్మోము సమీపిస్తున్న సంధ్యారుణ కాంతులలాగా సుందర తమమైవెలుగొందుతున్నట్లు నేనూహించాను.

ప్రజల నుత్తేజపరచిన వారి సేవాత్యాగ గుణాలను మేల్కొలిపిన వారి హృదయాలను దేశభక్తి ప్రపూరితం గావించిన బాపూజీ వారు - వారిని హత్య గావించాలని అనుకోవడానికి మేల్కొనిన ఈ భారతదేశ మనస్తత్వం తమలో లుప్తమైన ఘాతుకు లెవరున్నారు?

మరుసటి రెండు మూడు దినాలలో ఏ మాత్రం ఊహింపరాని సంఘటనలు జరిగాయి. క్రూరులు, దుర్మార్గ శక్తులు వారిని ప్రపంచమునుండి తప్పించడానికి వారి చుట్టూ దొంగతనంగా పరిభ్రమింప జొచ్చారు.

నేను వారిని బిర్లా భవనంలో వున్న పచ్చిక బయలులో కలుసుకొన్నాను. వారు బర్మావారి వెదురు బద్దల టోపీని ధరించి వున్నారు. వారి రొమ్ముమీద వస్త్రంలేదు. వారి కాళ్ళు సూర్యరశ్మి సోకడాని కని చాచబడివున్నవి. వారి ఒడిలో కొన్ని కాగితాలున్నవి. వారు అలసినట్లు కన బడుతున్నారు. వంకర తిరిగిన భుజాలమీద వయస్సు గట్టిగా

ఆవేశకావేశాలు కనబడుతున్నది. దానిని చూచి నామనస్సు చెప్పలేనన్నది. మాకు సానుభూతిని తెలుపుతున్నట్లుగా వారు తలమ వంచి నన్నుతూ మమ్మల్ని ఆహ్వానించారు. అప్పుడు హృదయంలో తప్పని సరిగా ఏదో విపత్తు సంభవిస్తుందని పించింది.

బాపు:- రంగా, నీవిప్పుడు కార్యవర్గంలో నున్నావు. ఈ నాయకులతో సన్నిహితంగా వుండి పనిచేయడానికి నీవు నేర్చుకోవాలి. నీవు సిద్ధంగా వున్నావా?

రంగా:- మీరు మాతో ఉన్నప్పుడు నాకా భయమెందుకు? ఎన్నడో కొత్త ఎత్తుగడను వేసినా వారి ప్రతిపాదనను విమర్శించినా, వారి విమర్శలకు ప్రతి విమర్శలను గావించినా నేను మొట్టమొదట మీ వైపు చూస్తుండడాన్ని మీరు గమనించలేదా?

బాపు :- ఎందుకోసమని? నేను నా మౌనంద్వారా నిన్ను నడిపించలేను.

రంగా :- మిమ్మల్ని చూస్తూనే మీ మౌన సందేశాన్ని కొద్దిగా తెలుసుకొనడానికి నేనిదివరకే చాలినంతగా నేర్చుకొన్నా ననుకొంటాను.

బాపు : నీవంత గట్టిగా ఎలా అనుకోగలవు?

రంగా: మిమ్మల్ని చూస్తూనే మీ సలహాను లేక మీ హెచ్చరికను, లేక మీసమ్మతిని ఎలా అర్థం చేసుకో గలుగుతున్నానో నాకు తెలియదు. బహుశా నా ప్రార్థనాయుత ధ్యానంవల్ల మీ రేమనుకొంటు న్నానో నాకు తెలుస్తున్నదనుకొంటాను. అది నాకు సాయపడుతున్నది.

బాపు :- నీవు జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి పనిచేయ గలిగితే సర్దార్ నీకు సాయం చేయగలడు.

రంగా :- నేను ప్రయత్నిస్తాను. సహకారానికి ఇద్దరి ప్రయత్నమూ అవసరమౌతుంది.

బాపు: నీవు జవహర్‌లాల్ నెహ్రూయొక్క సహకారాన్ని పొందగలగాలి. అతనితో సహకరించడానికి నీ కిష్టం లేనందువల్లనా నీవతనితోకలిసి పనిచేయలేకున్నావు? నీ భావాలను పరిశీలించుకో-నీ హృదయాన్ని పవిత్రం గావించుకో.

రంగా :- నే నతణ్ణి కంట్రోళ్ళ విషయంలోనే వ్యతిరేకిస్తున్నాను. అతని నియంతృత్వ ధోరణిగాని నైతుల యెడల అతనికున్న దృక్పథంగాని నా కిష్టంలేదు.

బాపు :- రంగా, మీ మధ్య వుండడాని కిక ఏ మాత్రం ఆసక్తి లేదు. నేను అలసిపోయినట్లు భావిస్తున్నాను. ప్రజల బాధలనే మంటలను చూస్తూ మిణకరించలేను. ఈ హత్యలు, ఈ కత్తుల ధ్వనులు నన్ను గాయ పరుస్తున్నవి. నా దేహం మొత్తం రక్తం కారు తున్నట్లనిపిస్తున్నది.

వారు బాధపడుతుండడాన్ని చూచి మేమందరం గూడ వ్యక్తం చేయలేని బాధ ననుభవిస్తున్నామని నేను వారికి చెప్పాను.

బాపు :- మీ భావాలు మన సహచరుల చర్యలు-బాధను నివారించగల మృదువైన పిల్లతెమ్మెరలే. కాని

నా హృదయం అగ్నిజ్వాలలమీద నున్నది. పోయిన ప్రతి ప్రాణము, ఈ దయారహితకాలంలో కష్టపెట్టబడి బాధ పొందిన ప్రతి హృదయము నా గుండెను చీల్చి వేస్తున్నది.

రామకృష్ణ పరమహంస ఉదయాన కాళీఘట్టంలో స్నానం చేయడానికి వెడుతూ వున్నప్పుడు గేదెపైబడిన ప్రతిదెబ్బకు అతని దేహం వాచిపోవడం అప్పుడు నాకు గుర్తుకొచ్చింది.

బాపు :- ఇవన్నీ మంటల సర్పాలనిపిస్తున్నవి నాకు. ఓహ్! నాకు నేత్రాలను మూసుకొందామని వుంది. కాని అవి మూతపడడంలేదు. కొన్ని దర్శింపరాని ఆఘాతాలు, కొన్ని ఆలకించలేని దెబ్బలు నా కనురెప్పల్ని ఇంత ఎండి పోయినట్లుగా, ఇంత బరువుగా చేసివేస్తున్నవి.

ఆ మాటలు వినగా నా మనస్సు కెంతో బాధకలిగింది.

రంగా :- బాపూజీ! ప్రార్థన ఒక్కటే మన కోదార్పు కలిగించేది. అదొక్కటే మన హృదయాలను కరుణతో నింపగలిగేది.

బాపు :- నాకు ఎంతో నిద్రపోవాలనుంది. కాని నేను నిద్రించలేకున్నాను. నిద్రలోగూడ నేను మేల్కొన్నట్లే అనిపిస్తున్నది. నాకీ భూమాత గర్భంలోకి వెళ్ళిపోవాలనిపిస్తున్నది.

బాపూజీ బాధను చూచి నేను ఓర్చుకోలేకపోయాను. నే నింకా అచ్చట వుండి వారిచేత మాట్లాడించడానికి నాకు ధైర్యం చాలకపోయింది. అందువల్ల నేను వారి మోకా

ళ్ళను తాకాను. వారు శిరస్సునిమిరి తన హస్తాన్నుంచారు. అప్పుడు నేను శాంతియుతంగా ప్రార్థన గావించడాని కనువుగా అచ్చటనుండి తిన్నగా వెళ్ళిపోయాను.

కొన్ని దినాల తరువాత - అవి గంటలలాగా అని పించాయి - మన సమాజంలోనున్న క్రూరశక్తుల ప్రతినిధి చేత వారు హత్య గావించబడ్డారు. మన పాపాలకు పరి హారంగా ఏనిద్రను, శాంతినై తే వారు పొందాలనుకున్నారో ఆ నిద్రను, శాంతిని వారు పొందగలిగారు.

(i) రంగాజీని 'వ్యవసాయం, ఆహారం' శాఖల మంత్రిగా చేర్చుకో మని, ఆ బాపూజీ సలహాచేసిరి. సర్దార్ జవహర్‌లాలు కోరినట్లుగా చేర మన్నారు. బాపూజీతోపే తాను రైతులకు ఆర్థిక సంకెళ్లు (Food controls) వేస్తూ మంత్రిగా వుండడం యిష్టము లేదని రంగాజీ చెప్పిరి. కంట్రో ళ్లను తొలగిస్తూ వుండడానికి నెహ్రూ అంగీకరిస్తే, ఆలోచించగల నన్నారు. ముందుగా చేరమనండి, అనుభవాన్ని బట్టి యెంతగా, యెటుల కంట్రోళ్ళు అవసరమో, లేక తగ్గించవచ్చో ఆలోచించుకొందాం. నాతో సహకరించడానికి రంగాకు యిష్టమైతే అన్నీ సర్దుబాటు అగునన్నారు. ఆయన మంత్రిగా చేరి, వివాదపడుతూ వుండడం తన కిష్టములేదన్నారు రంగాజీ.

ii) బాపూజీ నిర్యాణమునకు మూడు దినాలు ముందుగా పల్కిన యీ 'హృదయ తాప' కథను 1969 లో గాంధీ శతజయంతి వత్సర స్మృతులను, అబిసీనియా, సూడాను, యీజిప్టు, స్పెయిను, ఫ్రాన్సు, యింగ్లండు దేశాలలో జరిగన సభలలో రంగాజీ ప్రకటిస్తూ వుండిరి.

సం.

4. హరిజన, సవర్ణ సమానత్వము

1933 లో గుంటూరుజిల్లాలో జరిగిన హరిజన సేవా
[illegible] పర్యటన కార్యక్రమం ఆ జిల్లాలోని గ్రామీణ
ప్రాంతాల సాంఘిక వాతావరణాన్ని ఎలా మార్చివేసిందో
ఈ విషయాన్ని గాంధీగారు థక్కర్ బాబాద్వారా ఆలకించి
నేను గావిస్తున్న హరిజన సేవనుగూర్చి ప్రశంసించారు.
నాచేత ప్రవేశపెట్టబడిన అంతఃవర్ణ సహపంక్తి భోజనాలు
సనాతనులకు కోపం తెప్పించి వారిని తాను ప్రారంభించిన
అఖిలభారత అస్పృశ్యతా ఉద్యమానికి వ్యతిరేకం గావిస్తా
యేమోనని వారు భయపడ్డారు. చాల పట్టుదల పట్టడం
వల్ల మన మెంతవరకు హరిజనోద్ధరణోద్యమాన్ని తీసుకొని
వెళ్ళగలమో అంత దనుక సవర్ణుల హృదయాలను కదలించి
వారు తమ ప్రతిష్ఠకు భంగం కలుగకుండా అస్పృశ్యతా
నివారణను ఆహ్వానించ గలిగేటట్లు చేయగలమని నేను
గాంధిగారితో అన్నాను. అలాటి అవకాశం కలుగవచ్చునని
వారు అంగీకరించారు. మేము తలపెట్టిన ప్రతి కార్యక్రమా
నికి సవర్ణ లేమనుకొంటారో జాగ్రత్తగా పరిశీలించమని
వారు నన్ను కోరారు. హరిజన గ్రామమైన తాళ్ళపాలెంలో
1933 లో మేము జరిపిన అంతర్వర్ణ సంతర్పణకు దేశో
ద్ధారక నాగేశ్వరరావుగూడ వచ్చాడని, ఆ విందులో
పాల్గొనడాని కతడు నిడుబ్రోలునుండి మూడుమైళ్ళు నడచి
వచ్చాడని నేను గాంధీగారితో చెప్పాను. ఆ విందుకు వంట

వారు, వడ్డించినవారు, విందులో సహపంక్తిలో కూర్చున్న వారు హరిజనులేనని కూడ చెప్పాను.

బాపు: అతడు నిజంగా దేశోద్ధారకుడే. అతని తోడును సాధించుకొన్నందుకు నిన్ను నేను అభినందిస్తున్నాను.

రంగా :- నా సవర్ణ హిందూ స్నేహితులలో ఒకడైన రేపల్లి తాలూకా పెదపులివర్రు గ్రామస్తుడైన, వైతు కుటుంబానికిచెందిన గుత్తా చలమయ్య అనే వ్యక్తి తన చెల్లెల్ని ఒక విద్యావంతుడైన హరిజన యువకుని కిచ్చి పరిణయం గావించాడు.

బాపు :- ఏమిటి? మీరు దానినికూడ సాధించారా? తుట్టతుదకు హిందూ సమాజం ఆ వైపుకు నెట్టి వలసి వుంటుంది. నీ అనుచరులెంత అద్భుతమైన వారు! వారు హిందూ ఎవరెస్టు శిఖరాన్ని మట్టం గావించారు.

అది సరే! ఆ కుటుంబంయొక్క నిర్ణయాన్ని బల పరచడానికి నీవూ, మీ హరిజన పర్యటన కావలసి వచ్చింది. వారి తలిదండ్రులు, స్త్రీలు దానికి సమ్మతించారా?

రంగా :- సమ్మతించారు బాపూజీ. వారు చాల సంతోషముగా వున్నారు. అన్ని భయాలను పోగొట్టడానికి మీరే ఒక రక్షు. ఏనిషేధాన్నెంచడానికైనా మన సత్యాగ్రహులుండనే వున్నారు.

ఏడేళ్ళ తరువాత, మా సహచరులలో ఒకడైన [illegible] మూడవల్లి రామబ్రహ్మం ఒక ప్రజారంజకమైన "మాల పిల్ల" ని చిత్రాన్ని తీయడం సంభవించింది. అందులో ఒక హరిజనకన్యను ఒక బ్రాహ్మణయువకుడు పరిణయమాడాడు. రామబ్రహ్మం నిర్మించిన "రైతు బిడ్డ"అనే మరొక చిత్రం జమీందార్లు వ్యతిరేకించడంవల్ల ప్రభుత్వంచేత నిషేధించ బడింది. మాలపిల్ల చిత్రం ఎచ్చట చూచినా మంచిపేరు తెచ్చుకొన్నది. ఆ చిత్రంవల్ల గ్రామీణ ప్రజా హృదయా లలోగూడ ఎంతో మార్పు వచ్చింది. ఆర్య సమాజంవారు, సెల్ఫ్ రెస్పెక్టర్లు, వీరేశలింగం, రామస్వామి చౌదరి దేశో ద్ధారకుడు, బాపూజీ మా హరిజన సేవాదళం కలిసి అర్ధ శతాబ్దంగా చేసిన ప్రచారంకంటె అది హెచ్చు ప్రచారం గావించింది.

కొన్ని ఏళ్ళయిన తరువాత, 1947లో, తన రెండు ఉపవాసాల ఫలితంగా హరిజనులకు ప్రవేశమివ్వబడిన దేవా లయాలు హరిజనుల నుపయోగించుకొన నిచ్చిన బావులు ఆలాగే వారికుపయోగ పడుతున్నాయా? అని గాంధీగారు నన్ను ప్రశ్నించారు. హెచ్చుమంది హరిజనుల్ని దగ్గర చేరుస్తున్నారని నేనన్నాను.

రంగా: పాకాలనుండి, చిత్తూరునుండి ఒక ప్రత్యేకరైలు నిండుగా వచ్చిన హరిజనులు తిరుపతిలోనున్న వెంక టేశ్వరాలయాన్ని ముంచెత్తారు. హరిజన నాయకుడైన బి.ఎస్. మూర్తి, రైతునాయకుడైన ఎన్.వి. నాయుడు ఆ ప్రవేశఉద్యమానికి నాయకత్వం వహించారు.

బాపు: ఏమిటి? దేవుణ్ణి ముంచెత్తడాన్ని నీవు నమ్ముతున్నావా?

రంగా: శతాబ్దాలకు ముందు ఒక్క భక్తనందనారు మాత్రమే దేవాలయ ప్రవేశాన్ని కోరాడు. ప్రస్తుతం హరిజను లందరూ దానిని కోరుతున్నారు. దేవుని తలుపుల్ని హరిజనుల కోసం నేడు హిందూ సమాజం ఒక తుఫాను పద్ధతిలో తెరిచి వేస్తున్నది.

బాపు: ఆంధ్రులు చాలమంచివారు. వారెల్లప్పుడూ నన్ను ప్రేమించారు. వారు పెదనందిపాడు ఉద్యమాన్ని నడిపారు, ఇప్పుడీ మహోద్యమాన్ని నడుపుతున్నారు.

5. వ్యక్తిగత సత్యాగ్రహము
పూనా వీ. ఐ సి. సి. 1933

పూనాలో అఖిల భారత కాంగ్రెస్ సంఘం లాంఛనంగా సమావేశమై జాతీయ ఉద్యమాన్ని వ్యక్తిగత సత్యాగ్రహ ప్రాతిపదికపై నిర్వహించడానికి నిర్ణయించిన వెంటనే సామూహిక సత్యాగ్రహంయొక్క రెండవదశ ఒక అంతానికి వచ్చింది. పూర్తి రాజకీయ పద్ధతిలో ఉద్యమాన్ని నడపకుండా హరిజనోద్ధరణపై కేంద్రీకరించాలని గాంధీగారు చెప్పిన దానిని ఆసమావేశ చర్చలలో పురుషోత్తందాసు టాండన్ ధైర్యంతోవిమర్శించారు. తనకు చాలాదగ్గరగానున్న వారే రాజకీయ ధర్మాన్ని, ఆశ్రమ క్రమశిక్షణను ఉల్లంఘించడంవల్ల కాంగ్రెస్సులోని పెక్కు లోపాలవల్ల సమస్త సత్యాగ్రహాన్ని తాను నిలుపుదల చేస్తున్నట్లు గాంధీగారు గావించిన ప్రకటనను చూచి కోపోద్రిక్తులైన కొందరు కాంగ్రెస్ యువకుల ప్రతినిధి అతడు. సత్యాగ్రహ ఉద్యమాన్ని ఆపుదల చేయవలసిన సమయం ఆసన్న మయిందని చెబుతూనే ఆసమావేశంలో నేను గాంధీగారిని సమర్థించాను. హరిజనోద్యమానికి గాంధీగారిచ్చిన ప్రాధాన్యత చాలా న్యాయమైనదని నేనన్నాను. హిందూ సమాజంలో పదోవంతుగా వున్న హరిజనుల ఉద్ధరణ జరగకుండా స్వరాజ్య ఉద్యమానికి కావలసిన బలం చేకూరదుగనుక ఆఉద్యమాన్ని నిర్వహించడంలో కాంగ్రెసు కార్యకర్తలందరూ తమ శక్తి నంతటినీ కేంద్రీకరించాలని నేను విజ్ఞప్తి గావించాను.

మహాసభ పూర్తయ్యే ముందు, నేను బాపూజీ సమయాన్ని కొంత తీసుకొన్నప్పుడు వారు నా వాదానికి సంతృప్తిని వెల్లడించారు. నేనుగూడ ఇతరులలాగే కాంగ్రెసు లోని ఆంతరంగిక వ్యక్తిగత దృష్టి, సమష్టి క్రమశిక్షణను అలక్ష్యం చేస్తున్నట్లు భావించి వారందుకు తన ఆశ్చర్యాన్ని వెల్లడించారు. నేను ఆంధ్ర, తమిళనాడు, మలబారు ప్రాంతాల రైతులను వ్యవస్థీకరించడంలోను, శిస్తు వ్యతిరేక ఉద్యమాలను, జమీందారీ వ్యతిరేక పోరాటాలను నడపడంలోను నిమగ్నమై వున్నానని, అంతేగాక జమీందారీ ప్రాంతాలలోని రైతుల స్థితి గతుల్ని పరిశీలించడంలో మునిగి వున్నానని వారితో చెప్పాను. అందువల్ల నేను వ్యక్తిగత సత్యాగ్రహం సలుపలేనందుకు విచారాన్ని వెలిబుచ్చాను.

బాపు: ఈ ఉద్యమాలు చాల అవసరమైనవని నీవు భావించావా? ఇవి మనకెప్పుడూ ఉన్న సమస్యలే గదా?

రంగా: బాపూజీ ! నేనీ ఉద్యమాలలో తల మునకలై వున్నాను. ఇదివరకే మేము భూమిశిస్తు నిలుపుదలకు, వ్యవసాయ ఋణాల ఆపుదలకు రైతు యాత్రలను జరిపి వున్నాము. జమీందారీ రైతుల స్థితిగతులను గూర్చిన పరిశీలన ఇంకా సగంలోనే వుంది.

బాపు: హిందీ, ఖాదీ కార్యక్రమాలలో పని చేస్తున్న వర్కర్లకు-జైలుకు వెళ్ళకుండా వుండడానికి నేను నా అనుమతి నిచ్చాను. అందువల్ల నీవీ కార్యక్ర

మాన్ని గూడ నిర్మాణ కార్యక్రమంలో భాగంగానే వుంచమంటావా?

రంగా: హరిజనుల కోసం పనిచేసే వారిని గూడ ఈ బాధ్యత నుండి తప్పించాలి.

బాపు: నీతో నేనేకీభవిస్తున్నాను. కాని ఈవిధంగా జైలుకు పోకుండా వుండగోరువారు నిర్మాణ కార్యక్రమంలో చక్కగా పనిచేసేటట్లు చూడాలి.

గాంధీగారు జైలుకు పోకుండా భారత దేశంమొత్తం ఒకసారి పర్యటన గావించాలని నేను వారితో అన్నాను. హిందూ సమాజంలో హరిజనుల స్థానాన్ని బలపరచడానికి వారు చేసిన విజయవంతమైన ఉపవాసంవల్ల, జైలులో వున్న మేమందరం ఎలా ప్రభావితులమైనామో నేను వారికి చెప్పాను. అస్పృశ్యతా నిషేధం హిందూమతంమీద వున్న మచ్చను తుడిచివేస్తుంది గనుక దానికి సంబంధించిన చరిత్రాత్మక ప్రాధాన్యత గల పూనా సంధిని బలపరుస్తూ నేను చేసిన ఉపన్యాసాన్ని తాను మెచ్చుకొన్నానని బాపూజీ నాతో అన్నారు. ఆనాడు వారిని విమర్శిస్తున్న వ్యక్తులను వ్యతిరేకించి ఎంతో కాలంముందే రావలసిన ఆ సాంఘిక విప్లవానికి ప్రారంభోత్సవం గావించిన వారి నాయకత్వాన్ని సమర్థించగలిగి నందుకు నేనెంతో ఆనందించాను. శైతు ఉద్యమం విషయంలో నేనెంతగా పని చేస్తున్నానో అంతగా హరిజన సంక్షేమం కోసం గూడ కృషి చేస్తానని నేను వారికి హామీ నిచ్చాను.

6. పార్లమెంటు కార్యక్రమం
కాంగ్రెస్ సామ్యవాదం

1934లో పాట్నాలో జరుపబడిన అఖిలభారత కాంగ్రెస్ సభ్యుల సమావేశం గూడ పూనా మహాసభ లాగా లాంఛన ప్రాయంగానే జరిగింది. కాని ఈ సారి ఈ మహాసభ జాతీయ ఉద్యమాని కొక కొత్త రూపు నివ్వడానికి జరుప బడింది. వ్యక్తిగత సత్యాగ్రహం అంతిమదశకు వచ్చింది. బ్రిటిష్ అధికారులతో పోరాడడానికి శాసన సభలు మంచి కేంద్రాలని ప్రజల ఆలోచనలు వాటివైపు వెళ్ళినవి.

ఆలోగా, ఆర్థిక కార్యక్రమాన్ననుసరించి పోరాటా లను నడిపేపద్ధతికి ప్రముఖస్థానాన్నివ్వడానికై కాంగ్రె స్సులో ఒక సామ్యవాద పక్షాన్ని ఏర్పాటు చేయడానికి కావలసిన వాతావరణాన్ని కల్పించడానికని మాలో కొందరి చేత పూనాలో ఏర్పాటు చేయబడిన ఉపసంఘం తన నివేదికను, ఆర్థిక కార్యక్రమాన్ని మాకు సమర్పించింది. అందువల్ల మేమచట కాంగ్రెసు సామ్యవాద మహాసభను జరిపాము.

దురదృష్టవశాత్తు ఈ మహాసభాచర్చలకు ఒక వింత వ్యాఖ్యానం చేయబడింది. 1920-30 మధ్య శాసనసభ ప్రవేశాన్ని సమర్థిస్తూ వాదించిన 'ప్రో-చేంజర్ల' మధ్య వాటిని బహిష్కరించాలనే 'నో-చేంజర్ల' మధ్య జరిగిన వివాద పరిణామమే ఆ వ్యాఖ్యానం. ఆ మహాసభ జమీం దారీ, రైత్వారీ ప్రాంతాలలో వున్న రైతుల సమస్యలను

పరిష్కరించడానికి, కర్మాగారాలలో పనిచేస్తున్న కార్మికులకు సౌకర్యాలు కల్పించడానికి కావలసిన కార్యక్రమాన్ని రూపొందించడంపై కేంద్రీకరిస్తుందని నే నాశించాను. కాని ఆ మహాసభలో చాలమంది బొంబాయి, కలకత్తా, పాట్నా, పూనా, బెనారెస్, లాహోర్ మొదలయిన పట్టణాల నుండి వచ్చిన సోషలిస్టు లందరూ గాంధీగారితో తమకున్న సిద్ధాంత విభేదాలను గూర్చి చెప్ప నారంభించారు. మార్క్సిస్టు సిద్ధాంతాలను యూరపు ఖండవాసుల ఘోరణిలో దొర్లించసాగారు. అంతకంటె అధ్వాన్నమైన విషయమేమంటే వారు జవహర్‌లాల్ నెహ్రూ శాసన సభా ప్రవేశాన్ని వ్యతిరేకించారని, 'విదర్ ఇండియా' అనే అతని గ్రంథం లోని అభిప్రాయాలను మేము ఖాతరుచేసే టట్లయితే డాక్టర్ అన్సారీ, భులభాయ్ దేశాయ్, సత్య మూర్తి ప్రతిపాదిస్తున్న కొత్తవిధానాన్ని వ్యతిరేకించవలసి వుంటుందని, వారందరూ అభివృద్ధి నిరోధకులని చెప్ప సాగారు. అది నాకు చాల ఆశాభంగాన్ని కలిగించింది.

ఆ స్నేహితులనుండి నేను వేరుపడ దలచలేదు - వారిలో చాలమంది కలకత్తా జైలులోను, చైతు ఉద్యమం లోను నాకు మిత్రులుగా వుండినారు. కాని నేను మహాత్మా గాంధీకి విధేయుడుగానే ఉండదలచుకొన్నాను. అందువల్ల నేను గాంధీగారివద్దకు వెళ్ళి బాపూజీకి, జవహర్‌లాలుకు మధ్య అంత గట్టి భేదమేదైనా వున్నదా అని ప్రశ్నించాను. జవహర్‌లాల్ సామ్యవాద దృక్పథాన్ని కలిగి వుండినప్పటికీ అతడు తనతో పనిచేస్తున్నాడని వారన్నారు. అయితే

ఇప్పుడు శాసనసభలలో కాంగ్రెస్ ప్రవేశించాలని అఖిల భారత కాంగ్రెస్ సంఘం తెచ్చిన యీ మార్పుకు జవహర్ లాల్ వ్యతిరేకంగా వున్నాడా - అని వారిని అడిగాను.

బాపు :- నీ ఉద్దేశ మేమిటి?

రంగా :- ఎన్నికలలో కాంగ్రెస్ బ్రిటిష్ ప్రభుత్వాన్ని సవాలు చేయాలని, కాంగ్రెస్‌వారు శాసనసభలకు వెళ్ళాలని నా యభిప్రాయం.

బాపు :- ఎందుకు మనం శాసనసభలకు వెళ్ళాలంటావు?

రంగా :- భూస్వాములు, వ్యాపారులు, పారిశ్రామికులు బ్రిటిష్ ప్రభుత్వంతో కలుసుకొని మన రైతులకు, కూలీలకు, కళాకారులకు వ్యతిరేకంగా శాసనాలు చేయకుండా అడ్డుపెట్టడానికి వీలుగా మనం శాసన సభలకు వెళ్ళవలసి వున్నది.

బాపు :- మీకెలా మెజారిటీలు లభిస్తాయి? ప్రజలకోసం మీరేమి శాసనాలను చేయగలరు?

రంగా :- నిజమే - శాసనసభలలో చాలమంది ప్రభుత్వ నియమితులైన సభ్యులుండడంవల్ల మాకు మెజారిటీలు రాకపోవచ్చు. కాని ప్రజావ్యతిరేక శాసనాలు చాలవరకు ఆమోదించబడకుండా చూడడానికిమాకు వీలుంది. అంతేగాక ప్రజలు హెచ్చు శిస్తులవల్ల, గ్రామీణ ఋణాలమీద నున్న హెచ్చు వడ్డీ రేట్ల వల్ల, జమీందారీ విధానంవల్ల చాల బాధలు పడు తున్నారు.

బాపు:- మీ శాసనసభ్యులు మీశత్రువులతో చేరిపోకుండా ప్రజల అభ్యుదయంకోసం కృషి చేస్తారని, నీకు నమ్మకమున్నదా?

రంగా :- ప్రజలకు చాల మంచే జరుగుతుంది. కొందరు ప్రభుత్వంవైపు తిరిగిపోయినప్పటికీ చాలమంది కాంగ్రెస్ శాసనసభ్యులు ప్రజాభ్యుదయం కోసమే కృషిచేయగలరు.

బాపు :- ఎందువల్ల ఈ శాసనసభలంటే నీకంత యిష్టంగా వున్నది? మనం ఇంతకుముందే ఈ ప్రయోగాన్ని చేసివున్నాము. మోతీలాల్ కూడ వాటినిగూర్చి విసుగెత్తివున్నాడు.

ఆ తరువాత నేను ప్రపంచ ఆర్థిక మాంద్య మేర్పడడంవల్ల, ప్రజల కేలాటి కష్టాలు కలిగాయో, భూముల ధరలు పడిపోవడంవల్ల లక్షలాది రైతు లెలా తమ కమతాలను పోగొట్టుకొంటున్నారో గాంధీగారికి చెప్పాను. వ్యవసాయ ధరలు నూటికి యాభైవగత్తులు పడిపోయాయని, ఇట్టి సమయంలో కాంగ్రెస్ శాసనసభ్యులు రైతులకు ఎంతో సాయం చేయడానికి వీలుంటుందని, కొన్ని సంవత్సరాల అనుభవంమీద ఈ ప్రయోగం నిష్ఫలమని తోస్తే దానిని వదలివేయవచ్చునని నేనన్నాను.

రంగా :- బాపూజీ, మీ జీవితం సత్యంకోసం చేస్తున్న ఒక ప్రయోగమని మీరన్నారు. పూనా నిర్ణయం అంత కంటె వేరని మీరనుకొంటారా?

బాపు :- కాని నీవు సామ్యవాదులతో వున్నావుగా! వారితోనే ఎందుకు వెళ్ళవు?

రంగా :- బాపూజీ! నేను గాంధేయ సామ్యవాదిని. నా సామ్యవాదం శ్రేతులకోసం. అది మార్క్సిజము కాదు. ఎంతవరకు దీనికి మీ అంగీకార ముంటుందో ఎంతవరకు మీరు దీనిని వ్యతిరేకించరో అంతవరకు నేనీ ప్రయోగాన్ని సమర్థించ దలచుకొన్నాను.

బాపు :- నీవు నా సమ్మతిని పొందజూస్తుజ్నావు. నన్ను నీ వొక సామ్యవాది గావించదలచుకొన్నావా? నేను సామ్యవాదిని కావాలో లేదో నేనింకా నిర్ణయించుకోలేదు. నేనలా అయితే జవహర్‌లాల్ చాల సంతసిస్తాడనుకొంటాను.

రంగా :- నాకు మీ యాశీస్సు లుంటే చాలు.

శాసనసభలలోనికి కాంగ్రెసువారు పోవడం తప్పనిసరియని, ఎ.ఐ.సి.సీ. పాట్నాలో 1934 సమావేశంలో తీర్మానించినది. దాన్ని తానెందులకు బలపరచిరో రంగాజీ గాంధీజీకి వివరించిరిగదా: 1935లో తాను సెంట్రలు అసెంబ్లీకి ఎన్నికైన తరువాతనే అఖిలభారత కిసాను కాంగ్రెసును యేర్పరచగల్గడం, జమీందారీ రద్దు, ఆందోళన అఖిలభారత నినాదంగా పెంచగల్గడం, 1937-39లో కాంగ్రెసు మంత్రివర్గా లేర్పడ్డ పిమ్మట, పర్మనెంటు సెటిల్‌మెంటు రద్దు, జమీందారీలు పోవలసిందే ననడం, శ్రేతాంగ ఋణవిమోచనం జరుగుట సాధ్యమైనవిగదా:

7. హరిజనవాడలో సమావేశాలు 1935-'36

చలికాలంలో ఒక మధ్యాహ్నం కేంద్ర శాసన సభలోనున్న కాంగ్రెస్ సభ్యుల మందరం గాంధీజీని ఒక హరిజన కాలనీలో కలుసుకొన్నాము. ఆ వాడ చాల దూరంలో నున్నది. భారతీదేవి, నేను ఒక గంటకాలం టాంగాలో ప్రయాణం గావించి ఆ వాడను చేరుకొన్నాము. ఒకప్పుడు మేమా విశ్వవిద్యాలయం ప్రాంతంద్వారా వెళ్ళి వున్నాము. అది దాదాపు బయలు ప్రదేశమనే చెప్పాలి. అది అంత ఆకర్షణీయంగా గూడలేదు. బిర్లా భవనంలో హాలులో ఉండడానికి బదులు బాపూజీ తానుండడానికి ఎందు కాలాటి అధ్వాన్న స్థలాన్ని ఎన్నుకొన్నాడా అని చాలమంది సభ్యులు గొణుగుకొన్నారు. 'అలా చేయకపోతే ఆ దరిద్రనారాయణులైన, అవకాశరహితులైన ఆ హరిజనులతోడి వారు తన భూతి ఐక్యతను ఎలా నిరూపించుకోగలరు?' అని నేను వారిని ప్రశ్నించాను.

బాపూజీ మా మధ్యకు వచ్చారు. వారు తన మృదువైన, అందరికీ పరిచయమైన చిరునవ్వుతో మమ్మల్ని పలకరించారు. అంచులో మూగివున్న స్త్రీలవద్దకు ఈ అడ్డదారిలోవెళ్ళి భారతీదేవిని గుర్తించి వారిలో చాలమందిని ముందుకు తీసుకొనివచ్చారు. వారు ఎప్పటిలాగే మందపు దుప్పటిని కప్పుకొని కుర్చీలో కూర్చున్నారు.

తన సందేశాన్నివ్వమని బూలభాయ్ గాంధీగారిని అర్థించారు. బాపూజీ ఒక నిమిషం మౌనం వహించారు.

మా ఎన్నికను గూర్చి వారు సంతృప్తిని వెలిబుచ్చారు. షేర్వానీని సభాధ్యక్షుడుగా మేము ఎన్నుకొనలేనందుకు వారు విచారించారు. జాతీయ పోరాటానికి మేము ఉప యోగపడగలమని వారు భావించారు.

బాపు :- మన పోరాటాన్ని కొనసాగించడానికి మీరిచ్చటికి వచ్చారన్న విషయాన్ని దయచేసి మరచి పోకండి. శాసనసభా కార్యక్రమానికే అంకిత మవ్వుదామని అనుకోకండి. బ్రిటిష్‌వారిని మీరోడించవలసిన కోటలలో శాసనసభ ఒకటి మాత్రమే. మీలో చాలమంది గ్రామీణ ప్రాంతాలలో హెచ్చుగా పనిచేయడానికి అలవాటుపడిన వారని నాకు తెలుసు. శాసనసభలో మీరు చేస్తున్న పని చాల ఉత్సాహ రహితంగా, జ్ఞాన వర్ధకం కానిదిగా వుంటుంది. అందువల్ల మీ ప్రక్కనున్న గ్రామాలకు వెళ్ళి వారి సమస్యలను పరిశీలించి వారికి సాయపడడానికి సాంఘిక సంస్థలను పెంపొందిస్తూ వుండమని మీకు నా సలహా. తనకోసం పోరాడడానికే దేశం మిమ్మల్ని పంపిం దన్న విషయాన్ని మీరు గమనం పెట్టుకోండి.

గాంధీగారి మాటలు పూర్తయిన తరువాత నేను, భారతీదేవి వారిని కలుసుకొని కొన్ని నిమిషాలు గడిపాము. వారామెను చాల ప్రేమతో ఆశీర్వదించారు. ఢిల్లీ చలి గాలి జాగ్రత్తగా వుండమని ఆమెకు సలహా యిచ్చారు. తరువాత ఆమె ఇంగ్లాండులో ఉండిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని.

బాపు :- ఆఁ ఇంతకంటె హెచ్చుచలికి నీవు అలవాటు పడివున్నావు. రంగా నీవిచ్చటికి వచ్చినందుకు చాల సంతోషం. నీ వప్పుడే గ్రామపీడితులయిన గుజరాత్, రాయలసీమ ప్రజలకోసం కష్టపడి పనిచేస్తున్నానని వల్ల భాయి నాతో అన్నాడు నీ వాలాటి పనికి తగినవాడవని నాకు తెలుసు. కాని బూజా భాయితో సహకరించి పని చేస్తున్నప్పుడు జాగ్రత్తగా వుండు. అతడు చాల మంచి వాడే కాని కొంత ఓర్పులేనివాడు. అతడు గొప్ప బొంబాయి న్యాయవాది.

రంగా :- నేను గిరితో చాల సన్నిహితంగా పనిచేస్తున్నాను.

బాపు :- అతడు మంచివాడే. అతడు కార్మికులకోసం పని చేస్తున్నాడు. మీ రిద్దరు మంచి జట్టు.

బాపూజీ మరలా ఒక సంవత్సరం తరువాత వచ్చి ఆ వాడలోనే బస చేశాడు. నేను ఒక ప్రత్యేక గోష్ఠిలో వారిని కలుసుకొన్నాను. ఇంతకుముందు వానిని దర్శించి నప్పుడు అచ్చటి విషయాలన్నిటిని ఛక్కగా బాబా చూచు కొనేవాడు. ఇప్పుడు ఆచార్య మళ్ళీ అచ్చట వున్నాడు. బాపూజీ 1933 లో ఆంధ్రరాష్ట్ర పర్యటన గావించినప్పు డతడు వారి కార్యదర్శిగా వచ్చివున్నాడు. అప్పుడు అతణ్ణి కలుసుకొని వున్నాను.

ఈ మారు మా చర్చలలో బాపూజీ చాల విషయాలను తడవాలనుకొన్నారు. గాంధీ ఇర్విన్ సంధి లాభాలను తమ స్వంత కుటుంబాల ఉపయోగానికని, స్థానిక వ్యాపారానికని

ఉప్పును తయారు గావిస్తున్న తీరప్రాంత ప్రజలకు వర్తింప జేయమని కేంద్ర అసెంబ్లీలో నేను ఆర్థిక శాఖామాత్యునిపై ఒత్తిడి తెచ్చి జయంపొందిన విషయాన్ని గూర్చి వారెంతో సంతృప్తితో మాట్లాడారు.

బాపు :- నీలాగా ఆ సంధియొక్క ఆచరణయోగ్యమైన ఉపయోగాన్ని, లాభాలను చాలకొద్దిమందిమాత్రమే గుర్తించారు. ఆ సంధివల్ల లక్షలాదిమంది పేదరైతులు లాభపడతారు.

తరువాత వారు చింతనలో మునిగారు.

బాపు:- ఎందువల్ల బూలభాయి నీతో బెడిసివున్నారు?

రంగా :- నేను శాసన సభలో సరిగా లేనని, చక్కగా మాట్లాడడం లేదని అతడు మీతో అన్నాడా?

బాపు:- లేదు. అచ్చటనున్న మంచి సభ్యులలో నీవొకడవని, శక్తివంతుడవని, ఒప్పించగల నేర్పరివని, కాని కొంత ఉద్రేకపరుడవని అతని అభిప్రాయం.

రంగా:- అయితే నాలోనున్న తప్పేమిటి బాపూజీ?

బాపు:- నీవు పార్టీలో ఒకప్రత్యేకమైన గ్రూపును ఏర్పరుస్తున్నావని అతడన్నాడు. అలా చేస్తే ప్రమశిక్షణ కొరవడుతుందని అతని భయం.

రంగా:- బాపూజీ! రైతుల సమస్యలపైప్రత్యేకంగా కేంద్రీకరించడానికని రైతు శాసన సభ్యులను ఒక గ్రూపుగా సమీకరించడం ఒక నేరమంటారా?

బాపు:-నీవు ఓర్పుతో వుండి పార్టీ మొత్తం శైతులకోసం పోరాడేటట్లు చూడవలసివుంది.

రంగా:.కాని బాపూజీ! అది అంత సులభమైన పనిగాదు. ఉదాహరణకు శిస్తు ప్రతిపాదనలనే తీసుకోండి. భూలభాయి తదితరులు ధనవంతులకు, పారిశ్రామికులకు, పట్టణవాసులకు శిస్తుముదరా యిప్పించడానికే ఇష్టపడుతారు. కాని పరోక్షపన్నులను తగ్గించమని అడగడం నాకిష్టం.

బాపు:-అందరికీ శిస్తు ముదరాల నెందుకు మీరు కోరగూడదు?

రంగా:- అది సాధ్యంకాదు. పేదవారిని పన్నుల భారాన్నుంచి తప్పించాలంటే ధనవంతులమీద అధికంగా పన్నులు వేయాలి.

బాపు:- రంగా! ప్రజలలోని అన్నివర్గాలను దేశం దృష్ట్యా సహకార దృష్టితో సమానంగా చూడాలి.

రంగా:- అయినప్పటికీ కొన్ని పన్నుల్ని చెల్లించవలసి వుంటుంది. మొట్టమొదట పేదవారికి శిస్తుముదరా లివ్వమని నేనడగవలసివుంటుంది.

బాపు:- నీతో ఏకీభవిస్తాను. కాని బ్రిటిష్‌వారు ఎన్నడైనా ఏశిస్తునైనా తగ్గించడాన్ని నీవు చూశావా? అలా చేయకుంటే మానే, వారు ఇంకా హెచ్చు బరువుల్ని మోపుతూనే వున్నారు.

రంగా:- అది నిజమే, అలా హెచ్చు బరువుల్ని మోపే సమయంలో వాటిని రైతులమీద, కార్మికులమీద మోపవద్దని నేను అడగవద్దా?

బాపు:- అడగాలి.

రైతుల గ్రూపును ఏర్పాటుచేయడం భూలభాయి కిష్టం లేదు. ఆ విషయాన్నతడు సర్దారుకు, బాపూజీకి చెప్పివుంటాడు. అందువల్ల ఆ విషయాన్ని గూర్చి పునరాలోచించమని గాంధీగారు నాకు చెప్పారు. వారి మాటలకు నేను కష్టపడి వుంటానని నన్ను ఓదార్చడానికని గుజరాతు రైతులకు నేను చేస్తున్నసాయానికి సర్దారు సంతృప్తి పడ్డారని వారు నాతో అన్నారు.*

*ఆ "రైతాంగ గ్రూపుకు" ఫ్రాంటియర్ గాంధి. అబ్దుల్ గఫర్ ఖాన్ సోదరుడైన డాక్టరు ఖాన్‌సాహెబు అధ్యక్షులు; రంగాజీ కార్యదర్శి. రంగాజీ స్వతంత్రపార్టీని స్థాపించిన పిమ్మట, జవహర్‌లాల్, లాల్‌బహదూర్‌శాస్త్రి, ఇందిరాజీ సమ్మతి పైననే, ఆనాటి పార్లమెంటరీ గ్రూపు అడుగు జాడలలోనే, పార్లమెంటరీ ఫార్మర్స్ లాబీ అనే గ్రూపును కాంగ్రెసు యం. పి. లు. స్థాపించుకున్నారు. అలాగా 40 సంవత్సరాల క్రితమే యీ అభివృద్ధికరమైన రైతు రక్షణ పథకాన్ని రంగాజీ 1935లో ప్రారంభించిరి.

ఐనా, రంగాజీని గాంధీజీ నిరుత్సాహ పరచలేదు.

1954లో, తిరిగి 1959లో కాంగ్రెసునుండి విభేదిస్తున్నా, దేశపు రైతాంగ అవసరాల బలమువల్ల, రంగాజీ ధోరణిలోనే యీ నాటికికూడా, పార్లమెంటరీ ఫార్మర్స్ లాబీ అంటూ, అసెంబ్లీ రైతాంగ గ్రూపు అంటూ

1936లో నేను మరొకసారి గాంధీగారిని కలుసుకొన్న ప్పుడు వారు భూలాభాయి ఢిల్లీలోనున్న పార్టీ కార్యాల యాన్ని నన్ను చూచుకోమని అచ్చట నాకయ్యే ఖర్చుల్ని తాను భరిస్తానని చెప్పినప్పటికీ నేనెందు కంగీకరించలేదో తెలియ జేయమన్నారు. పార్టీ కార్యదర్శులలో ఒకడుగా నా పనిని నేను నిర్వర్తిస్తున్నానని అలవెన్సులు తీసుకొని తద్వారా నా స్వాతంత్ర్యాన్ని పరిమితం చేసుకోవడం నాకిష్టం లేదని నేను వారితో అన్నాను.

బాపూజీ నా మాటల్ని విని ఖంగారు పడ్డారు. అది నాకు తెలుస్తూనే వుంది.

కాంగ్రెసు పార్టీలోనే యేర్పడుచున్నవి. కొంతగానైనా రైతాంగరక్షణకై ఆ 1935లో రంగాజీ యేర్పరచిన మార్గములోనే వ్యవహరిస్తున్నవి.

ఆ 1935-48 మధ్య, కేంద్ర శాసనసభలు (క్రమంగా పార్లమెంటుగా మారినవి) రాష్ట్రశాసన సభలలో, వివిధ పార్టీలకు చెందిన రైతాంగ సభ్యులు, రైతుకూలీ, గ్రామీణుల సమస్యలు చర్చకు వచ్చినప్పుడు ఎన్నికల సమయంలో గ్రామీణుల రక్షణార్థమై చేసిన వాగ్దానాలను మరువరాదన్నారు రంగాజీ. కార్య నిర్వాహణకై రైతాంగ సభ్యులు వొక గ్రూపుగా యేర్పడాలన్నారు. చర్చలలో తామెట్లా రైతాంగావసరాలను తెల్పాలో తేల్చుకొని వ్యవహరించాలన్నారు. ఐతే వోటింగు సమయాలలో వారి వారి పార్టీల తుది నిర్ణయాల ననుసరించి వోటు చేసుకోవచ్చన్నారు. ఇలాగా, పార్టీలోనే గ్రామీణుల గ్రూపు యేర్పరచిరి ఢిల్లీలో, క్రమంగా, రాష్ట్ర శాసనసభలలో, ఇది సర్దారు వల్లభాయికి. భుల్లాభాయికి, రాజాజీకి, రాజేంద్రప్రసాదుకు యిష్టము లేకపోయింది.

— సం.

బాపు:- నీ స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి నేను తుది వ్యక్తిని. కాని నీవు ఢిల్లీలోవుండి ఆఖర్చులు భరించ లేవని నాకు తెలుసు. పార్టీ నీఖర్చుల్ని భరించ డానికి నీ వనుమతి స్తే అందులో తప్పేమున్నది?

రంగా:- బాపూజీ, నేను మదరాసులో నా యాచార్యత్వానికి రాజీనామా గావించినప్పుడు ఈలాటి బాధ్యతను స్వీకరించాలని ఎప్పుడూ అనుకోలేదు. మీ ఆశీస్సు లకు నా ధన్యవాదాలు. నాకు శాసనసభనుండి అలెవెన్సులు వస్తున్నవి. అందువల్ల నా ఆర్థిక బాధలు చాలవరకు తీరిపోయినవి. మీరు నన్ను గూర్చి బాధపడకండి.

బాపు:- కాని నీవు రెండుచోట్ల ఖర్చులను భరించవలసి వుంటుంది గదా? నీ పర్యటనలకు గూడ ద్రవ్యం కావలసి వుంటుంది గదా?

వారు నన్ను గుచ్చిగుచ్చి అడుగుతున్నప్పుడు నాకు కష్టంగా వున్నదని బాపూజీ గ్రహించగలిగారు.

బాపు:- రంగా, దయచేసి భూలభాయిని అపార్థం చేసుకో వద్దు. అతడు నిన్ను మెచ్చుకొంటూవుంటాడు. పార్టీ నీ ఖర్చుల్ని భరించడం నీ ఇష్టం లేకపోతే....

రంగా:- బాపూజీ! మా సాధారణ ఖర్చులకు సరిపోతే, మరల నాకుగాని, భారతీదేవికి గాని డబ్బుతో పని

వుండదు. ఈ శాసన సభద్వారా వచ్చే డబ్బే మాకుచాలు *

గాంధీజీ నా భుజంపై చేయివేస్తూ తన సంభాషణను చాలించారు.

బాపు:- గమనముంచుకో! నీ కేదైనా త్వరగా అవసర మేర్పడినప్పుడు నా కొక లేఖ వ్రాయి.

రంగా:-ధన్యవాదాలు బాపూజీ! మీలో మాకున్న విశ్వాసం దైవదత్తమైనవరం.

---

* ఆ పిమ్మట భారతీదేవినికూడా ఆర్థిక సహాయం అంగీకరించ వలసినదని బాపూజీ సూచించిరి. ఆమెకూడ తన వ్యవసాయ ఆదాయం పైననే ఆధారపడుతూ, రంగాజీకి, తన ప్రజాహితైక కార్యములకై అవ సరమగు ధనాన్ని తోడుచేయగలను. కనుక, గాంధీజీ తమకు వేరుగా ధనం అందివ్వనవసరం లేదన్నారు. అలాగా, ధనసహాయం అందిస్తా నంచె వలదన్న స్త్రీ సేవకురాళ్ళలో భారతీదేవి ప్రధములు, ప్రముఖులని గాంధీజీ యెంతో ఆనందపడుచుండిరి. ('భారతీదేవి స్మృతులు' కూడ చదవండి.)

8. సంస్థానాల్లో ప్రజోద్యమాలు

అవి 1938 సంవత్సరం వేసవి మాసాలు. మహాత్మా గాంధీగారు సంస్థాన ప్రజల ఉద్యమాలకు తన నైతిక సాయాన్ని అందిస్తానన్నారు. సంస్థానాధీశుల, బ్రిటిష్ పరిపాలకుల ద్వంద్వ ప్రభుత్వం క్రింద కునుకుతీస్తూ, సొమ్మసిలివున్న సంస్థానప్రజలలో స్వాతంత్ర్యప్రియులైనవారు తమ ప్రాంతాలలో ఏలాటి స్వాతంత్రోద్యమం లేనందుకు అసంతృప్తులు కావడం సహజం. తమ ప్రక్కనున్న బ్రిటిష్ రాష్ట్రాలలో రాష్ట్ర స్వాతంత్ర్యాలు ప్రసాదించబడి అప్పటికే అచ్చట స్వరాజ్యంయొక్క ఆర్థిక స్వాతంత్ర్యాల యొక్క రుచిని చూడగల కాంగ్రెసు మంత్రిసర్కారేర్పడివుండడాన్ని చూచి వారు ఉద్రేక పూరితులయ్యారు. అందువల్ల వారు తమ ప్రజాపరిషత్తులను ప్రారంభించి రాజులకు మహారాజులకు వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమాన్ని ప్రారంభించారు.

రాష్ట్రాలలో లాగే ప్రజలకు రాజకీయ హక్కులను ప్రసాదించేలాగా బ్రిటిష్ప్రభుత్వంపై, సంస్థానాధీశులపై శక్తియుతంగా ఒత్తిడి తీసుకొని రావడానికి వీలయ్యే రీతిగా రాష్ట్ర ప్రభుత్వాల నేర్పరచిన కాంగ్రెసు రాజకీయాధికారాన్ని ఉపయోగించడంలో గల అనుభవాన్ని గడించి బ్రిటిష్వారితో సమానస్థాయికి వచ్చేవరకు ఆగమని గాంధీగారు సంస్థాన ప్రజలకు సలహా యిచ్చారు.

తమ పొరుగు రాష్ట్రాలలో నున్నప్రజలు స్వాతంత్ర్యం పొందినప్పుడు సంస్థాన ప్రజలు సహనంతో వుండగలరా? ఆ ప్రజలలో స్వాతంత్ర్య ప్రియులైనవారు ముందుకు దూకారు. రాష్ట్రాలలో మాలో చాల మందివల్ల, వారి సహచరులవల్ల, బ్రిటిష్ వారి మిత్రులవల్ల సృజించబడిన ఎన్నో సమస్యల చేత సతమత మవుతున్నప్పటికీ, సంస్థానాధీశులు తమ ప్రజలమీద తమ దమన విధానాన్ని ప్రయోగించినప్పుడు, గాంధీగారు సంస్థాన ప్రజాపరిషత్తుల విజ్ఞప్తుల నాలకించడానికి ప్రారంభించారు. పట్టణాలు స్వాతంత్ర్యాన్ని లతో నిండిపోయినని. సంస్థానాధీశులు బ్రిటిష్ వారి సలహాలను పాటించి ఆందోళనకారుల్ని అణచివేయడంలో ఆయజ్ఞాలలో ఆజ్యం పోశారు. బాపూజీ ఆ సమయంలో జోక్యం కల్పించుకొని ఆ బాధితుల్ని రక్షించాలని అనుకొన్నారు. అప్పటినుండి సంస్థాన ప్రజోద్యమాలను నిలబెట్టడానికి వారం వారం హరిజన పత్రికలో బాపూజీ సందేశాలు, ఉద్బోధలు, సలహాలు, హెచ్చరికలు రాసాగినవి. అలా కాకపోతే వారు ప్రజలలో విశ్వాసాన్నెలా నిల్పగలరు? సంస్థాన ప్రజలు సంస్కరణల కోసం ఆందోళన గావించినప్పుడు రాష్ట్రాలలో లాగే సంస్థానాలకు కూడ పరిపాలనా స్వాతంత్ర్యాన్ని, తదితర సౌకర్యాలను కల్పించమని బాపూజీ బ్రిటిష్ వారితో వాదించారు.

మేల్కొనిన సంస్థానాలలో స్వాతంత్ర్య పిపాస ఎంత లోతుగా ఉన్నదోనన్న సమస్యపై తర్జన భర్జనలు రేకెత్తినవి. ఆ ప్రజాఉద్యమాలు ఎంత విస్తృతమైనవి? ఆ దమన

విధానం ఎంత క్రూరమైనది? గ్రామాలలోనున్న హరిజను లతో సహా రైతులందరూ తమకు విధేయులుగా వున్నా రని, తమ పరిపాలన వారికి సంతృప్తికరంగా వున్నదని, పట్టణాలలో నున్న ఏ కొద్దిమంది ప్రజలకో, ఉద్యోగాలు కావాలంటున్న ఏ కొద్దిమంది వ్యక్తులకో ఈ యాందోళన పరిమితమై వున్నదని సంస్థానాధీశులు, బ్రిటిష్‌వారు వాదింప జొచ్చారు.

నేను బాపూజీని చాలమార్లు కలుసుకొని వారితో స్వయం పరిపాలన గలిగిన రాష్ట్రాలలోను సంస్థానాలలోను వున్న ప్రజల ఉద్యమాలను గూర్చి వారితో చర్చించాను. హైదరాబాద్, బికనీర్, ఆల్వార్, రాజస్థాన్, తిరువాన్కూర్, ఒరిస్సా సంస్థానాలలో రైతులెలా బాధపడు తున్నారో నేను బాపూజీకి వివరించి చెప్పాను. ఆ సంస్థానాలలో దేనినైనా నేను సందర్శించి అచ్చటి పరిస్థితుల్ని చక్కగా పరిశీలించానేమో చెప్పమని వారు నన్నడిగారు. 1925లో నిజాము సంస్థానంలో రైతుల ఆర్థిక తదితర పరిస్థితుల్ని గూర్చి నేను చేసిన వివరణాత్మక పరిశీలనను గూర్చే గాక, 1938లో తునికిపాడులో హైదరాబాదు సంస్థాన రైతుయువకులకోసం నేను నిర్వహించిన రైతాంగ విద్యాలయాన్ని గూర్చి గూడా చెప్పాను. ఒరిస్సాలోని కొన్ని సంస్థానాలలో నాకు కలిగిన అనుభవాలను వారికి వివరించాను. ఆ సమయంలో నేను బికనీర్ న్యాయ వాదియైన శ్రీ శరాఫ్ సాయంతో రాజస్థాన్ సంస్థానాలలో రైతుల సాంఘిక, ఆర్థిక పరిస్థితుల్ని గూర్చి సర్వే

చేస్తున్నానని వారికి తెలుసు. అందువల్ల వారు నన్ను ఒరిస్సా సంస్థానాలలో ప్రజా ఉద్యమాలు ఎలా వున్నవో పరిశీలించి తన కొక నివేదిక నివ్వమని నాతో అన్నారు. అంతే గాక ఆదివాసుల, హరిజనుల స్థితిగతులను, వారి మనోభావాలను గూర్చి తన స్వంత పరిశీలనను జరపడానికి బాపూజీ ధక్కర్ బాబాను నియమించారు.

అధికారులు తమ క్రూర దమన విధానాన్ని అనుసరిస్తున్న సమయంలో ప్రజలుద్రేకంతో పోలీసు కాల్పులకు వ్యతిరేకంగా ఉత్తేజితి విజృంభిస్తున్న తరుణంలో నేను చాల ఒరిస్సాసంస్థానాలను సందర్శించాను. ఒక బ్రిటిష్‌వాడు చంపబడ్డాడు. కొందరు బ్రిటిష్ ఉద్యోగులు చుట్టివేయబడ్డారు. రంగపూరు లాటి చిన్న సంస్థానాలలో స్థానిక పోలీసులు ప్రజలచేత దెబ్బలు తిన్నారు. అందువల్ల బ్రిటిష్‌వారు తమ భారతీయ సైన్యాన్ని ఉపయోగించి, ప్రజలను అణచివేసి సైనికపరిపాలనతో తుల్యమైన పోలీసురాజ్యాన్ని స్థాపించడానికి ఆ దురదృష్టకరమైన పరిస్థితుల్ని వినియోగించుకొన్నారు. ఆ జులుంరాజ్యంలోకి వెళ్ళడంలోవున్న ప్రమాదాలను నేను ఖాతరు చేయలేదు.

నేను గావించిన ఆ పర్యటనలలో ఒక దానియందు యీనాడు ప్రజా సోషలిస్టు పార్టీ నాయకులుగా వున్న ఎస్. యస్. ద్వివేదీ పాల్గొన్నారు. మరొక పర్యటనలో కీ॥శే॥ సారంగధర దాస్ పాల్గొన్నారు. మూడవ పర్యటనలో యీ మధ్య ఒరిస్సా మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా వున్న పవిత్ర మోహన్‌ప్రధాన్ నాతో వచ్చాడు. వైతులపై

విధించిన దమన విధానం ఎంత క్రూరమైనదో అతడు పరికించాడు. నాయకులను లాటీలతో మాత్రం కొట్టారు. కాని వారి అనుచరులైన రైతువర్కర్ల వస్త్రాలను లాగివేసి నగ్నమైన వారి వీపులపై బెత్తాలతో కొట్టారు. కొందటిని చంపివేశారు. మేము వారిని చూచినప్పుడు వారిలో చాల మంది వీపులు, అవయవాలు పగిలి వున్నవి. కాని వారి గాయాలకు ఏలాటి ఆధునిక ఔషధం గూడ పూయబడలేదు. సంస్థానాధిపతుల సైన్యాలవల్ల దెబ్బతినివున్న ప్రజల హృదయ విదారక దృశ్యాలెన్నో మాకు కనబడినవి. నేను చూచిన వాటికన్నిటికీ ఒక స్పష్టమైన నివేదికను గాంధీ గారికి సమర్పించి బాధపడుతున్న ఆ సంస్థాన ప్రజలను హృదయ పూర్వకంగా బలపరచ వలసిందని వారిని కోరాను.

థక్కర్ బాబా పంపిన నివేదిక, నా నివేదికను సమర్థించింది. సర్వాధికారిగా వుండిగూడ సంస్థాన ప్రజలపై విధించబడిన క్రూర దమన విధానాన్ని అరికట్టకుండా తన మానవ రక్షణ బాధ్యతల్ని విస్మరించినందుకు బ్రిటిష్ వారితో పోరాడడానికి బాపూజీ మనస్సు చేసుకొన్నారు.

బాపు: సంస్థాన ప్రజలలో నీవు గావించినపని చాల నిర్మాణాత్మక మైనది. నీ నివేదిక రాజకీయాలత్రో నిమిత్తంలేని థక్కర్ బాబా నివేదికలాగా చక్కగా యథార్థంగా వున్నది. ఈ సంస్థానాధీశులీ క్రూర కృత్యాలను జరపడం చాల విషాదకరమైన విషయం. వారు శ్రీరాముని పై బాస చేస్తారు. వారిలో చాల

మంది శ్రీరామచంద్రుని వంశానికి చెందిన వారమని చెప్పుకొంటారు. అయినా యిలాటి భయంకర కృత్యాలు గావిస్తారు.

వారలా చేయకపోతే పదవీచ్యుతులు గావించబడుతామని వారు భయపడుతున్నారని నేననాన్ను.

బాపు: వారీలాటి అకృత్యాలు చేయకపోతే వారు తమ పీఠాలనుండి దించబడలేరు.

రంగా: తమ నియంత్రుత్వాధికారాలను నదలుకొనడానికి రాజులింకా సిద్ధంగాలేరు. తమకెంతో విధేయులుగా వుంటారనుకొన్న ప్రజలు తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడంవల్ల ఆ సంస్థానాధీశులు చాల కష్టతో వున్నారు.

బాపు: మైసూరు మహారాజు ప్రజల ప్రేమను చూరగొన్నారు. అచ్చటగూడ విధురస్థితంలో కాల్పులు జరిగాయి. బాధ్యతాయుత ప్రభుత్వాల కంటె హెచ్చుగా వారినుండి నేనేమీ కోరడంలేదు.

బ్రిటిష్‌వారి సర్వాధిపత్యాన్ని గూర్చి నేను బాపూజీకి చెప్పాను.

బాపు: అవును. మనం బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఓడించాలి. అప్పుడు సంస్థానాధీశులు తమ ప్రజల భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తారు.

బాపూజీ మా నివేదికలమీద హెచ్చుగా ఆధారపడ్డారు. తమ దమనవిధానానికి స్వస్తి చెప్పవలసినదిగా

సంస్థానాధీశులకు చెప్పమని, లేక అలా చేయడానికి వారి కనుమతి నివ్వమని, స్వాతంత్ర్యం కోసం ప్రజలు కోరుతున్న ఆర్థిక, రాజకీయ హక్కుల్ని వారికి ప్రసాదించమని బ్రిటిష్ వారిని అడగడంలో తన వాదనను బలపరచుకొనడానికి ఆ నివేదికలలోని విషయాలను వారు ఉదహరించారు.

1966లో మహాత్మా గాంధీగారు జీవించి వున్నట్లయితే నేను వారికెంతో సంతోషాన్ని కలిగించి వుండేవాణ్ణి. ఏ సంస్థానంలో 1938లో క్రూరదమన విధానం సంభవించిందో, ఏ సంస్థానప్రజల్ని స్వపరిపాలన కోసం పోరాడవలసినదిగా ఆసమయంలో నేను కోరివున్నానో ఆ సంస్థానానికి అధీశుడైన శ్రీ॥ శ్రీ॥ ధెంకనల్ మహారాజు, 1966లో రాష్ట్ర స్వతంత్రపార్టీ మహాసభ జరిగిన తరువాత నాపర్యటనలో పాల్గొనడం సంభవించింది. నేను చాల బహిరంగ సభలలో మాట్లాడవలసి వచ్చింది. అప్పుడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న పెద్దలుగూడ ఆ సభలలో వున్నారు. సంస్థానాధీశులకు వ్యతిరేకంగా ఆనాడు జరిగిన పోరాటాలను గూర్చి నేను చెబుతుంటే ఒక ఆటగానిలాగా అతడు నా ఉపన్యాసాన్ని అనువదించడానికి ఫూనుకొన్నాడు. అతడు నిజమైన గాంధేయవాదిలాగా వ్యవహరించాడు. ఆనాటి రాజ్యాన్ని గూర్చి నేనేమి చెప్పానో దాని నంతటినీ పొల్లుపోకుండా అనువదించాడు. అతడు తన సంతృప్తిని వెల్లడిస్తూ "గాంధీగారికి ధన్యవాదాలు - సంస్థానాలన్నీ అహింసాయుతంగా రద్దయ్యాయి"అన్నాడు.

మనమనుకొన్న దానికి వ్యతిరేకంగా ఈ కాంగ్రెస్ రాజ్యంమనమీద భారవహమైన పన్నుల్ని విధించింది. మనకు లంచగొండి ప్రభుత్వాన్ని ప్రసాదించింది. మన ప్రజలను కంట్రోళ్ళతో బిగించింది. ఆ సంస్థానాధీశులుపోయి అంతకంటె అధ్వాన్నమైన పరిపాలకులు వచ్చినప్పటికీ, సంస్థానప్రజలు మాత్రం తమకు స్వపరిపాలన వచ్చినందుకు గాంధీగారి యెడల, వారి స్వాతంత్ర్యం కోసం పోరాడినవారి యెడల కృతజ్ఞులుగానే వున్నారు. అందువల్ల యీనాడు [1-5-1969] ఆ ప్రజలే ఒక సంస్థానాధీశుడు ముఖ్యమంత్రిగా, ఒకప్రైతు ఉపముఖ్యమంత్రిగాగల మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవటం ద్వారా కాంగ్రెస్ రాజ్యాన్ని త్రోసివేసి స్వతంత్ర రాజ్యాన్ని నిర్మించుకొన్నారు.

గరీబీ హటావోకై కృషిచేయ కంకణం ధరించిన యిందిరమ్మ మంత్రి వర్గమును తిరిగి ఒరిస్సా ప్రజలు ఆహ్వానించుచున్నారు.

(1976)

---

* మహాత్మా గాంధి – "ఇండియన్ స్టేట్స్" అనే గ్రంథములో, ధక్కర్‌బాబా, రంగాజీ తనకు పంపిన రిపోర్టులను వుదహరిస్తూ గాంధిజీ, "హరిజన్"లో వ్రాసిన వ్యాసమున్నది.

నైజాము ప్రభుత్వము, రంగాజీ తమ సంస్థానములోకి రాకూడదనే ఆంక్ష ప్రకటించినది.

అందుకనే, నైజాం సరిహద్దులో వున్న, తునికిపాడులో 1938లో రైతాంగ విద్యాలయమును రంగాజీ నడపిరి, శ్రీ నారాయణరెడ్డి ప్రభృతులు (పిమ్మట కమ్యూనిస్టు నాయకులైరి.) ఆ విద్యాలయమునకు వచ్చిరి. అటులే, మైసూరు సరిహద్దులో వున్న, టి. చదుములో మరో స్కూలు నడిపిరి. సం,

9 కాంగ్రెస్ మంత్రి వర్గాలు 1937-39
వైతులేఖా చిత్రాలు

బాపూజీతో నా సంబంధాల విషయంలో 1937-39 చాల కిష్టమైన సంవత్సరాలు. కాంగ్రెస్ మంత్రి వర్గాలను వారు ధర్మపితగానున్నారు. కాని ఆ మంత్రివర్గాలంటే వారి కెంతో అసంతృప్తిగా వుంది. ముఖ్యమంత్రులు (ఆనాటి ప్రధానమంత్రులు) కిసాన్ కాంగ్రెస్సును గూర్చి ముఖ్యంగా బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఆ సంస్థ వ్యవహారాలను గూర్చి తీవ్రమైన ఆరోపణలను గావించి వాటి విషయంలో జోక్యం కల్పించుకోవలసిందని బాపూజీని కోరారు. నేను బాపూజీని చాలమార్లు కలుసుకొన్నాను. కాని అప్పుడెల్లా కాంగ్రెసు మంత్రివర్గాలను సవాలు చేస్తూ వాటిని రద్దు చేయవలసిందని కోరుతూ స్వామి సహజానంద సరస్వతి, ఇందూలాల్ యాజ్ఞిక్ చేస్తున్న తీవ్రమైన ప్రకటనలకు నేను మహాత్ముని నద్ది సంజాయిషీ చెప్పుకోవలసివచ్చింది. వైతులకు కాంగ్రెసు మంత్రి వర్గాల మీదనున్న మోజు తగ్గిపోతున్నట్లు గుర్తించిన సమ్యాని స్టులు సహజానంద సరస్వతి, ఇందూలాల్ యాజ్ఞిక్కులు మంత్రివర్గ వ్యతిరేకతవల్లవచ్చిన తీవ్రతను ఉపయోగించు కొన్నారు. కిసాన్ కాంగ్రెసు-కాంగ్రెసుతో సహకరించేటట్లు చేయడానికి నేను చాల ప్రయత్నించవలసి వచ్చింది. ఈ పరిస్థితులలో సర్దార్ పటేల్ నేనంటే చాల కోపంగావుండటంలో ఆశ్చర్యమేమీలేదు. జవహర్‌లాల్ నెహ్రూ చాల వ్యక్తి

డయ్యాడు. దానికితోడు మామీద కాంగ్రెసు కార్యవర్గం తీవ్రమైనచర్యలు తీసుకోకుండా ఆపడం బాపూజీకి చాల కష్టమయింది. సేవాగ్రామకు వ్యతిరేకంగా నేను వారికొక కవచంగావున్నానని తన మనస్సును బయటబెడుతూ ఇందూ లాల్ యాజ్ఞిక్ ఒకనాడన్నాడు.

కాంగ్రెసు మంత్రివర్గాలను ఇరుకులో పెట్టడానికి యెందుకు ప్రయత్నిస్తున్నావని బాపూజీ ననొకసారి ప్రశ్నించారు. భారతదేశంలో మొట్టమొదటి సారిగా రైతుల ఋణాలను ఆపుదల చేసినందుకని రాజాజీని నేను అభినందించినందుకు నాకు కొంత ప్రతిష్ఠ ఇవ్వమని నేను వారిని కోరాను. మరలా ఆ ఋణాల ఆపుదలను ఉపసంహరించి ఇతర మంత్రివర్గాలు రైతులకా రక్షణ నివ్వకుండా చేసినందుకు నేను వారిని విమర్శించడంలో తప్పేమున్నదని నేను గాంధీజీని ప్రశ్నించాను.

బాపు:-ఋణాల ఆపుదల కొన్ని రాజ్యాంగ సమస్యలకు దారి తీస్తుందని అతనికి చెప్పబడింది. అందువల్ల అతడు ఋణాల తగ్గింపు బిల్లును తీసుకొనివచ్చాడు.

రంగా:-నేను దానిని బలపరచానండీ! అంతేగాక, ఒక ఋణస్థుడు గనుక తాము చేసిన ఋణానికి రెండురెట్ల సొమ్మును ఆసామికి చెల్లించివుంటే అతడు చెల్లించవలసిన తక్కిన మొత్తమంతా తనకు తాను రద్దవుతుందనే దండుపట్ సూత్రాన్ని కనిపెట్టినందుకు రైతు సంఘం రాజాజీని ప్రస్తుతించివున్నది.

బాపు:-కాని అమ్మకపు పన్ను విషయంలో నీవు పెద్ద వివాదాన్ని తీసుకొని వచ్చావు. సేలం జిల్లాలో మద్యపాన నిషేధాన్ని అనులు పరచినందువల్ల రాగల నష్టాన్ని భర్తీ చేయడానికి ఆ ద్రవ్యాన్ని ఉపయోగించాలనే అతని ధ్యేయాన్ని నీవు ఏ మాత్రం సమ్మతించక పోయావు.

రంగా:-మద్యపాన నిషేధాన్ని నే నంగీకరించాను. కాని అమ్మకపు పన్ను విధించబడడం నాకిష్టంలేదు. ఈ పన్నువల్ల వచ్చే ఆదాయం ఇందుకోసమే ఉపయోగించ బడుతుందనే నమ్మక మేమిటి? అంతేకాదు. పైతులమీద ఇక ఏమాత్రం పన్ను విధించినా నే నంగీకరించను.

బాపు:-ఆ పన్ను పైతుల మీద పడదని రాజాజీ నాకు హామీ నిచ్చాడు.

రంగా:-మీరా పన్నును చెల్లించవలసిన అవసరం లేదని అతడు వర్తకులకుగూడా హామీ నిచ్చివున్నాడు.

ఆ విషయాన్ని గూర్చి విచారిస్తానని బాపూజీ అన్నారు. ఆ తరువాత రాజాజీ ఆ అమ్మకపుపన్ను నుండి చాల వ్యవసాయ వస్తువుల్ని మినహాయించారు. నేను భయపడినట్లే కొంతకాలం గడచిన తరువాత ఆ పన్ను రూపాయకు ఒక పైసానుండి పదిపైసల వరకు, కొన్ని చోట్ల ఇరవై పైసలవరకు పెరిగింది. అంతేగాక అది క్యుములేటివ్ గూడ అయింది. మద్యనిషేధం మాత్రం రద్దయి పోయింది.

బాపు:- బీహార్, యు. పి.లలో జరిగిన రైతుయాత్రల మాటేమిటి?

రంగా:-వాటిని గూర్చి ఎందు కడుగుతున్నారు?

బాపు:-అవి చాల వ్యతిరేకంగా వున్నవని మంత్రులు భావిస్తున్నారు.

రంగా:-ఎవరికి?

బాపు:-కాంగ్రెసుకు, ప్రజలకు.

రంగా:-నే నంగీకరించను. ఇవి పండీయాత్ర ననుసరించి నాచేత ఏర్పాటు చేయబడినవి. ఆ యాత్రలు ప్రభుత్వంలో వున్న రైతులను కదిలించడానికి. క్రమశిక్షణా యుతంగా సమష్టి చర్యలకు వారు పూనుకొనేటట్లు చేసి, తద్వారా వారిని శక్తివంతం గావించడానికి యీ యాత్రలు మంచి సాధనాలని నా కిప్పుడు తెలిసింది.

బాపు:-ఈ యాత్రలు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఒక విధ మైన ప్రతిగుబాటు తత్వాన్ని సృష్టిస్తున్నాయి. స్వరాజ్యం నచ్చినట్లయితే దాని వాతావరణం బల హీన పరుస్తుంది.

రంగా:-స్వరాజ్యం రావడానికి చాలకాలం పడుతుంది. మనం బ్రిటిష్‌వారితో పోరాడ వలసివుంది. ఈ యాత్రలలో తరిబీదయినవారు స్వరాజ్య పోరా టంలో మనకు పనికివస్తారు.

బాపు:-తరిబీతులంటూ నీవు కమ్యూనిస్టుల లాగా మాట్లాడుతున్నావు. స్వామి సహజానంద దండాయుధాన్ని గూర్చి ప్రచారం గావిస్తున్నాడు. ఇది ఎచటికి దారి తీస్తుందను కొన్నావు? దానిని నీవు ఖండించ లేను.

రంగా: మహాదేవ్ భాయ్ స్వామిజీ యొక్క దండాయుధ పద్ధతికి వ్యతిరేకంగా బోధిస్తున్నాడు. కనుక నేను జోక్యం కల్పించుకోవలసిన అవసరమేమున్నది? బీహారు యాత్రలకు తానిచ్చిన బలం స్వామి సహజానంద ఇచ్చిన బలంలాగా అరుచికరంగాగాక చక్కగా వున్నదని టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక చేసిన వ్యాఖ్యానాన్ని నాకు గమనం చేశారు.

జమీందార్ల జులుంనుండి రైతులు తమ్మును తాము రక్షించుకోవలసి వున్నదని నేనన్నాను.

బాపు: దండాయుధం ద్వారా కాదు.

రంగా: రైతులు దండాయుధం లేకుండా ఎన్నడూ వుండరు గదా; కానివారు దానిని తమ హక్కుల కోసం ఎంత అరుదుగా ఉపయోగిస్తారో మీకు తెలియదా?

బాపు: నీ ఆంధ్ర రైతుయాత్ర మాటేమిటి?

రంగా: రాజాజీ దానిని గూర్చి ఏమైనా చెప్పారా? అతడు దానిని నిషేధించలేదు. అతడు దానిని విమర్శించ లేదు.

బాపు: నీవన్నది సరే. అహింసాయుత యాత్ర అని రాజాజీ అన్నాడు. మేము దానిని గూర్చి విన్నాము. నాయ

కులలో చాలమంది కమ్యూనిస్టు లైనప్పటికీ ఆకోరి కల పత్రం చాల సహేతుకంగాను అహింసాయుత పద్ధతిలో సాధింపగలదిగాను వుందని అతడన్నాడు. నీ వెందుకు దానికి నాయకత్వం వహించలేదు?

రంగా: అతడు నన్ను అభినందించాడు. ఇతర మంత్రివర్గాలు కూడ ఆవిధంగా వుంటే మంచిది. ఈ కిసాన్ కాంగ్రెస్సులో కమ్యూనిస్టు లున్నప్పటికీ అది అహింసా పద్ధతిలో నడవగలదని నేను నిరూపించ దలచుకొన్నాను. రాజాజీ లాగానే ఇతర మంత్రులుకూడ వ్యవహరిస్తే ఎంత బాగుండేది?

బాపు: నీవన్నట్లే చాల స్థలాలలో కమ్యూనిస్టు లీయాత్రలకు వెనుక నున్నట్లయితే రైతులు హింసాకాండకు దిగరని నీవెలానమ్మగలవు?

రంగా: అలాగా జరిగితే వాటిని ఖండించడంలో నేను మొట్టమొదటి వాణ్ణిగా వుంటాను.

బాపు: నీవు వారిని కంట్రోలు చేయగలనని అనుకొంటావా?

రంగా: నాశక్తి వున్న వరకు ప్రయత్నిస్తాను. ఏమైనప్పటికీ స్వరాజ్యం వైపుకు మనం నడుపుతున్న యాత్రను బ్రిటిష్ వారెలా ఆపలేరో ఆలాగే తాలూక్ దార్ల దోపిడినుండి విముక్తికోసం జరుపబడే రైతుయాత్రల నెవ్వరూ ఆపలేరు.

బాపు:- ఈ యాత్రల ద్వారా జాతీయ ఉద్యమాన్ని బలపరుస్తున్నట్లు నీవు విశ్వసిస్తున్నావా?

విశ్వసిస్తున్నా నన్నాను. నేను వైతులను నిర్మాణాత్మకంగా నడపడానికి వారి నైతిక సాయాన్ని నేనర్థించాను.

బాపు: కాంగ్రెస్ మంత్రి వర్గాలు మన ప్రజలకు మంచిని చేస్తున్నాయని నేనను కొంటున్నాను. అవి స్వరాజ్యం కోసం మనం నడుపుతున్న అహింసా యుత పోరాటాన్ని బలపరుస్తాయి. అందువల్ల వాటిన బలహీన పరచవద్దని నేను నీకు సలహా నిస్తున్నాను.

రంగా: నేను మీతో ఏకీభవిస్తున్నాను. కాని ప్రజల కోరికలను సగానికి సగమైనా తీర్చమని మంత్రులకు సలహా లివ్వాలని మిమ్మల్ని కోరుతున్నాను.

బాపు: నిషేధించవలసిన కమ్యూనిస్టు కొత్తపట్నం* విద్యాలయం మాత్రమిటి? నీకుకూడ దానితో సంబంధ మున్నదని విన్నాను. ఇప్పుడున్న నీ వైతాంగ విద్యాలయం వీటికి సరిపోదా?

రంగా: నా వైతాంగ విద్యాలయాన్ని వారి విద్యాలయంతో కలపడానికి నాకిష్టం లేదు. అందువల్లనే వారా నిషేధాజ్ఞను ఉల్లంఘించడానికి నిర్ణయించకముందే నేనా విద్యాలయాన్ని వదలివచ్చాను. కాని దానిని నిషేధించవలసిన అవసరమేమున్నది? అచ్చట జరిగిన తీవ్రమైన లాఠీచార్జిని నేను తప్పనిసరిగా ఖండించాను. పోలీసువారు బ్రోక్యం చేసుకోవలసిన అవసరమేమీ అచ్చటలేదు. అదంతా మంత్రివర్గానికి చాల చెడ్డ పేరును తెచ్చింది.

బాపు: వైతు యాత్రలింకా ఉన్నాయా?

రంగా: అవును బాపూజీ!

బాపు: ఎందుకని?

రంగా: వంశ పారంపర్యంగా అనుభవిస్తున్న పొలాలనుండి అక్రమంగా రైతులు తొలగించబడు తున్నందుకు...

బాపు: వారు న్యాయ స్థానాల కెందుకు వెళ్ళకూడదు?

రంగా: రైతులు చాలపేదలు. న్యాయస్థానాలలో నిర్ణయాలు కావడానికి చాల కాలం పడుతుంది. పైగా అది చాల వ్యయంతో కూడుకొన్నపని.

బాపు: అందువల్ల శాసనాన్ని అందరూ ఉల్లంఘించడాన్ని నీవు సమర్థిస్తావా ?

రంగా: లేదు బాపూజీ! రైతులుగాదు శాసనాన్ని ఉల్లంఘించేది. శాసనాన్ని తమచేతికి పుచ్చుకొనే జమీందారే అలాగా చేసుండేది.

---

*కమ్యూనిస్టులు, కొత్త పట్నంలో స్కూలు నడిపిరి. కొంత కాలానికి దానిపై ప్రభుత్వం ఆంక్ష విధించింది. దాన్నియెదిరించగా, లాఠీచార్జీని పోలీసులు ప్రయోగించిరి. ఆ దౌర్జన్యమును రంగాజీ నిరసించిరి. తమతో చేరలేదని కమ్యూనిస్టులు, ప్రభుత్వ దౌర్జన్యాన్ని విమర్శించిరని కాంగ్రెసువారు రంగాజీపై కినిసిరి. తమ రైతాంగ విద్యాలయానికి పోటీగా, కమ్యూనిస్టు లాస్కూలును నడపినా. దానితో రంగాజీ సహకరించినా, వారికి తృప్తి కలుగలేదు.

ఆనాటినుండి, రైతాంగము, గ్రామీణ బీదలు కోర్టులలో అధికారులు, కోటీశ్వరులు, వర్తకులతో వాదించి గెలువజాలరన్నారు రంగాజీ. కనుకనే, 'బీదల రక్షణకు తగినట్లుగా శాసనాలు కావాలి; కోర్టులు వ్యవహరించాలి; ప్లీడర్లు చొకగా, ఉచితంగా, లేక ప్రభుత్వ అలవెన్సుల పైన బీదల తరపున వాదించుట కేర్పాట్లు కావా'లన్నారు రంగాజీ, ఈ యింది రాజీ 25 సూత్రాల పర్వములో యిప్పటికి వారి సూచనకు కొంత కార్యరూపము అందుచున్నది.

సం.

10. దేవుని మనిషి

1945లో గాంధీగారి కోరిక ననుసరించిన యీ తాలిమీ సమావేశంలో పాల్గొనడానికి వెళ్ళాను నేను. నా పాత స్నేహితుడు, గొప్పకవి, నవలా రచయిత, తత్వవేత్త స్వాతంత్ర్య యోధుడు ఐన ఉన్నవ లక్ష్మీనారాయణ గూడ బాపూజీని చూడడానికి అచ్చటికి వచ్చాడు. భారత్ కిసాన్ సమ్మేళన్ మహాసభకు ప్రారంభోత్సవం చేయడానికి ఒక తేదీని యివ్వమని బాపూజీని ఆర్థించాలనే ఆసక్తితో నేను న్నాను. కొన్ని తత్వ సమస్యలను గూర్చి చర్చించాలనే ఉత్సుకతతో ఉన్నవ నున్నాడు. అతడు ఒక గొప్ప వైష్ణవ భక్తుడని నాకు తెలుసు. అతడు ఒక గూఢమైన యోగాన్ని అభ్యసిస్తున్నాడని గూడ దేశభక్తుడు నాతో అన్నాడు. బాపూజీని అతడేమి కోరనున్నాడో నాకు తెలపమని, దేవుణ్ణి గూర్చి వారికేమి తెలుసునో దానినిగూడ తెలియ జేయమని నేనతణ్ణి కోరాను. ఉన్నవ గంభీరుడై వినయంతో:

ఉన్నవ :- రంగా, నేను ఒక అన్వేషిని మాత్రమే. బాపూజీ ఒక మహర్షి. నాకు తెలియనిదంతా వారికి తెలుసు. దానిని గూర్చి వివరంగా అడగడానికి అది నాకు మించిన విషయమని నేననుకొన్నాను. 1923లో మేము సాంఘిక విప్లవాన్ని గూర్చి చర్చలు గావించి నప్పటి నుండి అతడు నాలోఉంచిన విశ్వాసాన్ని బాపూజీ గూడ పంచుకొన్నందు కతడు చాల సంత సించాడు. ఆ తరువాత ఇలా అన్నాడు.

ఉన్నవ:- నీవు నిజంగా అదృష్టవంతుడివి రంగా! నిన్ను గూర్చి బాపూజీ చాల మంచి అభిప్రాయాన్ని కలిగి వున్నారు. నీవు నిజమైన మంచి ప్రజా సేవకుడవని వారు నాతో అన్నారు.

నేనెంతో ఆనంద పడ్డాను. ఆ ప్రకాశవంతమైన ఉదయాన అతడు బాపూజీతో మాట్లాడి తిరిగి వచ్చినప్పుడు నేను ఉన్నవను కలుసుకొన్నాను. దైవ సాక్షాత్కారాన్ని గాంచినట్లు అతని ముఖం జ్వాజ్వల్యమానంగా వుంది. అతడు నన్నెంతో ప్రేమతో మాట్లాడించాడు. అతని చేతుల కదలికే ఒక విధంగా వుంది. నాకంటె పెద్దయైన ఉన్నవ పూర్తిగా సంతృప్తుడైనందుకు నేనెంతో సంతోషించాను. నేనతణ్ణి ప్రశ్నించేవరకు అతడాగలేదు. అతడు తన దీర్ఘ బాహువులతో నన్ను పెనవేసుకొని నా చెవుల్లో తిన్నగా స్పష్టంగా

ఉన్నవ:- వారికి తెలుసు. వారు చూచి వున్నారు. మనకు తెలిసిన మార్గాలలోగూడ వారు సంచరించివున్నారు. రంగా! అతడు దేవుని మనిషి.

నేనుగూడ అతణ్ణి కొగలించుకొని బాపూజీని గూర్చి అతనిలాగే అనుకొన్నానని చెప్పాను.

ఉన్నవ :- రంగా! వారిపై నీవెన్నడైనా ఆగ్రహించావా? నేనాగ్రహించాను. వారంటే ఎన్నడైనా ఆశాభంగాన్ని పొందావా? నేను పొందాను, కాని నేను వారి నింకా విశ్వసిస్తున్నాను.

యోగాన్ని గూర్చి తెలిసిన చాలమంది ఉన్నవను వారి భగవానుణ్ణిగా తలపోయడం నేనెరుగుదును. భారతీ దేవికి నామీనకోడలు లక్ష్మీదేవికి అతనిలో హెచ్చువిశ్వా సమున్నది. ఉన్నవ అప్పుడప్పుడు తుఫానులాగా మండిపడి నప్పటికి అతడు పరిపూర్ణుడైన యోగియని దేశభక్తుడు గూడ విశ్వసించాడు. చైతన్య మహాప్రభువు యొక్క భక్తు డైన ఒక యువకునిలాగా ఆ పెద్ద చాలఆనందంలోమునిగి వున్నాడు. నేను రైతు సమస్యలను గూర్చి, కాంగ్రెస్సును గూర్చి, స్వరాజ్య ఉద్యమాన్ని గూర్చి, నిర్మాణయుతమైన శాసనసభా కార్యక్రమాలు మొదలైన ఇహ సంబంధమైన సమస్యలను గూర్చి మాత్రమే బాపూజీతో చర్చించడానికి అచ్చటికి వచ్చాను. కనుక నైతికమైన యోగబంధమైన ఉత్సుకతతో నిండివున్న అతనిముందు నేను చాల తక్కువ అని అనుకున్నాను. తుట్టతుదకు నావంతు వచ్చినపుడు బాపూజీ రాజకీయ ఘనతలు గూర్చి, నైతికమైన గొప్ప తనాన్ని గూర్చి నాకు ముందుగానే తెలుసును గనుక నేను వారి వద్దకు కొంత భీతితోనే వెళ్ళాను. 'నివు నీ స్నేహి తుడైన ఉన్నవను కలుసుకొన్నావా?'అని గాంధీగారు నన్ను అడిగారు.

రంగా: కలుసుకొన్నాను బాపూజీ.

బాపు: ఎంత మంచివాడివి. అతడొక సాధువు. నీకు ముందు నుండి అతణ్ణి తెలుసా?

రంగా: 1923 నుండి తెలుసు. అతడు మిమ్మల్ని 'మాలపల్లి' అనే నవలద్వారా ఆంధ్రదేశానికి పరిచయం గావించివున్నాడు.

బాపు; అతడు నన్నొక వివేక రహితుడైన పోరబాట్లుదారు నిగా చిత్రించాడా?

రంగా: లేదు. హరిజన భక్తుడైన హింమూ అధిపతియైన రామదాసు ద్వారా అతడు మిమ్మల్ని తన మంచి మంచి పదబంధాలతో భక్తియుతమైన సంభాషణ లతో ఒకగొప్ప భక్తుడుగా, అనురాగపూరితుడైన తండ్రిగా అభివర్ణించాడు. మీరు భీష్మునిలాగా ప్రకాశిస్తున్నారు. కృష్ణునిలాగా బోధిస్తున్నారు. రామదాసులాగా గానం చేస్తున్నారు. మీరు నిజమైన స్థితప్రజ్ఞులు.

బాపు: అయితే అతడు సృజనాత్మక రచయితయై వుండాలి. నేను ఆ రామదాసంతటి మంచివాణ్ణా?-నేననుకోను. ఉన్నవ గొప్ప సాధకుడు. అతడొక కర్మయోగి.

రంగా: అంతకంటే ఘనుడతడు అతడు నిజాయితీ పరుడైన దేశభక్తుడు. త్యాగధనుడైన యాజ్ఞికుడు.

బాపు: ఏమిటి? నీవు ఉపమించడంలో మిత్రమం చేయడం లేదుగదా?

సర్దారుకు వ్యతిరేకమైన నాస్నేహితుడు యాజ్ఞిక్‌ను గూర్చి వారంటున్నారని నాకు తెలుసు.

బాపు: అవును ఉన్నవకు నాకు చాల విషయాలలో సామ్య మున్నది.

రంగా: అయితే మీరుగూడ మంత్రతంత్రాలను వాడుక చేస్తున్నారన్నమాట. ఉన్నవ గోప్యంగా యోగాన్ని వాడుక చేస్తుంటారని దేశభక్తు డొకప్పుడు నాతో అన్నాడు.

బాపు: లేదు రంగా! ఈ బ్రిటిష్ వాళ్ళను వశీకరణ గావించు కొనడానికి ఈ శక్తులు నాకుంటే బాగుండు నని పిస్తుంది. ఎందుకు? బ్రిటిష్ వారితోను ముస్లింల తోను జరిపిన యీచర్చలను గూర్చి శాసనసభ లోని మీ పార్టీచేత ఒప్పించడం గూడ నాకుసాధ్యం కాదు.

రంగా: నేను పాశ్చాత్య విద్యవల్ల పాడయినాను గనుక తత్వాన్నిగూర్చి యోగవిద్యను గూర్చి సంస్కారాలను గూర్చి నేను చర్చించలేను.

బాపు: రంగా, నీవు దేవుణ్ణి నమ్మవా?

రంగా: నమ్ముతాను.

బాపు: నాలాగా దేవుణ్ణి గూర్చి యింకా తెలుకొనడానికి నీ వభిలషించడం లేదా? నా కంచుకు మరింత సమ యము, శిక్షణవుంటే బాగుండేది.

రంగా: నన్ను నడిపించడానికి డాలుగా వుండడానికి ఇంత మంచియైన, ఇంత అకళంకమైన మార్గదర్శి నాకు

న్నప్పుడు అంతలోత్తుకు వెళ్లవలసిన అవసరం నాకే
మున్నది?

బాపు: నీడా లెవరు?

వారే నా మార్గదర్శియని; నా డాలుఅని అర్థమయ్యే
ట్లు నేను వారివైపు చూచాను.

బాపు: అయితే నీకు తృప్తికలిగిందా?

రంగా: లేదు

బాపు: ఎందుకు?

రంగా: నా మార్గదర్శి కోపిష్టి గనుక, నా డాలు తరచుగా
నాకు రక్షణ యివ్వనుగనుక.

ఆ మాటలు వారికి నవ్వును తెచ్చినవి. ఆ మరు
క్షణమే వారు గంభీరతను దాల్చి చాల విన్రమంగా కన
బడ్డారు.

బాపు: అయితే ఇందుకోసం నీవు ఒక మానవుణ్ణి ఎన్నుకో
కూడదు. నీవు దేవునిమీద మాత్రమే ఆధారపడాలి.

రంగా: తెలిసిన, చూస్తున్న, కొగలించుకొంటున్న, ఇతరు
లతో సంసర్గం పొందుతున్న దేవుణ్ణి మనస్సులో
చిత్రించు కొనడం నాకసాధ్యమైనపని. ఈవిషయా
లలో మనకు మార్గాన్ని చూపడానికి గురువులను
వెదకి కనుగొమ్మని మన ఋషులు చెప్పియున్నారు.
ఉన్నవ దానినే భాయపరచాడు.

బాపు: నాకు దేవుణ్ణి తెలుసునని నీకెలా తెలుసు! నేన
తణ్ణి చూస్తానా? అవును. అతనితో సంసర్గం పొంద

డానికి, అతణ్ని కౌగలించుకొనడానికి నేను ప్రయత్నిస్తాను. కాని అతడు ఏమాత్రం దొరకడు. ఒక్కొక్కప్పుడు అతడు శోభాయమానుడుగా, పరిపూర్ణుడుగా వున్నప్పుడు నేనతణ్ని తెలుసుకోగలనా అని అనిపిస్తుంటుంది.

బాపూజీ యొక్క లోతైన అనుభవాలను గూర్చి సాధకుడైన ఋషియైన ఉన్నవతో మాట్లాడడానికి వీలుగా అతణ్ని ఆఉదయం అచ్చటకు రప్పించినందుకు నా విధికి నేను కృతజ్ఞత తెలుపుకొన్నాను. ఇంతకు ముందుకంటె ఇప్పుడు దేవుడున్నాడని హెచ్చుగా నమ్ముతున్నానని, ఈ భువిలోనే - నాకు చుట్టుప్రక్కలలోనే దేవుణ్ని తెలిసిన మహర్షి లున్నట్లు నేను గుర్తించానని బాపూజీకి చెప్పాను.

రంగా: ఉన్నవ ధ్రువపత్రం నన్ను ఉత్సాహపరిచింది బాపూజీ!

బాపు: ఎంతో మంది శాస్త్రజ్ఞులు పరిశోధకులు దేవుని ఉనికిని సందేహిస్తారు. మన మహర్షులేమి చెప్పారో దానితో నేను సంతృప్తి చెంది వున్నాను.

రంగా: ఐన్‌స్టీన్ గూడ దేవునిలో విశ్వాస ముంచాడు. నేను మీలో విశ్వాసముంచుతున్నాను. గతంలోగాని ఇప్పుడుగాని మన ఋషులు మానవులను రక్షించి, మానవ విలువలను పెంచడానికి చాల కృషిచేస్తూ వున్నారు. మా మహర్షి తన తపస్సుద్వారా అస్ప

శ్రద్ధతను విడిచిపెట్టేటట్లు ముప్పైకోట్లమంది ప్రజలకు నచ్చజెప్పగలిగారు. మీరు నిర్వహిస్తున్న యీ మహాయజ్ఞంలో ఉన్నవ రచించిన మాలపల్లి ఒక సమిధమాత్రమే.

అప్పుడు సమయాన్ని గూర్చి కుర్షిద్ బెన్ గావించిన హెచ్చరికతో మేము ఇహానికి రాగలిగాము. మరలా కలుసుకొమ్మని బాపూజీ నాతో అన్నారు.

కుర్షిద్‌బెన్: ఎప్పుడు? నేడుకాదు. ఈదినం వ్యవధి లేదు.

బాపు: కొంతవ్యవధిని చూడు. రంగా ఎప్పుడూ పనులుండే వ్యక్తి. అతడు ఢిల్లీకి పోవలసివుంది.

రంగా: వద్దు వద్దు బాపూజీ! నేను రేపుగూడ ఇక్కడే వుంటాను. విద్యా సమావేశంలోగూడ నేను మిమ్మల్ని కలుసుకొంటాను. నేను ఢిల్లీనుండి తిరిగివచ్చినప్పుడు మరల.

బాపు: నా కుమార్తె భారతివద్దకు వెళ్లుతూనా?

నేను నవ్వుతూ 'సెలవు తీసుకొంటా'నంటూ "అంటే భూమిమీద వున్న నాదేవు డప్పుడప్పుడు ఆనందకరంగా గూడ వుంటారన్నమాట!"అన్నాను.

బాపు: అప్పుడప్పుడు ఎందుకు? నావద్ద కెన్నడైనా రావచ్చు.

11. లక్నో కాంగ్రెస్సు

1936లో లక్నో కాంగ్రెస్సుకు జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షత వహించాడు. ఆ సమావేశానికి రెండు దినాలకు ముందు రెండవ కిసాన్ వర్కర్ల మహాసభగూడ అచ్చటే సమావేశమయింది. రౌండ్ టేబిల్ మహాసభల ఫలితంగా వచ్చిన 'ఇండియా గవర్నమెంట్ ఆక్టు'లో వున్న 'సమాఖ్య' పథకానికి లోబడి మంత్రివర్గ నిర్మాణ బాధ్యతలను స్వీకరించాలా? పనిలేదా? అన్న సమస్యపై అఖిలభారత కాంగ్రెస్ సమావేశంలో చాల చర్చ జరిగింది. అధికారాన్ని స్వీకరించడానికి జవహర్‌లాల్ నెహ్రూ అంగీకరించలేదు. పదవిని వదలి పెడుతున్న అధ్యక్షుడైన రాజేంద్ర ప్రసాద్ దానిని సమర్థించాడు. అచ్యుత్ పట్వర్ధన్ నాయకత్వాన్నున్న సోషలిస్టులు జవహర్‌లాలును సమర్థించారు. పెద్దలందరూ రాజన్ బాబును బలపరచారు.

భారత కిసాన్ కాంగ్రెస్సును వ్యవస్థీకరించే విషయంలో బాపూజీ ఆశీస్సులను పొందడానికని నేను వారిని కలుసుకొన్నాను.

సర్దారు వ్యతిరేకించినప్పటికీ ఈ విషయంలో అంత పట్టెందుకు పట్టవలసి వచ్చిందని వారు నన్ను ప్రశ్నించారు. కాంగ్రెస్సు, రాజకీయ సమస్యలపై కేంద్రీకరిస్తుంటే కిసాన్ కాంగ్రెస్సు రైతుల కోసం పనిచేయవచ్చునని నేనన్నాను.

బాపు: కాంగ్రెస్సు రైతులకోసమే పనిచేస్తున్నది. కరాచీ పత్రం మాటేమిటి?

కవులుదారీ శాసనాలకు వ్యతిరేకంగా జాగీర్దార్లు, జమీందార్లు సంఘటితం కావడానికి చేస్తున్న ప్రయత్నాలను గూర్చి నేను వారికి చెప్పాను.

రంగా: తమ్మ్నతాము రక్షించు కొనడానికి రైతులు వ్యవస్థీకరించబడాలి. వారు రైతు సంఘములను స్థాపించుకోవాలి.

బాపు: కాంగ్రెస్సు రైతుల్ని రక్షించగలదని సర్దార్ అంటాడు. బార్డోలీ రైతులు ఘన విజయాన్ని సాధించే విధంగా వారినతడు నడిపినున్నాడు గనుక అతనికీ విషయం తెలిసే వుంటుంది.

వడ్డీవ్యాపారస్తులు రైతుల్ని భారతదేశం మొత్తం మీద ఎలా అణచివేస్తున్నారో ఆర్థిక మాంద్యం రైతుల్ని బాపుకార్లు దయాదాక్షిణ్యాలపై ఎలా ఆధారపరచిందో కాంగ్రెస్సు నాయకులు జైళ్ళలో నున్నప్పుడు వారెలా అసహాయులయ్యారో నేను గాంధీగారికి వివరించి చెప్పాను. అందువల్ల రైతులకు సాయపడడానికి కిసాన్ కాంగ్రెస్ అవసరమని అన్నాను.

బాపూ :- అది అవసరమే అని నీవన్నట్లయితే నేను నీతో భేదించలేను.

నారి మాటలకు నేను సంతోషపడేలాగా వారు మరలా ఆ విషయాన్ని గూర్చి

బాపు :- నీవు కొందరు ఆక్షేపణీయకరమైన వ్యక్తులతో చేరుతున్నావని సర్దార్ ఫిర్యాదు గావించాడు.

రంగా :- కాంగ్రెస్ నాయకులు నాకు సాయం చేయనప్పుడు నేను వారిని చేర్చానని అంటే ఎలా?
నా మాటలు గాంధీగారికి నవ్వును తెచ్చాయి. అధికార స్వీకరణమీద ఆ బ్రహ్మాండమైన చర్చ జరిగిన తరువాత నేను గాంధీజీని మరలా కలుసుకొన్నాను. ఆ సభ గావించిన నిర్ణయాన్ని నేను అంగీకరించానేమో తెలుపమన్నారువారు. కాంగ్రెస్ మంత్రివర్గాలు హైతు సమస్యలను చేపట్టాలని నేను వారితో అన్నాను.

బాపు :- అయితే కాంగ్రెస్ మంత్రివర్గాలకు నీ ఆక్షేపణ లేదన్నమాట.

రంగా :- ఆ మంత్రివర్గాలు హైతుల కేమి చేస్తాయన్న విషయాన్ని గూర్చే నేను శ్రద్ధగా వున్నాను.

బాపు :- రంగా! హైతులయెడల నీవు చాల పక్షపాతాన్ని చూపుతున్నావు. అందులో ఆశ్చర్య మేమీలేదు. సర్దారుకు నీవంటే కోపమూ వున్నది. సంతోషమూ వున్నది.

రంగా :- అతనికి నేనంటే అలాటి మిశ్రమ భావా లెందుకుండాలి?

బాపు :- నీవు మద్రాసులోనో మరెచ్చటనో అతనితో నేను మొదట హైతును, ఆ తరువాత కాంగ్రెస్ను వాణ్ణి అన్నావట.

రంగా :- అది నిజమే. కాని అతని మాటేమిటి? అతడు హైతు కాదా?

బాపు :- అతడా? అతడు మొదట కాంగ్రెస్సువాడు రంగా, కాంగ్రెస్సు మంత్రివర్గాలనుండి మొట్టమొదట నీవు కోరదేమిటి?

వ్యవసాయ ఋణాల ఆపుదలను, వ్యవసాయ ధరలు పడిపోవడానికి తగ్గట్లు ఆ ఋణాలను తగ్గించడాన్ని, జమీం

తమకు సన్నిహితులు కాంగ్రెసు మంత్రివర్గములలో చేరరాదన్న ధోరణిని బలపరుస్తూవున్న జవహర్‌లాలు నాయకత్వాన్నే శిరసావహించుటకు, మహత్ముని మంచుటకు రంగాజీ తయారుగా లేరుగనుకనే కాంగ్రెసు సోషలిస్టులు, ఆయన్ను పరిషంగు కమిటీలోనికి పోనివ్వరైరి. తమ స్థానిక ఆధిపత్యం తగ్గించుతారేమోనన్న భయముతో, ఆంధ్ర కాంగ్రెసు నాయకులు, రంగాజీని, ఏ. ఐ. సి. సి. కి ఎన్నుకోకపోయిరి. అఖిలభారత రైతువుద్యమములో ఆయన ప్రాధాన్యతకు కమ్యూనిస్టులు, పి. యస్. పి. వారెదురగు చుండిరి. ఆ దిగ్బంధమునుండి రంగాజీని రక్షించగల్గేది గాంధిజీయే! ఇట్టి బాధలు, నిర్బంధాలు 1945 వరకు రంగాజీని వెంటాడుతూనే వుండినవి.

"నీకు కాంగ్రెసు కావాలా, రైతు కాంగ్రెసు కావాలా" అని సవాలు చేసిరి సర్దారు పటేలు, 1935లో మద్రాసు ఎ.ఐ.సి.సి. సమయంలో! రైతుల కొరకు కాంగ్రెసుగాని, కాంగ్రెసు కొరకు రైతులుకాదు అన్నారు రంగాజీ! అదే సవాలు, సమాధానం యీ రోజువరకు రైతులు, కూలీలు, గ్రామీణులు, స్వయంవృత్తిదారుల నెదురొక్కంటున్నది.

ఆ 1935లో అంతటి సర్దారును అంతగా యెదురొక్కన గల్గిరి గనుకనే, 1951లో, జవహరు లాల్‌నికూడా, రైతాంగ వ్యవస్థ, అందున్న స్వయంవృత్తి, స్వంతవుద్యోగము, స్వయంగా వ్యవసాయము చేసుకొనే

దారీ ప్రాంతాలలో శిస్తు తగ్గింపును, భూమిశిస్తు రద్దును హరిజనుల వంశ పారంపర్య ఋణాల రద్దును నేను కోరాను.

బాపు :- ఆగు. ఆగు. అప్పుడే నీ వంత పట్టికను తయారు చేశావు! అయితే నీవు అధికార స్వీకరణను కోరు తున్నావు.

రంగా :- రాష్ట్ర నాయకులు నాకు వ్యతిరేకంగా వున్నారు గనుక నే నిప్పుడు ఎ. ఐ. సి. సి. సభ్యుడుగా లేను.

బాపు :- ఎవ్వరైనా నిన్నెందుకు వ్యతిరేకించాలి.

రైతాంగపు రక్షణకై, రంగాజీ ఏకాకిగా యెదిరించగల్గిరి. రాచకీయబలం చేర్చుకొంటేనేగాని, తుదకు 1965కు, సీలింగుకు లోబడ్డ (మించని) భూ కమతాలు, వాటిపై ఆధారపడు స్వంతపుద్యోగుల రక్షించగల్గిరి. రాచ కీయబలం కొరకై రైతాంగనాయకులు రైతాంగానికి దూరస్థులైన వారెం దరి సహాయమో పొందవలసి వచ్చెనుగదా! అంతటి త్యాగం చేస్తూ అంతటి రక్షణ కల్గించుటె గాంధేయ శక్తి. సం.

12. ఫైజ్‌పూర్ కాంగ్రెస్ - రైతులు

1936 చలికాలంలో మహారాష్ట్రలోని ఫైజ్‌పూర్లో కాంగ్రెసు సమావేశమైనప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ మూడవసారి అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. ఆ సమయం లోనే అఖిలభారత కిసాన్ కాంగ్రెస్సుగూడ అచ్చట సమావేశమయింది. అధిక సంఖ్యాక బలంతో నేను ఆ కిసాన్ కాంగ్రెస్సుకు అధ్యక్షుణ్ణయ్యాను. కిసాన్ కాంగ్రెస్సును బలపరచడానికి ఒక బ్రహ్మాండమయిన రైతుల ఊరేగింపు సభాస్థలానికి తీసుకొనిరాబడింది. ఆ మహాసభకు ప్రారంభోత్సవం గావించడానికి జవహర్‌లాల్ నెహ్రూను ఆహ్వానిస్తూ, అన్నినదులు సముద్రంలోనికే వెడుతున్న రీతిగా ప్రొలిటేరియన్ కాంగ్రెస్సు జాతీయోద్యమానికి ఏ విధంగా ఊత మిస్తున్నదో ఆ విధంగా కిసాన్ కాంగ్రెస్సుగూడ బలాన్నివ్వగలదని నేనతనికి హామీ నిచ్చాను. మా ప్రథమ ప్రదర్శనము మరొక రాజకీయ శక్తిగా రూపొందడం జవహర్‌లాల్ నెహ్రూకంత యిష్టంగా లేదు. అందువల్ల నేను ఏ. ఐ. సి. సి.లో రైతులను గూర్చి మాట్లాడినప్పు డతడు కారణరహితంగా చాల కోపంగా మాట్లాడాడు. అందువల్ల నేనతని నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా నా అసమ్మతిని తెలియజేశాను. మా మధ్య అదిజరిగిన తరువాత నేను బాపూజీని కలుసుకొన్నాను. అప్పుడతడు నన్ను తమాషాచేస్తూ,

బాపు :- చిన్న అధ్యక్షుడు అంతకంటె చిన్న అధ్యక్షునితో కొట్లాడుతున్నాడు.

రంగా :- మా అన్నయ్య, హెచ్చుగా చూడబడే అన్నయ్య ఎంతగా ప్రేమను చూరగొంటున్నాడో, దాని శక్తి యెంతటిదో చిన్నతమ్ముడు పరీక్షిస్తున్నాడు.

బాపు :- నేను వింటున్నది నిజమేనా? కాంగ్రెసును అభ్యర్థులు వైతులకు ప్రత్యేకమైన హామీ నివ్వాలని నీవు కోరనున్నావా? రెండు హామీల నివ్వడానికి ఎలా వీలుంటుంది.

వైతుల ప్రయోజనాలకు భంగకరంగావున్న ఏ ప్రధాన సమస్యమీదనైనా ఒక తీర్మానాన్ని గావించక ముందు కాంగ్రెస్సుచేత నియమితులైన వైతుఅభ్యర్థులు కాంగ్రెస్సు పార్టీముందు వైతుల దృక్పథాన్ని వివరించాలన్నదే నేను కోరిన హామీ.

బాపు :- వైతుతత్వం గలిగిన శాసనసభ్యులు చేయవల సిందా పనేగదా!

రంగా :- నేను చెబుతున్నట్లు ఒక హామీకి వారు బద్ధులైతే తప్ప చాలమంది అలాగా చేయరు.

బాపు :- ఎందువల్ల నీవలా అంటావు?

స్వరాజ్ శాసనసభ్యులు, ఇప్పటి ఢిల్లీ శాసనసభ్యులు ఏలాగా చేస్తున్నారో ఆ విషయాన్ని నేను వారికి చెప్పాను.

బాపు :- ఈ విషయాన్ని గూర్చి నీవు సర్దారుకు చెప్పావా?

రంగా :- నేనేమీ చెప్పలేదు.

చాపు :- అతనితో చెప్పమని నా సలహా. అలా చేయకపోతే నీవు కష్టాన్ని కొనితెచ్చుకొంటావు.

తరువాత వారు కిసాన్ కాంగ్రెస్ కార్యవర్గానికి చాలమంది కమ్యూనిస్టు, సోషలిస్టు, అంతేగాక ట్రేడ్ యూనియన్ నాయకులుకూడ ఎన్నికైనారన్న విషయాన్ని నా దృష్టికి తెచ్చారు. అలాటి కలయికలకు వ్యతిరేకంగా వారు నన్ను హెచ్చరించారు. బాపూజీ సలహాను అంగీకరించి

రైతాంగ రక్షణ కొరకై, రైతాంగ అభ్యర్థులచేత, "పెడి" ప్రమాణం చేయించబూనిది రంగాజీ : కాంగ్రెసుపార్టికిచ్చు ప్రమాణము నకు లోబడియె, ఆ "ఉపప్రమాణము" అన్నారు. రెండుమధ్య పోటీ తేల్చడానికి, కాంగ్రెసు ప్రమాణం పైమెట్టు అన్నారు. ఐనా, తమ పెత్తనం క్రింద మరొక పెత్తనమా అన్నారు సర్దారు. కనుక, రైతాంగ ప్రమాణమును వుపసంహరించునట్లు నిర్బంధించిరి.

ఆలాంటి 'ఉపప్రమాణం' లేకపోబట్టేగదా యీ నాటికి అన్ని రాష్ట్ర కాంగ్రెసు మంత్రివర్గములలో అత్యధిక సంఖ్యాకులు గ్రామీణులు, గ్రామీణ ప్రజాభిమానులే వున్నప్పటికి, గ్రామీణులగు రైతులు, కూలీలు, వెనుకబడిన జనాలు, హరిజనులు, గిరిజనులకు ప్రాణపదమైన స్వయంవృత్తులు, రైతాంగ వ్యవస్థ, స్వంతంగా సాగుచేయబడే కమతాలకు వ్యతిరేకంగా కంట్రోళ్లు రావడం, శిస్తుభారాలు పడడం, పెంచడం, ధరలు నిర్ణయంచేయడం, పారిశ్రామికులకే లాభాలు, పట్టణాలకే అన్ని సౌకర్యాలు, అధిక అభివృద్ధి, సీలింగు రైతాంగంమీదనే పడడం, రెండోదఫా సీలింగురావడం, బస్తీల పరిశ్రమల కోట్లపై, పదుల వేల ఆదాయాలపై సీలింగు లేకపోవడం:

వుంటే ఎంత బాగుండేది ? నా కొత్తస్నేహితుల పాత చరిత్రనుగూర్చి అప్పుడు నా కంతగా తెలియదు. సర్దారు గూడ నాకు తోడుపడడాని కిష్టపడలేదు. అది జరిగిన కొంత కాలంలోనే సర్దారు, జవహర్‌లాల్ నెహ్రూ వీరిద్దరు కమ్యూనిస్టుల యెడల, వారి సానుభూతిపరుల యెడల తమ తటస్థ విధానాన్ని విడిచిపెట్టి ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్సు మీదనేగాక, కిసాన్ కాంగ్రెస్సుమీదగూడ దాడిని ప్రారంభించారు.

శాసన సభల సభ్యులలో అధిక సంఖ్యాకులు రైతాంగపు గ్రామీణులే! ఐనా గ్రామాభివృద్ధి, రైతు కూలీ రక్షణకై వారికి రంగాజీ సూచించి, సృష్టించిన "పైడి" ఆ శాసనసభ్యులకే వుంటె, మన ప్లానులోని ప్రయారిటీలు, మన శాసనాల్లోని నిర్మాణ శక్తులు గ్రామీణులకు సుముఖంగా వుండేవి! ధర్మం కొన్ని పాదాలనైనా పెంచుకోగల్గేది!

13. రైతులకు ప్రమాణం

బాపూజీ హెచ్చరించినట్లు గడియారం తిరిగినట్లుగా వెనువెంటనే చాల విచారకరమైన సంఘటనలు జరిగినవి. మేము రైతుల ప్రమాణ పత్రాన్ని విడుదల గావించాము. దానిని సమ్మతించడానికి, సమ్మతించక పోవడానికి కాంగ్రెస్ అభ్యర్థులకు స్వాతంత్ర్యమున్నదని మేమన్నాము. కాంగ్రెస్ అంతిమ నిర్ణయానికి భంగంలేని విధంగా రైతుల ప్రయోజనాలను బలపరుస్తామని వారిని మేము వాగ్దానం చేయమన్నాము. ఈ రాజకీయ పద్ధతినే ఈనాడు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలోవున్న కిసాన్ వర్గం 1967 నుండి అనుసరిస్తున్నది. కాని ఆ ప్రమాణపత్రం ఏమి ఉద్దేశించిందో అంతకంటె లోతుగా అందులోకి వెళ్ళాడు వల్లభాయి పటేల్. అలాటి పత్రంమీద సంతకంచేసిన కాంగ్రెస్సు వారు వారి క్రమశిక్షణకు, ఆధిపత్యానికి పూర్తిగా అంత సులభంగా లోబడివుండడని వివిధ రాష్ట్రాలలోని కాంగ్రెస్ నాయకు లతనికి చెప్పారు. అందువల్ల సర్దారు దానికి వ్యతిరేకంగా నియంతృత్వ ధోరణిలో తన తీర్పు నిచ్చాడు. అప్పుడు నేనటో యిటో తేల్చుకోవలసి వచ్చింది. ఆ క్లిష్ట సమయంలో సర్దారుతో ఘర్షణపడి జాతీయ సంఘటనను బలహీనపరచి దాని నొక అయోమయావస్థలో పెట్టడమా మానడమా అని నిర్ణయించుకోవలసి వచ్చింది. అందువల్ల నేను వెంటనే ఆ ప్రమాణ పత్రాన్ని ఉపసంహరించుకొంటూ హేతుబద్ధంగాని పటేల్ దృక్పథానికి వ్యతిరేకంగా నా అసమ్మతిని తెలియజేశాను.

కొన్నిదినాల తరువాత బాపూజీ ఆంధ్రదేశం ద్వారా నందికొండలకు వెళ్ళినప్పుడు వారిని కలుసు కొన్నాను. వారు నా యెడల చాల సానుభూతిని ప్రకటిం చారు. ఉదారమైన నా చర్యను అభినందించారు.

బాపు :- అది నిన్నెంత గాయపరచి వుంటుందో నాకు తెలుసు. నీవు యువకుడివి. హెచ్చు అభిమానం గలవాడివి. కాని నీవు సమయానికి తగ్గట్లు నడచుకొన్నావు. సందేహా స్పదులైన నీ సహచరులతో నిమిత్తంలేకుండా నీ స్వాతం త్ర్యాన్ని ప్రదర్శించినందుకు నాకానందంగా వుంది.

సర్దారు ఆ విధంగా నియంతృత్వ ధోరణిలో వర్తిం చడం తగునా? అని నేను గాంధీగారిని ప్రశ్నించాను. వారు దానికి ప్రత్యక్షమైన జవాబివ్వలేదు. కాని—

బాపు :- రంగా, జీవితం ముళ్ళతోకూడిన రోజా చెట్లపొద. సర్దారు తోడును సంపాదించుకొమ్మని నేను ముందు గానే నిన్ను హెచ్చరించాను.

రంగా :- నిజమే, కాని ప్రజలతో సంబంధాలు పెంచుకొన డానికిగాని, రైతులకు ఆత్మగౌరవకరమైన నాయ కత్వాన్ని పెంపొందించడానికిగాని సర్దార్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూల కిది సరియైన మార్గం కాదు.

బాపు :- ఇప్పటికి నీ సరియైన చర్యతో సంతృప్తి చెందు. ఈ మంచి ప్రారంభం ఇతరులను నీ వంకకు త్రిప్ప గలదు.

రంగా :- ఇది ప్రజాస్వామ్యంగాదు. ఇది కుటుంబంగూడ కాదు. వారు కొంత నెనరుతో వర్తించేలాగా మీరు చూడాలి.

త్వరత్వరగా వారు చేస్తున్న ఆ కారు పర్యటనలో నేను వారితోగూడ మా గ్రామంనుండి వినయాశ్రమానికి ఆచ్చటినుండి మా గ్రామానికి వెళ్ళినచ్చాను. వారు నా భావాల నుపశమింప జేయడానికి ఆ రోజెల్లా చాల ప్రేమగా వున్నారు. నాకు, నాయకులకు ఇటీవల అన్ని వివాదాలు వచ్చినప్పటికీ వారి విశ్వాసాన్ని నే నెంతో హెచ్చుగా చూరగొనియున్నట్లు వారు విలేఖరులకు అభిప్రాయాన్ని కలిగించారు.

11)

14. అజ్ఞాతవాసం

బొంబాయి అఖిలభారత కాంగ్రెస్ మహాసభ 'క్విట్' ఇండియా నినాదాన్నివ్వడానికి తీర్మానించింది. గాంధీగారి ఉపన్యాసం ఉద్రేకంతో కదలిపోతున్నది. "చేయి లేక చావు" అని చెబుతూ ప్రజలను ఉద్రేకపరచాలనే వారి నిశ్చితమైన ప్రయత్నం. 1930లో వారు "స్వరాజ్యాన్నైనా సాధిస్తాను; లేకుంటే నా శరీరం అరేబియా సముద్రంలో తేలుతుంది" అని ఉద్బోధించిన సమయాన్ని స్ఫురింప జేసింది. నగ్నమైన ఉరంతో, కాళ్ళిక దానిపై ఒకటి వేసుకొని, ఎడతెరిపిలేకుండా ఎడమచేతి నాడిస్తూ వారు అగ్నిపర్వత జ్వాలల్లాటి వాక్కుల్ని వెలువరిస్తుంటే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మన జాతీయ విధానాన్ని సమర్థిస్తూ వారు చేస్తున్న దీర్ఘమైన, సుదీర్ఘమైన వివిధ దృక్పథాలతో కూడుకొన్న విజ్ఞప్తిని, వాదాన్ని, హెచ్చరికను వింటుంటే ప్రతి నిమిషం మేము మారిపోజొచ్చాము.

ఆ తరువాత వెంటనే మాలో కొందరం వారితో కొన్ని నిమిషాలు గడిపాము. అప్పుడు మేము చర్చలలోకి దిగలేదు. వారినుండి ఉత్తేజాన్ని పొందడానికి మాట్లాడాము. అప్పుడు ఒకమాట చెప్పమని వారు నన్నడిగే అదృష్టం నాకు కలిగింది. 1940 లో బ్రిటిష్ప్రభుత్వం నా మీద వేసిన 'ఇంటర్న్మెంటు' ఉత్తరువును నేను వ్యతిరేకించినందుకు వారు దయారహితంగా నా మీద చేసుకొన్న కోపానికి దెబ్బతిన్న నా మనసును సర్దుబాటు చేయ

డానికని వారు నన్నలా అనుగ్రహించారా? దానితోపాటు బ్రిటిష్ అధికార్ల బంధాలలోనుండి మాస్కోమీదుగా బెర్లిన్ వెళ్ళిన సుభాస్ బాబుతోవున్న, అందరెరిగిన నాస్నేహంతో దీనికేమైనా సంబంధ మున్నదా? అనుకోసాగితిని.

బాపూజీ ఆ చరిత్రాత్మకమైన 1942 ఆగస్టు ఉపన్యాసాన్నిస్తున్నప్పుడు నేను వారిని చూస్తుంటే వింధ్యాచలంలాటి విశాలమైన అతని ఉరంతో, కైలాసమంత ఎత్తుగానున్న శిరస్సుతో అతడు మహోత్ముడైన ఆ వృద్ధ భీష్ముని అవతారమా యేమి అని నా కనిపించిందని, అప్పుడు ప్రతివారు ఒక అర్జునుడుగా మారిపోయారని నేను వారికి చెప్పాను.

మరో పర్యాయము జాతీయ సంరంభములో కైతాం గము యెలాగా మెలగవలెనో బాపూజీ ధోరణి తెలుసు కొనుటకు కలుసుకొందా మనుకొంటిని. 1940 లో ఇంటర్నమెంటు ఆర్డరును గాంధేయ ధోరణిలో నేను యెదిరించినప్పుడు, అనవసరంగా నా ప్రత్యర్థుల గోలనే గమనించి, నేనేదో విధంగా సుభాష్‌బోసునే బల పరుస్తూ, తమ నాయకత్వాన్ని తృణీకరించి, ప్రత్యేక సామ్రాజ్య వ్యతిరేక సంరంభం ప్రారంభించినామనే భ్రమతో బాపూజీ నాపై గొప్ప వ్యతిరేకత ప్రకటించిరి. అలాంటి బాధ తిరిగి కలగకుండుటకై, 1942 ఉద్యమములో ఎలా వ్యవహరించమందురో అడిగి తెలుసుకోవాలనుకొంటిని. కాని తెల్లవారేసరికే వారిని అహమ్మదునగర్‌లోని ఆగాఖాన్ భవనంలో నిర్బంధించి వేసిరి. ఆ పిమ్మట

రెండురోజులు బొంబాయిలో బ్రిటిషు బలగాలమీద స్వాతంత్ర్యయోధులు సాగించిన గొరిల్లా ప్రతిష్టంభనను చూచుటయె సాధ్యమయ్యెను. కాంగ్రెసువారు కొందరు ప్రచారంచేసిన ఒక "రహస్య సర్కులరు" గురించి తెలుసు కొంటిని. నేను వెన్వెంటనే అజ్ఞాతవాసములోనికి (అండరు గ్రౌండు) మరెందరివలెనో వెళ్ళితిని. ఆ బొంబాయిలో అప్పుడు అలాగే వ్యవహరిస్తూ వుండిన శ్రీమతి సుచేత కృపలానీ, అచ్యుత పట్వర్ధన్ ప్రభృతులతో చేరితిని.

రెండో పర్యాయం నన్ను పట్టుకొని డెటినూగా నన్ను వెల్లూరు జైలులో నిర్బంధించినప్పుడే (నాల్గునెలల పిమ్మట) గొరిల్లా, అండరుగ్రౌండు, అజ్ఞాతవాసపు వ్యవహారాలు బాపూజీ తలపెట్టనేలేదని తెలుసుకొంటిని. అప్పటికే ఆ సాయుధ, అజ్ఞాతవాసపు తిరుగుబాటు నీరైపోయినది. మరో మాసానికి ఆ చైదములన్నిటికి బాపూజీ బాధ్యత అంటూ వైస్రాయి లిన్ లిత్‌గో పెద్ద ప్రకటన చేసిరి. అదంతా అబద్ధమంటూ మహాత్ములు - చావు పర్యంతం వచ్చిన కఠోర ఉపవాసవ్రతం సాగించిరి గదా?

15. అంతర్విభేదాలు

చారిత్రాత్మకమైన నాగపూర్ హిందూ-మహమ్మదీయ సఖ్యతకై, శాంతి స్థాపనకై మహాత్ముడు ప్రేమిస్తూ వుండగా మద్రాసులో ప్రకాశం మంత్రివర్గమును పడగొట్టుటకై, కళా వెంకటరావు-కామరాజునాడారు ప్రభృతులు 1946లో ప్రతిష్ఠభనం తెస్తూవుండిరి. ఫలానా తప్పిదాలకై మంత్రి వర్గం మారాలి అనే ఆచారాన్నుల్లంఘించి, తమలో కొందరికి మంత్రి పదవులు రాలేదు, పొందాలనే సంకుచితమైన పట్టుదలపై తిరుగబడుచుండిరి.

అతి త్వరితంగా తమవారిని, పెరవారిని సంప్రదించకయే, మహాత్మని నిర్మాణ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టుచున్నానంటూ ప్రకాశంగారు ఖాదీ, గ్రామ్యోద్యోగ దయం, హరిజన రక్షణలకై ఒక్కొక్క కోటి శాంక్షన్ చేస్తూ, ప్రొహిబిషన్ను రాజాజీ కోర్కె ననుసరించి అమలు పరుస్తానంటూ ప్రకటన చేసిరి. ఆ ప్రణాళికలన్నీ 1920 నుండి అందరు అంగీకరించినవే గదా అని వారి ధోరణి.

ఏ కారణాలు తెలుపకనే, వెంకట్రావు - నాడారు విశ్వాసరాహిత్య తీర్మానాన్ని ప్రకాశం మంత్రివర్గంపై ప్రయోగించిరి. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా వున్న నేను, వారలా ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టరాదు, యం. యల్. ఏలు దాన్ని బలపరచరాదని, రాష్ట్ర కాంగ్రెసు కమిటీ సమావేశంద్వారా ప్రకటించితిని. వారలా చేయడం ప్రజా ప్రాతినిధ్య ధర్మములకు వ్యతిరేకమంటిని. తిరుగు

బాటుదారులు తమకు సర్దారు పటేలు - వర్కింగు కమిటీ వత్తాసు వున్నదనే ధైర్యంతో మా ఆంక్షలను లెక్కించ కుండా, ప్రకాశాన్ని ఓడించి, రామస్వామి రెడ్డిని కొత్త కాంగ్రెసు లీడరుగా యెన్నుకొనిరి. మహాత్ముడు నాయకత్వము నకై నిలబడవద్దని ప్రకాశంగారి కిచ్చిన సలహాను ధిక్కరించి, నిలబడి, లీడరుగా యెన్నిక చేయించుకొన్నారనే క్రోధంతో పటేలుగారు మా కాంగ్రెసు కమిటీని బలపరచక, కళా వెంకట్రావు ముఠానే ప్రోత్సహించిరి. అప్పుడు కొండా వెంకటప్పయ్యగారు, నేను కాంగ్రెసు వర్కింగు కమిటీవారి ముందు తిరుగుబాటుదార్ల ప్రవర్తనను వర్కింగు కమిటీ బలపరచితే, కాంగ్రెసు మంత్రివర్గాల నిలకడకు, నైతిక స్థాయికి, ముఖ్యమంత్రుల పెత్తనానికి గొప్ప దెబ్బ తగులు నని హెచ్చరిస్తిమి. మున్ముందు కాంగ్రెసు మంత్రివర్గముల అస్థిరత్వము పెరిగిపోవును, పరస్పర ఐక్యత, కలయిక, సహ కారం కాంగ్రెసు అసెంబ్లీ సభ్యులమధ్య సన్నగిల్లునని ఘోషించితిమి. వర్కింగు కమిటీ పటేలుగారి మాటనే పాటించిరి. రెడ్డిగారి కొత్త నాయకత్వము, ముఖ్యమంత్రిత్వ మునే బలపరిచిరి. ప్రకాశంగారి నిర్మాణ కార్యక్రమాలను త్రోసివేసిరి. అలాగా గాంధేయ పథకాలు వమ్ము కావ డానికి కూడా వర్కింగు కమిటీ సందేహించలేదు. అంతగా జయంపొందిన కొత్తమంత్రివర్గం వారి స్నేహితులు, తాము ఆడింది ఆట అనే ధీమాతో బంధు, కుల, ప్రాంతీయాభిమా నాలకు, అధికార దుర్వినియోగానికి, లంచగొండితనానికి స్వేచ్ఛగా పూసుకొన్నారంటే ఆశ్చర్యమేమి? పైసెన్సులు,

పత్రికల్లు, కోటాలతో కాంగ్రెసువారే వ్యాపారము చేయ మొదలిడిరి.

ఈ అవివేకతకరమైన రాచకీయాధికార దుర్వినియోగం గురించి బాపూజీకి మెన్నో అభియోగములు (కంప్లైయింటులు) అందుచుండెను. ఎందరో స్వయంగా వారిని షిమ్లీలో కలిసి, జరుగుచున్న 'కరప్షన్', అధికార దుర్వినియోగం, లంచగొండితనం గురించి పదే పదే చెప్పుచుండిరి.

కొందరు ఆంధ్ర హితు సేవకులు బాపూజీని కలుసుకోగా, 'ఎందుకు యీ అన్యాయాల వ్యవహారం గురించి తంగా, మీరు ఏమి మాట్లాడకున్నారు' అని అడిగిరి. "ఆయనేమి చేయగలడు? సర్దారు తిరుగుబాటుదారులను సమర్థిస్తుండిరి. క్రొత్త మంత్రివర్గం వచ్చిన క్రొత్తలోనే, వారిపై నెపముల నెన్నుటకు రంగా పూనుకొనరుగదా! ఆయన కేల పక్షపాతం" అన్నారట. "అలాగని, వూరుకుండుట తగునా-తప్పులు జరుగుచున్నప్పుడు" అనిరట. కనుక, గాంధీజీకి అన్ని విషయాలు వివరించమని వారు నన్ను కోరిరి.

స్వరాజ్యము వచ్చిన పిమ్మట, వివిధ మతస్థుల మధ్య చెలరేగిన దారుణ కలహాలు, హత్యలు, అటు యిటు లక్షలాది ఆస్తులు వూళ్ళు, జిల్లాలు వదలి, వలసకై తిరుగాడుచుండుట, అందువల్ల కల్గిన హత్యాకాండల గురించి, గాంధీజీ కెంతో తాపం, హృదయావేదన కల్గుచుండెను.

స్వరాజ్యం రాకముందువున్న భారతభూమిని రెండు ఖండాలు గావించిన తరువాత చెలరేగిన మతకలహాలను

గూర్చి ఆ ఖండాలనుండి పెద్దఎత్తున జరుగుతున్న శరణార్థుల వలసనుగూర్చి గాంధీగారు చాల వ్యధబొంది వున్నారు. దేశ విభజనవల్ల బాధితులైన వారి కోపతాపాలను చల్లార్చడానికి ఆ ఏకాంతహోమంవల్ల తగిలిన గాయాలను మాన్చడానికి వారు తన యావచ్ఛక్తిని ఆధ్యాత్మిక బలాన్ని వినియోగిస్తున్నారు.

ఈ అధికార రాజకీయాల కీ సమయంలో వారు పెచ్చు సమయాన్ని వినియోగించగలరని నే నెలా విశ్వసించగలను? ప్రార్థనా సమావేశం తరువాత నేను వారిని కలుసుకొనడాని కవకాశం కలిగినప్పుడు, కొంత సంభాషణ జరిగిన తరువాత నే నెందుకు వారిని కలుసుకొనలేదో, ఎందుకు నేనింతగా మౌనంగా వున్నానో తెలియజేయ వలసిందని వారు నన్ను కోరారు.

రంగా:- మిమ్మల్ని ఇబ్బంది పెట్టి లాభ మేమున్నది? ఈ సంఘటనలు జరుగుతున్నప్పుడు మీ నుండి మమ్మల్ని బలపరుస్తూ ఒక్క మాటైనా రాలేదు గదా! కాంగ్రెస్ అధిష్ఠానవర్గం కొత్త మంత్రి వర్గాన్ని ఆశీర్వదించింది.

బాపు:- ఈ మతకలహాల అగ్నులు మన హృదయాల నన్నిటినీ కాల్చివేస్తుంటే నే నీ మంత్రివర్గాల వ్యవహారాల నెలా చూడగలను?

రంగా:- అందువల్లనే నేనుగూడ మౌనంగా వున్నాను. భయంకరమైన మతకలహలవల్ల మీ హృదయం

ఎలా నొప్పించబడుతున్నదో నాకు తెలుసు. మీ బాధలకు మా కష్టాలను నేను తోడు జేయదలచ లేదు.

బాపు:- నీవుగూడ దేశభక్తుని (కొండా వెంకటప్పయ్య) దోషారోపణ పత్రాన్ని చూచావా?

నాకు తెలుసునని సూచించాను. అయితే నీవా శిర్వాదులతో అంగీకరిస్తున్నావా? నాకు నీవు వాటిగురించి వ్రాసి వుండవలసింది.

వాచలా అనడంవల్ల ఆ రాత్రే నేను దానికి సంబంధించిన ఒక నివేదికను పంపవలసి వచ్చింది. దక్షిణభారతంలో

లంచగొండితనం (Corruption) బంధు, మిత్ర, కుల, మత పక్షపాతం (Nepotism, Social Discrimination) క్రిందటి 26 సంవత్సరాలలో పెచ్చుపెరిగినవి. రైల్వేలకై ఆచార్య క్రిప్లానీ, ప్రభుత్వ రంగ మరమ్మత్తుకై సంతానం కమిటీలు దీర్ఘ చర్చలుచేసి, సలహాల నందించిరి. తుదకు స్వీడన్‌లో ప్రారంభింపబడి, ఇంగ్లండు, ఆస్ట్రేలియా, న్యూజీలాండు, కెనడాలలో అంగీకరింపబడిన ఆంబుడ్స్‌మన్ (Ombudsman) అనే విచారణాధికారిని మన దేశంలోకూడా యేర్పరచాలని శ్రీ మున్షీ, రంగాజీ కోరిరి. శ్రీ ముకార్జీ అధ్యక్షతక్రింద అడ్మినిస్ట్రేషన్ కమీషన్ వారు "లోక్‌పాలు" "లోకాయుక్త" అనే సంస్థల నేర్పాటు చేయమన్నారు. ఇంతవరకు ఆ సంస్థల నిర్మాణం ప్రారంభం కాలేదు,

పార్టీ నిధులకు విరాళములు యిచ్చువారు తక్కువై పోయినారు. సభ్యత్వ చందాల ద్వారా వసూళ్ళు తక్కువై పోతున్నవి. కంపెనీలు బహిరంగంగా విరాళములు యివ్వరాదన్నారు. రహస్యంగా అందిం

కాంగ్రెసును ప్రధాన రంగాలనన్నిటినీ ఏదో తీవ్రమైన అవినీతి తెగులు తినిపేస్తుంటనే వారి భయాన్ని నా నివేదిక బలపరించింది. అందువల్లనే వారు వెంకట్రావు - కామరాజుల కొత్త కాంగ్రెస్ తత్వాన్నిగూర్చి మాట్లాడారు.

చడం తక్కువై పోతున్నది. కనుక యేవేవో ప్రాజెక్టులకొరకు, ప్రాంతీయ పనులకై కాంక్షను అగు ఫండ్సునుండి, ఆయా కంట్రాక్టర్లు, కంపెనీలు, పై ఉద్యోగుల షెరీకుతో ప్రభుత్వములోవున్న పార్టీ పెద్దలు వసూళ్ళు చేసుకుంటున్నారు. ఏవో సభలు, ఉత్సవాలు, సువనీర్లు అనే వాటిపేరున ఎందరెందరో ప్రభుత్వం నుండి మితిమించిన లాభాలు పొందే వారి ద్వారా వసూళ్ళు అగుచున్నవి. ప్రత్యర్థి పక్షాలవారికి యీ వసతులు తక్కువ. కొందరికి యితర దేశాలనుండి మద్దతు వస్తుంది. ఇదంతా రహస్య దారులనుండే! కనుక అందించినవారు, అందుకొన్నవారు, వాడిన వారు, ఫుచ్చుకొన్నవారు, దాచినవారు, అందరు దొంగతనంగా, దొర తనపు వేషం వేస్తున్నారు.

ఇది మహాత్మునికి యిష్టమగునా? ఈ పద్ధతుల నెదిరిస్తున్న రాజాజీ, రంగాజీ స్వతంత్రపార్టీని స్థాపించి, ధనం తగినంతగా అందక, తుదకు బొంబై, ఢిల్లీ ధనికుల సాయం అర్థించి, తగిన సహాయం బహిరంగంగా పొందజాలక పార్టీల పోటీలలో వోడిపోయిరిగదా! విసుగెత్తి, యీ వివిధపార్టీలు అపోజిషన్‌లో వేర్వేరు నిధుల సంపాదనవల్ల ధనిక స్వాములకు లోబడడం పెరిగిపోవును గనుక, అందరు వొకే వొక పార్టీగా వుంటె వారందరి ఆర్థిక స్వాతంత్ర్యము తగ్గించవచ్చు ననుకున్నారు. ఏ విధంగా చూచినా, ఎవ్వరికైనా అధికారంగలవారికే, అధికారంలో భాగం కోరదలచినవారే నిధుల నిస్తారని తేలింది. ఈలాంటి

దౌర్భాగ్యమునుండి ప్రతిపక్షాలు, ప్రభుత్వ పక్షము మోక్షం పొందా లంటే అఖిలపక్ష ప్రభుత్వాల నేర్పాటు చేయడం మేలని రంగాజీ 1967 నుంచి చెప్పుతున్నారు. ఎన్నికలు, వివిధపార్టీల పరస్పర పోటీలు వుంటున్నవి. తప్పదు. వాటి నంటుకునే లంచగొండితనం వస్తూ వుంటుందేమో?

ఐనా విచ్చలవిడిగా లంచగొండితనం వీరవిహారం చేయకుండా చేయకపోతే, ఆఫీసర్లు అసలే లంచాలరాయుళ్లు అయిపోతారు. కనుక "లోక్‌పాలు" సంస్థ ద్వారా మంత్రులను కట్టడిలో వుంచాలి. ఆఫీసర్లను "లోకాయుక్త" ద్వారా కంట్రోలు చేయక తప్పదు, ఇంతవరకు పెత్తనం లోకి వచ్చిన కాంగ్రెసువారు, యస్. వి.డి. మంత్రివర్గములవారు ఈ మహామారికి దూపం వేసిరేకాని యెదిరించక పోయినారనే బాధ గాంధేయులగు రంగాజీ ప్రభృతులకు కల్గుచున్నది. అందుకు తానే అధికార పదవుల నందుకొనకుండుట తనకు అందిన గొప్ప అదృష్టమని రంగాజీ భావం.

సం.

16. ఆంధ్ర పిర్యాదులనుగాంచి గాంధీజీ

తన త్యాగంవల్ల, ధైర్యంవల్ల, నిజాయితీవల్ల అందరిచేత గౌరవింపబడి, సహాయ నిరాకరణోద్యమ తొలి దశలో దక్షిణగాంధీ అని పేరుపొందిన ఆంధ్ర నాయకులలో అగ్రగణ్యు లొకరు 1947 డిసెంబరు రెండవవారంలో గాంధీగారికి రచించిన లేఖ ఇచ్చటనున్న అధ్యాన్న పరిస్థితులను వారికి తెలియజేసినవి. 'కాంగ్రెస్సువారు ఎంత నైతికపతనం పొందారో గాంధీగారికి తెలియడానికని ఎన్నో సత్యాగ్రహ పోరాటాలలో పాల్గొన్న ఆ యోధుడు, ఒక కాలు విరిగి యింటిలోని నాలుగు గోడలమధ్య చంక కర్ర లపై కుంటుకుంటూ నడుస్తున్న ఈ ముదివగ్గుకు కావల సిందేమీలేదు. ఎవరిమీద వైషమ్యంలేదు'అని వ్రాశాడు.

చాలమంది శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు క్రిమినల్ కోర్టులలో తమ పలుకుబడి నుపయోగించి, ప్రొద్దుండగానే చక్కబెట్టుకో అన్నట్లు ధనాన్ని గడిస్తున్నారు. వీరి జోక్యంవల్ల జిల్లాకలెక్టర్లు, రెవిన్యూ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చలేక పోతున్నారు. సక్రమంగా తమ బాధ్యతలను తాను నిర్వర్తించే అధికారి పదవిలో వుండలేకపోతున్నాడు. కాంగ్రెస్ వర్గాలలోని అనైక్యత, మంత్రుల బలహీనత ప్రజలలో ఒక విధమైన తిరుగుబాటు తత్వాన్ని రేకెత్తిస్తున్నది. ప్రజలు బ్రిటిష్ ప్రభుత్వమే ఎంతో మేలని అనడమేగాక కాంగ్రెస్సును దుయ్యబట్టజొచ్చారు.

ఆ లేఖ చేరిన తరువాత గాంధీగారు 'గతంలో మనం నిర్వహించిన సత్యాగ్రహోద్యమాలు నిజమైన తత్వం లేకుండా బలహీనుల సాత్వికనిరోధాలుగా దిగజారినవి గనుకనే ఈనాడు మన నైతిక స్థాయి ఇంతగా పడిపోయింది' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్సును రక్షించాలంటే పెంపొందుతున్న ఈ అయోమయావస్థలో ఖచ్చితంగా పక్షపాతరహితంగా వుండగల అధ్యక్షుడుండాలి. ఆలా వుండాలంటే కాంగ్రెస్ సంస్థ అధికార రాజకీయాల ఒత్తిడులకు అతీతంగా వుండాలి. అలా లేకపోతే కాంగ్రెస్సు ధ్వంసమైపోతుంది. అలా అది ధ్వంసమై పోవడానికంటె దానిని రద్దు గావించడం మంచిది. ఆంధ్రనుండి నాకు వచ్చిన లేఖనుబట్టి కాంగ్రెస్సు కుళ్ళి నశిస్తున్నదని నేను ఖచ్చితంగా అనుకొంటున్నాను. అందులో వున్నదంతా నిజమైనట్లయితే మనం బానిసలుగా వుండడానికి మాత్రమే అర్హులనిపించదా?

1947 డిసెంబరు 12 వ తేదీన గాంధీజీ తన ప్రార్థనా సమావేశంలో.....'రాష్ట్రాల ప్రజలు త్యాగధనుడైన భారతీయ సేవకుని మాటల్ని లెక్కించక అతడు చెబుతున్నట్లు లంచగొండితనం ఒక ఆంధ్రకు మాత్రమే పరిమితం గాదు.....మనం దీనిని గుర్తించాలి!' అనిఅన్నారు.

II

నాగపూరులో 1939 లో సామ్రాజ్యవాద వ్యతిరేక మహాసభ జరుపబడింది. సుభాస్‌చంద్రబోసు ఆ మహా సభకు అధ్యక్షత వహించారు. మే మూహించినట్లు యుద్ధం రానే వచ్చింది. కనుక మేమంతా సత్యాగ్రహోద్యమం

సాగించబడునని ఉత్సాహంగా వున్నాము. స్వరాజ్య మివ్వాలనే జాతీయ అభీష్టాన్ని బ్రిటిష్ వారంగీకరించకపోతే కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా యివ్వాలని మేము కోరసాగాము. ఆ సమయంలోనే ధాన్యం ధరలమీద విధించిన కంట్రోళ్ళను, రైతులవద్దనుండి నిర్బంధ ధాన్య సేకరణ చేయడాన్ని కాంగ్రెసు ముఖ్యమంత్రులు ఎదిరించాలని చెప్పడంలో నేను మునిగివున్నాను. వారు మా రైతుల అభ్యర్థనలను బలపరచడాని కంగీకరించారు. ఈ సువార్తను నేను గాంధీగారి కందించినప్పుడు మన మంత్రి వర్గాలను రాజీనామా పెట్టమనడాన్ని, వాటిని రైతుల అభ్యర్థనలను బలపరచమనడాన్ని, ఏ విధంగా సమన్వయం చేయగలనని వారు నన్ను ప్రశ్నించారు. మంత్రివర్గా లెంతవరకు అధికారంలో ఉంటాయో అంతవరకు రైతుల కోర్కెలను బలపరచమనీ అన్నాను. నేను బ్రిటిష్ వారొకవేళ స్వరాజ్యాన్నే యివ్వకపోతే అప్పుడు ఇతర కోరికలలాగే రైతుల కోరికలనుకూడ ఆవల పెట్టవల సిందే అని చెప్పాను. కాంగ్రెసు మంత్రివర్గాలు రాజీ నామా పెట్టాలనే మా ఆందోళన వారికి సంతృప్తికలిగించ లేదు. అవి బాధితులైన ప్రజలకు హెచ్చుగా సాయం చేసినందువల్లనే సుభాష్‌చంద్రబోసు అంత కష్టపడి అస్సా ములో కాంగ్రెసు మంత్రివర్గం నిర్మాణం అయ్యేటట్లు చేయగలిగారుగదా! గతంలో వుండిన జాగీర్దార్ మంత్రి వర్గాలవల్ల రైతులకు కావలసిన అవసరాలు తీరకపోయి నందువల్లనే 1936-37 లో కాంగ్రెస్ అధికార స్వీకరణను

నేను వ్యతిరేకించలేదన్న విషయాన్ని వారు నా గుర్తుకు తెచ్చారు.

కాంగ్రెసు మంత్రివర్గాలు యిక మరేమి ప్రజాసేవ, సాకర్యములు చేయజాలవన్నాను. యుద్ధ అవసరాలు, నిర్బంధాలు వచ్చినందువల్ల రైతు - కూలీలకు యింకేమి చేయగలవు :

బాపు:- ఐతే యుద్ధ సమయం చూచుకొని దేశాని కేదో ప్రత్యేక సేవలు చేయాలంటారు గదా ?

రంగా:- ఎందుకు చేయరాదు.

బాపు:- జాతీయ శత్రువులు యీ ప్రపంచ యుద్ధంలో చావుబ్రతుకులమధ్య చిక్కుకొన్నప్పుడా ?

రంగా :- మరోవిధంగా ధర్మమైన మన జాతీయ స్వాతంత్ర్య డిమాండుకు వారొప్పుకుందురా? వారు సత్తా - సామర్థ్యాలతో నిండివున్నప్పుడు, స్వాతంత్ర్యమో అన్న మన ధార్మిక కోరికను మన్నించిరా? వెజ్జివుడ్ బెన్ అనే బ్రిటిష్ వారి మంత్రి అందించిన వుదారమైన సందేశమును మరువరాదన్నారు.

రంగా:- ఐతేనేమి ? ఎన్నిమారులు వారు తమ వాగ్దానాలను భంగపరచలేదు? మన జాతీయోద్యమాన్ని త్రొక్కి వేయుటకు ప్రయత్నించలేదు ?

బాపు:-సుభాష్‌బోసు మాదిరిగా వాదిస్తున్నావు. కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా పెట్టాలనడంలో, కొన్ని మంత్రివర్గాలమీద కోపముతో కాదుగదా ?

రంగా:- ఏ మంత్రులమీద నాకు వ్యతిరేకత లేదు! అంతే కాదు, ఎందరు వారిని వ్యతిరేకిస్తున్నా ప్రజలకు ఉపయోగించే కార్యాలు నిర్వహిస్తున్న మంత్రులను అభినందించడంలో నేనే ముందడుగు వేస్తున్నాను.

బాపు:- బీహారు, యు.పీలోని మీ సోదర కిసాను నాయకుల సంగతేమి?

రంగా:-మంత్రివర్గాలు మన జాతీయ సంరంభ ధోరణిని బలహీనపరుస్తున్నవనే నా విశ్వాసాన్ని దాచగలనా? డాక్టరు ఖరే, బొంబాయి మేయరు నారీమణులను కాంగ్రెసునుండి తొలగించడం, శ్రీమతి విజయ లక్ష్మిని మంత్రిగాచేసి, మంత్రిత్వములను అంగీకరించవద్దన్న శ్రీ జవహరులాలును తృప్తిపరచుచుండుట, మన నైతిక స్థాయిని తగ్గించలేదా?

1939-45 మధ్య కాంగ్రెసు మంత్రివర్గములు లేకుండుట, ఆ కక్షతో బ్రిటిషు ప్రభుత్వం లీగును, దాని నాయకులు జిన్నాను బలపరచడం, సందు చూచుకొని, జిన్నాగారు "కాంగ్రెసు పెత్తనంనుండి విముక్తి కల్గింది" అనే ప్రచారం సాగించడం, క్రమంగా లీగు ప్రచారం ద్వారా హిందువుల నెందరినో బెంగాలు, పంజాబులలో మూసకోత కోయించడం జరిగినది. అందువల్ల, పాకిస్థాను ధోరణి బలపడినది. క్రమంగా దేశవిభజనకు దారి సమమైపోయినది - అనేవారున్నారు. సం.

17. పర్మిట్లు, కంట్రోళ్ల దౌర్భాగ్యం

స్వరాజ్య మంత్రివర్గములతో అసంతృప్తి చెందిన వారు మహాత్మునికి తమ బాధలను తెల్పుకుంటుండేవారు. మొదట్లో ముస్లింలీగు, హిందూమహాసభకు చెందిన మంత్రులు కొంతమందివున్నా, త్వరితంగానే కాంగ్రెసు మంత్రులే సెంట్రలు కాబినెట్టులో ప్రాధాన్యత బొందిరి. ప్రార్థన, షికారుసమయాలలో బాపూజీని రైతుకూలీ నాయకులు కలుసుకుంటూ, తమ అనుభవాలను తెల్పేవారు. ఆ కంట్రోళ్ళ కరకు బాధలు బ్రిటీషువారి కాలంలో కంటె నెహ్రూ పెత్తనం క్రిందనే హెచ్చైనవంటూ చెప్పుతున్నారు.

రైతులమీద స్వరాజ్యప్రభుత్వంకూడా కంట్రోళ్ల పెత్తనం పెంచుతున్నదేయని బాపూజీ బాధపడుచుండేవారు. ఉత్తరాలద్వారా, స్వయంగా కలిసినప్పుడు, వర్కింగు కమిటీలో నున్నప్పుడు నిర్బంధ ధాన్య సేకరణ, గిట్టుబాటుకాని ధరలకే కంట్రోలు, పోలీసుల నిర్బంధాలువల్ల రైతులెంత బాధపడుచున్నారో తెల్పుచుంటిని. ఆఖరుకు, నెత్తిమీటలు ద్వారా బియ్యానెత్తుకుపోతున్న వ్యవసాయ కూలీల నెటుల పోలీసులు బాధిస్తున్నారో తెల్పితిని. చిన్నచిన్న కమతాలుగల బీదరైతులనైనా ఆ కంట్రోళ్ల బాధనుండి తొలగించరాదా? నెత్తి మోపులవారిని వదలి వేయరాదా? ఆఖరుకు కొన్ని భాగాలను, కొంత పంటలను, కొందరు వృత్తిదారులను, కూలీలను పోలీసుల కబంధ

హాస్తాలనుండి విడుదల చేయనద్దా? కాని, రాజేంద్రబాబు (ఫుడ్ మంత్రి), జవహరులాలు తమ ప్రత్యేక ఎక్సపర్టు (అధికారులు) అలాచేస్తే కలిగే దుష్పరిణామాల గురించి హెచ్చరించుచున్నప్పుడు, బాపూజీ వారితో "రంగా నాకున్న ఎక్స్పర్టు. ఆయన కిసాను, ఆయన సలహానేల మీరు అంగీకరించరు" అన్నారు. అప్పుడు నేను కల్పించుకుంటూ

రంగా: వారి డిపార్టుమెంటు సెక్రటరీలు నాకు "ఎక్సపర్టు" అనే సర్టిఫికేట్టుగూడా యివ్వరే?

బాపు: నీవు మంత్రివయ్యేవాడివే, నీవు అంగీకరించి వున్నట్లయితే.

రాజేంద్ర బాబు: ఇప్పుడు మాత్రం, రంగాయే ఫుడ్ మంత్రి పదవి అంగీకరించరాదా?

బాపూజీ అలాగా నన్ను బలపరుస్తూ వుండేవారు. అఖిలభారత డీ-కంట్రోలు దినం మేము సాగిస్తే, జవహరులాలు బాపూజీవద్దకువెళ్ళి, 'మంత్రిగా వుండమంటె వొప్పుకోడు, యీ విధంగా మా విధానాలను దేశమంతటా రంగా ప్రతిఘటిస్తున్నారు' అనేవారు. ఇరుపక్షాలకు విసుగెత్తినది. బాపూజీ యేమో 'కంట్రోళ్ళనైనా తొలగించండి, లేకపోతే నేను ప్రాయోపవేశం చేయుటకు సమ్మతించండి' అన్నారు. ఇదంతా యెందుకు, తాను రాజీనామా చేస్తాను, రంగా నైనా మంత్రి పదవికి వొప్పించండి, లేకపోతే కంట్రోళ్ళ శైతులనుండి తొలగించుటకు అంగీకరించండి అని జవహరుపై వత్తిడి చేసిరి. అప్పుడు జవహరులాలుకు నాపై ఎంతో కష్టం కల్గింది. శైతులను కంట్రోళ్ళనుండి విముక్తి కల్గించు

టప్పుకై ఆయన అంగీకరించిరి. ఆ విధంగా బాపూజీ రైతులను రక్షించిరి. నన్ను బలపరచిరి. అంతులేని అధికారమును చేబట్టిన జవహారును అదుపులో వుంచగల్గిరి. అట్టిది వారి నైతికశక్తి. ఒకమారు ఆ వివాద సమయాలలో బ్రిటిషు రాజ్య పాలనకంటె, స్వరాజ్యపాలన మంచిదేనని నేను జెప్పజాలకున్నానంటిని.

బాపు: నీకుకూడా అలాగా అనిపిస్తున్నదా?

రంగా: అవునండి. బాపూజీ! సత్యాగ్రహం ప్రారంభించా లనిపిస్తుంది.

బాపు: ఐతే, నన్ను వదిలివేసి ప్రారంభిస్తావా?

రంగా: మీరు అభ్యంతరం పెట్టకుంటె చాలు.

తరువాత ప్రత్యేకంగా వారివద్దకు చర్చలకై వెళ్ళినప్పుడు జవహరులాలుగారు నాపై ఎన్నోనిర్బంధాలు చేస్తున్నారన్నారు. కంట్రోళ్ళను అమలుపరచని నాపై అన్ని కంట్రోళ్ళ అధికారంబొందిన జవహరులాలు కేమి అధిక్షేపణ లుండునన్నా.

బాపు; అఖిలభారత డీ కంట్రోలు దినం సాగిస్తున్నావుగా. అది వారి అధికారాన్ని యెదిరించడ మౌతుందట.

లక్షలాది రైతులు ఎన్నెన్నో ప్రదేశాలలో అదనపు సభలలో చేరిరి. కంట్రోళ్ళు తొలగించాలని, శాంతియుతంగా బహిరంగ నినాదములిస్తూ సభలు జరిపినారు.

బాపు:- అదే ఆయన బాధ. రైతులు హింసాత్మక చర్యలు చేస్తే, వారి పోలీసులు రైతులను అణచివేయగలరు,

రంగా:- రైతుల విజయానికి కారణం వారు అహింసా త్మకంగా ప్రచారం చేయడమే ! ఆ రైతులందరి నన్మక మేమంటే, మీరు నన్ను ఆశీర్వదిస్తూ వున్నారని !

బాపు :- ఇంతకంటె కష్టతరమైన, బాధ్యతాయుతమైన ప్రభుత్వ నిర్వహణలో పాల్గొనమని నిన్ను కోరితి గదా ! ప్రజలకు తిండిగింజలు అందించమన్నారు గదా ! నీ వెందులకు అంగీకరించడం లేదూ అని వారి బాధ.

రంగా:- కారణా లేవో వారికే తెలుసునే !

బాపు: జవహరులాలుకు నేను తెల్పినాను లే. మీ మంత్రుల వలె మీ వుద్యోగులు, శ్రకటరీల వత్తిడికి లోబడ కుండా, బైటనేవుండి ప్రజల సేవించాలనేదే రంగా కోర్కె అని చెప్పినా. ఐతే, అలాగా అంతటి దినోత్సవం సాగించడం ప్రభుత్వాన్ని బలహీన పరచుట గాదా అన్నారు జవహరులాలు.

రంగా: కంట్రోళ్ళపై తనకున్న నమ్మకాన్ని వదులుకొంటే చాలు. నేను సాగిస్తున్న "డీకంట్రోలు వుద్యమం" తన్ను, తన ప్రభుత్వాన్ని బలపరచును.

బాపు: ఐతే, ఆయనకు కంట్రోళ్ళపైగల పట్టుదలను, రైతు లపైగల నీ ప్రేమ, ఆదరణ అనే పట్టుదలను పోటీ పెట్టుతావా ?

రంగా: కాదండీ, అధికారంపై ఆయనకుగల ప్రేమ, రైతులపై పెత్తనం కావాలనుకునే పట్టుదలపైననే!

బాపు: మద్రాసుమంత్రులు నిన్ను అరెస్టు చేయాలను కోవడంలో ఆశ్చర్య మేమున్నదిలే!

రంగా: జైలులో నాకెక్కువ శాంతి కల్గునండి.

బాపు: రాజన్ బాబు సలహా పాటించరాదా?*

ఆ రాజెన్ బాబు సలహా యేమిటో నాకు తెలుసు. అందుకనే అన్నా.

రంగా: జవహరులాలుగారి పై అధికారంక్రింద తలవొగ్గుతూ మంత్రిగా వుండటం నాకు సాధ్యంకాదు. వారు సాగిస్తున్న కంట్రోళ్ళ విధానాన్ని బైటవుండి యెదిరించడం సులభం. లోపలజేరి, కంట్రోళ్ళతో చెలగాటం అసాధ్యం.

బాపు: రైతులతో యెలాగా వ్యవహరించడమో, వారివద్దవున్న ధాన్యపు నిల్వలను వాలంటీరుగా ప్రభుత్వానికి యిప్పించుకొట్లో రంగాకే తెలుసునని జవహరులాలుకు చెప్పినాను. లెవీకి మించిన ధాన్యాలకు బోనసులు యిస్పించమని ప్రకాశంకు సలహా చెప్పింది రంగా. ఆ విధంగా మద్రాసు బస్తీ ప్రజలకు తగిన ధాన్యాలు అందజేయగల్గిరి - కంట్రోళ్ళ కరకుకోరలతో పనిలేకుండా!

రంగా: సర్దారుకూడా యీ కంట్రోళ్ళు యీ విధంగా వుండరాదని.

---

* అంటె మంత్రి పదవివి అంగీకరించమని. సం॥

బాపు: అది నాకు తెలుసులే! రాజెన్ బాబుకు నీవే యీ మంత్రిత్వ బాధ్యత వహించుట మంచిదని, తనకు తెల్పిరని సర్దారు నాకు చెప్పినారు.

రంగా: మీ ప్రక్కనే వుండడం, డీకంట్రోలు పాలసీ జయప్రదమగునట్లుగా రాజన్ బాబుతో సహకరించడం నాకు హెచ్చు తృప్తి కల్గించును. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసును నడుపుకుంటూ, అ॥ భా॥ వర్కింగు కమిటీ బాధ్యతలను సాగించడం చాలదా?

బాపు: అధికారమంటె నీకు భ్రాంతి కలుగకుండుటె మంచిదిలే! నాకదే తృప్తి.

"ఎవ్వరైనా అన్ని సమయాలలో ప్రజల సేవించి, మంచిపనులే చేయాలన్న మానవుడు అధికారాన్ని చేబట్టగూడదు" అన్నదే, బాపుజీ బోధ. ఆబోధను జీర్ణించుకొని ఆ దశాబ్దాల పర్యంతం పదేపదే మంత్రి పదవులు తన్ను వెంటాడుతున్నా, వాటికొరకై మిగతా ఎందరోవలె, తాపత్రయ పడలేదు సరిగదా, చేతికందుచున్న పదవులను చేతిలో వుంచుకోలేదు మన రంగాజీ.

రాజేంద్ర ప్రసాదుగారు తాను అటు గాంధిజీ యిటు నెహ్రూజీ మధ్య కంట్రోళ్లను, రాజ్యాంగమును నడుపజాలను, రైతాంగ హృదయాన్నెరింగి, గాంధీజీకి తృప్తికరంగా వ్యవహరిస్తూ, నెహ్రూజీ దుందుడుకు ప్రధాన మంత్రిత్వ వొత్తిడి నెదుర్కొన గల్గినది రంగాజీయె కనుక, రంగాపై మంత్రిత్వభారమును నిల్పడం మంచిదని పదేపదే గాంధీజీ నెహ్రూ, సర్దారులతో ఆంతరంగికంగా చెప్పుచుండిరి. రంగాజీ ఆవత్తిడులకు లొంగకుండుట తుదకు బాపుజీకి ఆనందమే కల్గించినది. సం.

18. బాపూ అందించిన నైతికబలం

1947 నవంబరులో ఢిల్లీలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు కమిటీ తుది సమావేశంలో బాపూజీ కంట్రోళ్ళను వ్యతిరేకిస్తూ ఉపన్యసించిరి.

"ఈ రోజులలో ప్రచారమగుచున్న కర్రప్షన్, అవినీతికి ముఖ్యకారణం యీ కంట్రోళ్లే. త్వరితంగా యీ కంట్రోళ్ళను రద్దుచేయకపోతే అనతికాలంలో చాలా మనస్థాపం చెందుతారు. వీటివల్ల ప్రజలుకూడా సోమరులవుతారు. నిస్పృహ జెందుతారు.

ప్రజలలో కల్గిన మార్పులను గురించి తెలుసుకొనుటకు తగినట్లు మన మంత్రులు తలవొగ్గరాదా! ప్రజల సృజనాత్మశక్తిని వమ్ముచేయరాదు. ఆత్మవిశ్వాసం కల్గి, ప్రభుత్వంమీద అన్నిటికి ఆధారపడాలనే బలహీనత వారికి కలుగనివ్వరాదు. ప్రజాస్వామ్యం ప్రజల నిర్వీర్యపరచరాదు. మోసాన్ని, సత్యాన్ని మభ్యపరచడానికి దొంగ మార్కెట్లను పెంచుటకు, కృత్రిమంగా ధాన్యంలేదనిపించడానికి, తద్వారా ధరలు పెంచడానికి కంట్రోళ్ళు దారి తీస్తాయి. దశాబ్దాలుగా ప్రజలు పెంచుకుంటున్న స్వయం సహాయశక్తి, సృజనాత్మకబలం అంతా పోగొట్టుకుంటాం యీ కంట్రోళ్ళద్వారా! అన్నదమ్ములు పరస్పరంగా చంపుకుంటూ, పాకిస్తాన్‌నుండి ప్రజల నటు యిటు తరుముటవల్ల ఎంతనష్టం కల్గిందో అంతటి కష్టం యీ కంట్రోళ్ళవల్ల కల్గును. ఐతే, దేశ విభజన బాధలు

కల్పించును. కంట్రోళ్ళవల్ల కల్లు నష్టాలు సుళువుగా కన్పడవు, తెలియబడవు.

అన్నీ మాకే తెలుసు ననుకునే ప్రభుత్వ వుద్యోగులైన పండితుల మాటలు వింటూ, ప్రజా సందోహపు ఆర్తనాదాలను మంత్రులు వినజాలరా? ఆనాడు యీనాటి మంత్రులు అజ్ఞాతవాస మందున్నప్పుడు, అధికారాన్ని చెలాయించిన వారేగదా యీ పండితులు! ఇప్పుడూ తిరిగి వారేనా పెత్తనం చేయవలసినది? ప్రజల ఆర్తనాదాలను మన ప్రజలనుండి పైకొచ్చిన మంత్రులు వినరా?"*

---

* అంతటి నైతిక బలాన్ని ప్రజలకు బాపూజీ అందించిరి ఆ దినాల్లో. పం"

19. హిందూ-మహమ్మదీయులు
పరస్పర హింసాకాండ - దక్షిణాదిలో శాంతి

గంగానదీ ప్రాంతాల, మత పిశాచనమునకు లోబడి పోయి, వేలమంది జనాలు పరస్పరంగా మారణహోమ మందు నాశనమైరి. మరెందరో తమ తాతముత్తాతల యిళ్ళు, వ్యాళ్ళనుండి వెళ్ళగొట్టబడిరి. జనాలు వెర్రివాళ్ళై, లక్షలాది ప్రాణాలను, అన్నదమ్ములమనే భావం లేకుండా కత్తుల కెరజేసిరి. ఇదంతా దేశవిభజన జరుగుచుండుటవల్ల, పాకిస్థాను జన్మించుచుండుటవల్ల.

బాపుజీ కలకత్తాలో మహమ్మదీయుల రక్షించిరి. బీహారులోకూడా అటులే. తమ హిందువులను నౌకహాళీలో కలకత్తాలో పాకిస్థానులో క్రూరంగా చంపిరనే కక్షతో హిందువులు బీహారు ముస్లిములపై బడిరి. అచ్చట శాంతి స్థాపించి బాపుజీ ఢిల్లీకి వచ్చిరి. దక్షిణాది హిందువులు శాంతిప్రియులై, మహమ్మదీయులను రక్షించుకుంటున్నందు లకు బాపుజీ సంతోషం తెల్పిరి. ఇందులకు కారణ మేమని బాపుజీ నన్నడిగిరి.

దక్షిణాది ముస్లిములు ఉత్తరాదివారివలె హిందువు లపై దాడిచేయడంగాని, బెదిరించడంగాని, బలవంతంగా తమ మతంలోకి హిందువులను చేర్చుకోవడంగాని లేక పోవడం, అసలు వారి సంఖ్య చాల తక్కువై వుండడమని చెప్పితిని. ముస్లిములను జూచి హిందువులు భయపడడం కూడా లేదు.

బాపు: బీహారులో హిందూ - ముస్లిము సఖ్యత ఎంతోగా వుండేది. కాని అచ్చటకూడా జనాలు వెర్రెత్తి పోయారు.

రంగా: ముస్లిములీగువారి ప్రాపగాండా దక్షిణాదిన అంత ఉధృతంగా వుండదు.

బాపు: బీహారు, మధ్యప్రదేశ్‌లలో హిందువులు అత్యధిక సంఖ్యాకులే! ఐనా వారికింత కోపం, రక్తదాహం యెలాగో కల్గింది.

మత విద్వేషం, అసూయ ఆందోళన వృత్తాదిన ప్రబలంగా సాగుచున్నదంటిని.

బాపు: ఢిల్లీ పరిసరాల్లో ఎంతెంత దారుణ హత్యాకాండ సాగుచున్నదో కనుగొంటివా? మీ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుపై మత సంబంధమైన ఫిర్యాదులు లేవులే?

రంగా: ఢిల్లీ రాష్ట్రపు కొన్ని గ్రామాలు చూచి వచ్చినాను. కురుక్షేత్రం, ఇంద్రప్రస్థలోని శరణార్థుల క్యాంపులు చూచితిని. ఇదంతా చూడకుంటే సాధారణంగా శాంతిప్రియులైన మన జనాలు యింతటి, యిట్టి క్రూరమగు రక్తస్రావములో మునుగుదురని నమ్మలేకపోదును.

బెంగాలులో, కలకత్తా, నౌకహళీ హత్యాకాండల స్మశాన వాటికలలో సంచారం చేస్తున్నప్పుడు, ప్రేమావ

శాశ్వతమగు మహాత్ముని హృదయము మొంతగా బాధపడు
వుండెనో పూహించజాలకుంటిని.

కాప్టు: ఎంతోకాలంనుండి, మన హృదయాలలోనుండి, పర
స్పర ద్వేష, అసూయ, హత్యాకాండ ప్రియత్న
ములు తొలగించుకోకపోతే, యిట్టి దారుణ దార్శ
గ్యము కల్గునని హెచ్చరిస్తూనే వుంటినిగదా? కల
కత్తా, బీహారు ఎట్లో శాంతించుచున్నవి. కాని యీ
ఢిల్లీ నన్ను కలవరపరుస్తూ వున్నది. సర్దారుపటేలు
దీన్నొకదారికి తీసుకురాగలడా?

కంగా: ఆయనే కంట్రోలు చేయగలడు. ఆయ నిచ్చట
వుండడం కొంతగా ప్రజలకు స్థిమితం కల్గించు
చున్నది.

అంత నా తలను తన హస్తముతో నిమురుతూ ఆశీర్వ
దించిరి.

క్రమంగా, మహమ్మదీయులను తగినంతగా రక్షించలేదనే అప
వాదు, మౌలానా సర్దారుపై జవహరువద్ద లేపుచుండిరి. మహాత్ముని
రక్షణగురించి తగినట్లు శ్రద్ధ చేయలేదని, శ్రీ జయప్రకాష్ నారాయణ
సర్దారుపై నెపము వేసిరి. మహాత్ముని హత్యచేసిన గోడ్సే ప్రభృతులకు
ఆశ్రయం, కల్గించిన ఆర్. యస్. యస్.ను కొంతకాలం 'బాన్' చేసినా,
క్రమంగా, ప్రజలలో దానిపై క్రోధం తగ్గజొచ్చినది. అందులకు
కారణం, పాకిస్తాను పదేపదే మనదేశంపై దండెత్తుతూ వుండడం, బంగారా
దేశం స్వతంత్రం పొందినా పాకిస్తాను బలహీనపడ్డా అమెరికా చైనావారి
ప్రోత్సాహంతో, పాకిస్తాను భారతదేశంపై కాలుదువ్వుతూనే వున్నది,
అందువల్ల సర్వమత సామరస్యం దూరమగుచునే యున్నది. (సం.)

29. కాంగ్రెసు వర్కింగు కమిటీలో మహాత్ముని పాత్ర

వర్కింగు కమిటీలో, గాంధీజీపాత్ర ఎంత అద్భుతంగా వుందో గమనించి ఆశ్చర్యము పొందితిని.

జరుగుచున్న చర్చలను, నైఖరులను గమనిస్తూనే వుండేవారు. ఏదో ఒక సమయంలో ప్రతి ఒక్కరివంక చూస్తూ వుండేవారు - ఒక్క పలుకైనా పలకకుండానే! మేము చేస్తూవుండే చర్చలను గమనిస్తూవున్నా, తానేమి ఆందోళన చెందకుండా, తన ముందున్న కార్యాచరణ యందు శ్రద్ధగానే వుండేవారు. అప్పుడప్పుడు మాత్రం చల్లగా తన నయనాలను యిటు త్రిప్పి, మాట్లాడుచున్న వారెవ్వరినో చూచేవారు. తన దయార్ద్రదృష్టిని వారిపై ప్రసరింపనిల్చేవారు. అంతే. మిగతా క్షణాలలో మేము చ్చట లేనట్లే తన కార్యాచరణ సాగించుకొనేవారు. ఐనా, జరుగుచున్నదేదీ వారికి తెలియకుండా వుండదు. వారి సెక్రటరీలు వారిముందు వుంచిన కాగితాలో, ప్రెస్సులోని చీటీలో చూచుకుంటూ వుండేవారు. మరొకప్పుడు ఉర్దూ లేక తమిళం లేక బెంగాలీభాష నేర్చుకుంటూ వుండేవారు. అప్పుడప్పుడు పుస్తకాలు ప్రాసేవారు. ముఖ్యమైన వుత్తరాలో, రిపోర్టులలో చూస్తూ వుండేవారు. ఒకప్పుడు క్రొత్తగా చేరిన పుస్తకాన్ని శ్రద్ధగా చదువుకొంటూవుంటే చూచితిని.

ప్రార్థనకు ముందు, సాయంతనము అందుతూనే వారి భోజనం అందింపబడేది. వారు తింటూవుంటే, చూడగల్గి

ఎంతో అదృష్టం. రుచ్యములు గుర్తించినట్లు తినేవారు. ఎప్పుడప్పుడు ఆయనకుకూడా ఆ భోజనం అవసరమా అనుకొనేవాడిని. ఆయ నసలు మనిషిమాత్రుడు కారేమో అనిపించేది. ఐతే ఆయన మరెవ్వరు? ఆ భోజనం వారికి తృప్తికల్గించాలంటూ ప్రార్థనా ధోరణిలో వుండేవాడను. ఆయ నసలు ఆ భోజనాన్ని జీవించుటకేనా లేక బలం పొందుటకేనా లేక తృప్తిగా అనుభవించుటకా? ఎంత అందంగా వుండేది వారట్లా భుజించడం! పరిశుభ్రతనాన్ని, తృప్తిగా, అందంగా తినడమనాన్ని బహుశ్రద్ధ! తన వణుకు చున్న హస్తములతో ఆ మట్టిపళ్ళెమును అందుకొని, అందలి వేపుడు మేక పాలో లేక సూపో (గంజియో) గరిటెతో తాగేవారు. గట్టిగా పట్టుకొనేవారు. నెమ్మదిగానే తొందరపడకుండా! అదొక సౌభాగ్యమగు మర్యాద. సుఖవంతమగు ఉత్సవం.

II

ఎవ్వరో సభ్యుడు ఆవేశమో, ఆవేదనో పొంది మాట్లాడుచున్నారని, శబ్ద స్వభావము ననుసరించి తెలుసు కొనేవారు. ఆయనవంక చూచుటకు అంతలో కన్నెత్తే వారు. ఆదృక్కుతోటే ఆయనకు ప్రోత్సాహమో, బలమో అందించేవారు. ఒకప్పు డొక్కొక్క మాటను తోడుచేసి, ఆయన్ను ప్రోత్సహించేవారు. అలాంటి ప్రోత్సా హము, మాటలతోడుబొందు భాగ్యము నాకప్పుడప్పుడు అందించేవారు. అంతకంటె నెమ్మదిగా, ప్రేమగా, బలం కలుగునట్లుగా, కొంగ్రొత్త పరిషత్తంగు కమిటీ సభ్యునికి వారు

తోడగుచుండేవారే! ఆదంతా, తల్లిప్రేమకంటె హెచ్చుగా వుండేదేగదా! ఎప్పుడెప్పుడైతే జవహరునిగాని, సర్దారు పటేలునిగాని యొప్పించలేకున్నానే అనిపించినప్పుడు ఆయన కల్పించుకొని, 'రంగా ఆలోచన యిలా, అలా వున్నది. గమనించరాదా' అన్నట్లు పల్కేవారు. అంతట నా కెంతో బలం కల్గేది. అట్లే, ప్రఫుల్లచంద్రఘోష్‌ను, ఆచార్య కృపలానిగారిని బలపరచేవారు. ఆయన్ను నాకు బలమిచ్చినట్లు చేసుకొనుట కొక 'టాలిస్మాను' లేక తంత్రముండేది. నేను తగినట్లుగా నా ధోరణిని బలపరచలేకున్నప్పుడో లేక నా ఆలోచనలే ధర్మ ధోరణిలో నున్నవి; వాటికి వారు బలం యిచ్చి తీరాలి అనిపిస్తున్నప్పుడో, ఆ జవహరుతో చర్చించు సమయాలలో బాపూజీని హెచ్చరించుటకు ధైర్యముచేసి, 'మీరేదైనా చెప్పరా?' అనేవాడిని. భక్తరామదాసులాగా "పలుకే బంగారమాయెనా" అన్నట్లుగాక, నాకు తోడయ్యేవారు. మేము కోరినా లేక తనకే చర్చలలో పాల్గొనాలనిపించినా, అలా వొంగివుండి తనలోతానే నిమగ్నుడై వుంటున్న బాపూజీ, అట్టే నిటూరుగా నడుము నెత్తుకొనేవారు.

ఆ దిండ్లు, చరఖా, కాగితాలు అటు సర్దేవారు. గుడ్డలు సవరించుకొంటూ, వుత్తరీయాన్ని సరిగా వేసుకొనేవారు. మా అందరివంక కొన్ని క్షణాలు అట్లే చూచేవారు. మా కమిటీవారమంతా వారివంక తిరిగి, "అటెన్షన్" అన్నట్లు వుండేవారము.

మా చెవులు వారివంకనే, మెడలు ఎత్తుగా త్రిప్పుకొంటూ, నయనాలు వారిపైననే వుంచి ఆయ నొక దేవుడన్నట్లు చూచేవారం.

మామా ఆలోచనలు కఠినంగా వుండవచ్చు. ఒక్కొక్కరి ధోరణిపై బాధాకరమైన కోపంపు తలంపులో, ద్వేషములో వుండవచ్చు. ఆశాంతి మా హృదయాలలో ఏ నాయకుని ఆలోచనలపై రేగివుండినవేమో! అదంతా మారిపోయేది. వారు మమ్ముజూచేసరికి, సహృదయులంగా మందహాసములతో వారిని మాచర్చల మధ్యకు చేర్చుకొనేవారం!

ఐతే, ఎప్పుడైనా మాకు యథార్థమని తోచిన ఆలోచనలు, ధోరణులను వారికొరకై ధారవోసే వారమా? అలాచేము, మనసులేనివారముగా వుండవలెనని వారు కోరిరా? లేదే! డెమోక్రాటికుగా మా హక్కుల ప్రకారం, మా స్వంత స్వతంత్ర ఆలోచనల ప్రచురించుటకు, పెంచుకొనుటకు ప్రోత్సహించేవారు. తీర్మానాల రచించుటలో రిపోర్టులకు రూపు రేఖలు కల్గించుటలో యెంతో శ్రద్ధ చేసేవారు. ఐనా, మా కమిటీలో వాటిని యెంతెంతగానో సవరించుటకు స్వతంత్రము యిచ్చేవారు. తన ఆలోచనలను శ్రద్ధగా పరీక్షించమనేవారు, ఆ పిమ్మట రాజాజీనో, జవహరునో, వల్లభపంత్ జీనో, అందరి ఆలోచనలు సమన్యాయ పరుస్తూ తన వైఖరికి సరిపెట్టుతూ తిరిగి వ్రాయమనేవారు. జవహరుతో వీలైనంతరకు సర్దుబాటు చేస్తూ వుండేవారు. మాలానా అజాదంకు గొప్ప గౌరవము

మాలాంటి క్రొత్త సభ్యులంటే యెంతో ప్రేమ. మా ఆలోచనలగురించి వారే అంత ఆదరణ జూపుచున్నప్పుడు మేమంతా వారి ధోరణి యెడల గౌరవము, భక్తి చూపుచుండుటలో ఆశ్చర్య మేముంటుంది?

వారు మా మధ్యవున్నప్పుడు మేమెంతగా ప్రభాని తులమై వుండేవారమో, వారు ప్రార్థనలకు వెళ్ళిన తరువాత. మేము వొకరి నొకరితో సుళువుగా మాటలాడు కొనడం, ఆలోచనలను చురుకుగా ప్రకటించుకోవడం, కవ్వించుకోవడం, మా పల్కులల ధ్వనిని పెంచుకోవడం, వగైరా మా చర్యల ధోరణి సాధారణ ప్రపంచ వాతా వరణాన్ని అందుకొంటున్నప్పుడు గుర్తుకు వస్తూవుండేది.

శ్రీ అజాదు తప్ప మరెవ్వరు మహాత్ముని వద్ద అంత స్వతంత్రించి వ్యవహరించేవారు కాదు. జవహరు సిగరెట్లు సంగతే పురచేవారు. సర్దారు తన దృక్కులలో వుక్కును చూపేవారేగాదు. క్రిష్ణుని తన మాటల చెణుకులను చెలరేగ నిచ్చేవారా? అందరూ భక్తితో, శక్తితో, దేశభక్తితో రక్తిగా వుండేవారు. వారితో అందరం అంత సన్నిహితంగా వుండేవారం. ఆయనతోనే అంతంత సేపు వుండేవారం. చర్చించుకుంటూ వుండగా ఆయనొక తండ్రో, అన్నయ్యో అనిపించేది. ఐనా, ప్రతి వొక్కరం వారితో కొన్ని క్షణాలు, నిమిషాలు ప్రత్యేకంగా మాట్లాడుకొనే భాగ్యం కొరకై ఆరాటపడేవారం. ఆయననుండి యేవో కొన్ని మాటలు, చిఱునవ్వులు, తల పంకింపులు మాత్రం మాలో

ప్రతివొక్కరికి, పెద్దలనుండి పిన్నలవరకు అందితే చాలు తనుకొనేవారం.

వారి దగ్గిరవున్నప్పుడు, 'అమ్మాయ్యా! ఎంత సన్ని హితంగా హృదయానికి హత్తుకున్నా రనిపించుతుండేది. తాయన మనవారే అనుకునేవారం. పోతే, ఆయన ముందు మనమెంత చిన్నవారం; వారి నైతిక స్థాయె ఆ యెత్తున వున్నదె' అనిపిస్తూనే వుండేది. అంతటి మహత్తరమైన హిమగిరి శిఖరాల వంక త్రిప్పుతూ ఎత్తుకు అందరిని లేపుతూ, మన జాతీయోద్యమాన్ని పెంచిరి ఆ మహాత్ములు.

చివరి వారాల్లో దేశాన్ని విభజించునప్పుడు, జవహరు, సర్దారు, రాజేంద్రబాబు, రాజాజీ మంత్రులై మొంటుబాటను ప్రభావములో జిన్నా వ్యతిరేకతను యెదిరించలేక, ఆ మహాత్ముని బోధల, బాధల, భావముల కాచనగల్గిరే? అధికారమనే వ్యసనం, గాంధీజీపై గల భక్తిని జయించింది గదా!

సం.

21. పదవి ఎవ్వరిది?
ప్రధాన మంత్రియా? కాంగ్రెసు ప్రెసిడెంటా?

1947 నవంబరు 27 తేదీన కొందరు కిసాను నాయకులు బాపుజీని కలుసుకొనిరి. నా గురించి వారు కుశలప్రశ్నలు వేసిరి. అప్పుడు వారిని దర్శించుట మంచిదనుకొన్నాను. అది ప్రాతఃకాలం. బిర్లా భవనంలో హిందూమత కలహములు చేలరేగుచున్నవి. వాటి నెదుర్కొనుట యెలాగా అనే ఆలోచనలో సర్దారు, జవహరులాల్ మధ్య తీవ్ర వివాదము జరుగు చుండెను. అది బాపూజీకి చాలా మనస్తాపం కల్గించుచున్నది. వర్కింగు కమిటీలో ఎవ్వరు ముఖ్యులు? ప్రధానమంత్రియా, కాంగ్రెసు ప్రెసిడెంటా? అనే వివాదము తీవ్రంగా జరుగుచున్నది. అందులో నేను పాల్గొను చుంటిని-కాంగ్రెసు ప్రెసిడెంటును బలపరుస్తూ! కనుక పదే పదే బాపూజీని కలవరపెట్టడం యిష్టంలేదు. ఐనా వారే హెచ్చరిస్తే వారి వద్దకు వెళ్ళవలసి వచ్చినది. కాబినెట్టు ప్రధానమైన వ్యవహారముల గురించి చర్చించి, తీర్మానించుటకు ముందుగా ప్రెసిడెంటును ప్రధాన మంత్రి సంప్రదించుట యోగ్యమని నేను వర్కింగు కమిటీలో వాదించుచుంటిని. అది జవహరులాల్‌కు అయిష్టం కలించెను. సర్దారు మౌనంగా వుంటూ, జవహరులాల్‌నే బలపరచిరి. కాబినెట్టు సభ్యులు తమ చర్చలను రహస్యంగా నుంచెదమని ప్రమాణం చేసిరిగనుక, వారి చర్చలలో ప్రెసిడెంటు పాల్గొనునట్లు చేయుటగాని ఆ విషయములు ప్రెసిడెంటుతో

చెప్పటగాని సభ్యత గాదనిరి శ్రీ జవహరులాల్. ఐతే 1936-39లో, వివిధ రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గాలు నడిపినప్పుడు, గవర్నరు ఆనాటి కాబినెట్టుకు అధ్యక్షులై వున్నా, అంతకు ముందే మంత్రులు, కాంగ్రెసు పెద్దలు కలిసి చర్చలు చేసుకొని, తీర్మానాలకు రూపు కల్పించుకొని పిమ్మట గవర్నరు అధ్యక్షతకిందన, కాబినెట్టు సభ లాంఛన ప్రాయంగా జరుపుకొనిరిగదా? అటులె పెసిడెంటు క్రిప్లానీతో కలిసి చర్చలు చేసుకొని, తరువాత కాబినెట్టుగా సమావేశము ఎందుకు జరుపుకోరాదని మేము కొందరం వాదించితిమి. అట్లు చేసుకోవచ్చునని జవహర్‌లాల్ గారు అన్నారు. గాంధీజీ అంగీకరించిరి. కాని ఆ సలహాను పాటించుట జరుగలేదు.*

అట్టి చర్చలు, ఆలోచనల సమయం అది.

బాపు: నిన్ను అందరు అంగీకరించినందులకు సంతోషం.

ఏ ఎవ్వరంగీకరిస్తున్నారు? అంటె, వర్కింగు కమిటీలో పరిముఖపాత్ర సాగించబూనిన నన్ను అంగీకరిస్తున్నారు గదా అనుకొన్నా, పోతే, సర్దారా, లేక, జవహరా? సర్దారు ఆనందపడుచున్నారని నాకు తెలుస్తూన్నది.

---

* కొన్నాళ్లకు క్రిప్లానీ, తరువాత కాబినెట్టు సభ్యులైన రాజేంద్రబాబుకు ఆ తీర్మానపు బలం అవసరం లేదాయె. ఆయన తరువాత అధ్యక్షుల్లుగా వచ్చినవారికి మేము జవహరులాలుగారిచేత అంగీకరింపచేసిన్నట్లు వ్యవహరం సాగించు శక్తి లేకపోయెను. సం.

బాపు: జవహర్‌లాల్‌గూడ అంగీకరిస్తున్నారులే! ఆర్థిక ప్రణాళికా సంఘమునందు నీవుసభ్యుడుగా వుండాలని ప్రతిపాదించినది జవహర్‌లాలేగదా! కాంగ్రెసు ఆశయాలను నిర్వచించు కమిటీలోకూడా నిన్ను కోరినది ఆయనే.

రంగా: ఈ కమిటీలు సర్దారునకు యిష్టమేనా?

బాపు: సర్దారునకు యీ కమిటీలు అభ్యంతరం కాదులే! వీటికిది సమయం కాదనిమాత్రం ఆయన ఆలోచన. మనకు యీ కంటోర్లిళ్ళు పోవాలని వుందిగదా? శ్రీతులకు రక్షణ కావాలని నీకోరిక. పారిశ్రామికులను కంటోర్లులుచేసి, సోషలిస్టులను ప్రోత్సాహపరచాలని జవహరు ఆతురత. కనుక, శ్రీతులను బలపరుస్తూ జవహర్‌నకు నీవు బలం కల్గించవచ్చునులే!

II

'జవహర్‌లాల్ కార్యదర్శిగా, శ్రీతునాయకు లొకరు అధ్యక్షులుగా వుంటే ఎంతో బాగుంటుంది ఆదర్శ పరిస్థితులలో' అని ప్రార్థన సమయంలో బాపుజీ అనిరి. జవహరులాల్, సర్దారుల మధ్య చెలరేగుచున్న విభేదాల సందర్భములో బాపుజీ అలాగా అనడంవల్ల మనస్పర్థలు హెచ్చగునేమో అంటిని. జవహరుయొక్క ఆధిపత్యాన్ని బలపరచుటనాకిష్టము లేదని చెప్పితి.

బాపు: వర్కింగుకమిటీ తన అధికారాన్ని కొంచపరుస్తుందేమో నన్న భయం జవహరునకు కలదు.

రంగ: సర్దారు, తాను, ఆపైన ముఖ్యులగు కాబినెట్టు మంత్రులు వర్కింగు కమిటీలో సభ్యులై యున్న ప్పుడు, కమిటీ తమ మంత్రిత్వ పెత్తనాన్ని తగ్గిస్తా రేమో అనేభయం ఆయనపేల, పొందాలి.

బాపు: ఈమధ్య కాంగ్రెసు ప్రెసిడెంటు క్రిప్లాని ప్రాసిన ఉత్తరాలవల్ల ఆయనకు ఆలాంటి సందేహం కల్గు చున్నది. ఏమైనా ఈ వివిధ పరిముఖ కమిటీలలో నీవు సభ్యులుగా వుండుట ఆయనకు తృప్తిగా వున్న దిలే! ఆయనతో కలిసి సహకరించుటను నీవు నేర్చు కొందువని నేను ఆశిస్తున్నాను.

బాపుజీ యేమిచేయమంటే ఆలాగా వ్యవహరించెద నన్నా. ఐతే వొక్కసంగతి. ఆనాటికి కాంగ్రెసు ప్రసిడెం టుగా వున్నందువల్లగదా. జవహర్‌లాల్ పరిధానమంత్రి కాగల్గినారు. కనుక, కాంగ్రెసు పెరిసిడెంటు పదవిని, వర్కింగు కమిటీని తగ్గించి, వాటి ద్వారా యేర్పడ్డ కాబి నెట్టును పైకి పెంచడం బాగుండునా!

బాపు: కాంగ్రెసు ప్రెసిడెంటుగా మాత్రమేగాక, మరెన్నో అర్హతలు జవహర్‌కు కలవుగదా?

III

పార్టీనాయకులు - కాబినెట్టు మధ్యబయలుదేరుచున్న సమస్యలను గురించి గాంధిజీ శ్రద్ధ చేయలేకుండినారు. అందువల్ల, క్రిప్లాని తదితరులు పాకీస్థాను తరిమివేయగా వచ్చిన శరణార్థుల రక్షణకై ఆరాటపడుచూ కాబినెట్టు

అశ్రద్ధ గురించి మనోవేదన పడుచుండిరి. ఆపైన జవహర్ లాల్ - గాంధీజీ మధ్య ఎన్నోవిభేదాలు చెలరేగుచున్నవి.[1] సర్దారు - బాపూజీ మధ్య[2]; సర్దార్ - జవహరులాల్ మధ్య[3]. కాబినెట్టుపై మహాత్మునికి వుండవలసిన ప్రభావం తగ్గుచుండెను. వర్కింగు కమిటీకి కాబినెట్టుపై వుండదగు పై పై పత్తనాన్ని జవహరు, సర్దారు కలిసి తగ్గించ ప్రయత్నించుచుండుటకూడ బాపూజీ ప్రభావాన్ని పలచబరుస్తూ వుండెను.[4]

---

1 పాకిస్థాను గురించి, శరణార్థులు, కంట్రోళ్ళ గురించి.

2 హిందూ - ముస్లిముల వివాదము.

3 హిందూ - ముస్లిముల కొట్లాటలు, రక్తపాతాలు, కాశ్మీరు, హైదరాబాదు.

4 ఆహార ధాన్యాలపైన కంట్రోళ్లు తొలగించమంటూ పదే పదే బాపూజీ ప్రాయడం, ప్రార్థనోపన్యాసాలు చేయడం, రంగాజీ అఖిలభారత కంట్రోళ్ళ నిరసనదినం జరిపించడం, మంత్రులు రంగాజీని అరెస్టు చేయాలనుకోవడం, తుదకు, కంట్రోళ్ళను తొలగించకపోతే తాను ప్రాయోపవేశం చేయవలసి వస్తుందని బాపూజీ ప్రకటించవలసిరావడం, అప్పుడు మాత్రం ఆయన శిష్యులు రాజేంద్రబాబు, ఫుడ్ మంత్రిగా, కంట్రోళ్లు తొలగించుటకు పూనుకోవడం, అంటే, ఎంతగా బాపూజీ బలం తగ్గిపోయిందో, కాబినెట్టు పై కెక్కిపోయ్యిందో గదా. సం.

ఇట్టి వెనో్న సంఘటనలు బాపూజీకి విసుగు కల్గిం చెను. కనుకనే కాంగ్రెసు సోషలిస్టులు వేరే పార్టీ పెట్టు కొంటామంటె, బాపూజీ సరేనన్నారు. ఇతరులుకూడా, వారి వారి ధోరణుల ననుసరించి కాంగ్రెసేతర పార్టీలు పెట్టుకోవచ్చు అనుకున్నారు.

ఆ పిమ్మట జరిగిన మరెనో్న సంఘటనల దృష్ట్యా, ఆనాడు అలాగా జవహర్‌లాల్‌గారి ఎదురులేని రాజ్యాధి కార ధోరణికి నా అసమ్మతిని బాపూజీకి తెల్పుట మంచిదే ననుపిస్తున్నది. ఎందరో రాటుదేలిన గాంధేయులు, ప్రసిద్ధులైన నాయకులను, తన సన్నిహిత సర్కిలు్సలోనికి తీసుకోకుండా వారి సలహాలను పాటించకుండా వుండుట జవహర్‌నకు సాధారణ అలవాటు ఐపోతూ వుండినది. అప్పటి వరకు, వర్కింగు కమిటీ సభ్యత్వము జాతీయ రాజ కీయ జీవిత స్థాయిలో అత్యున్నతమైన స్థానము గదా! సేవ చేయుటకు చేయించుటకు అగ్రస్థాయిలోనున్న అవకా శము. కాబినెట్టు నిర్మాణ సమయం వచ్చినప్పుడు, వర్కింగు కమిటీ సమ్మతిపైననేగదా, కొందరు కాబినెట్టులో చేర గల్గినది. గాంధీజీకి అత్యంత సన్నిహితులైన వారిలో, కొందరు కాబినెట్టులో చేరుటవల్ల, తాము చేయగల ప్రజా సేవ, జాతీయ రక్షణ, కాంగ్రెసు ఆశయాలకు ఆచరణలో కార్యరూపము కల్గించు బాధ్యత తగ్గిపోవుననే భయముతో బాపుజీ అనుమతి పైననే, కాబినెట్టులో చేరరైరిగదా?

ఐతే, ఆ గాంధేయుల ధోరణితో జవహర్ అంగీకరించలేదు. క్రిప్లాని ప్రెసిడెంటుగా వెనుకటి ధోరణిలో వ్యవహరించుటకు వీలులేకుండా చేసిరి. తరువాత, పురుషోత్తమదాసు టాండన్ కాంగ్రెసుయొక్క ప్రాథాన్యతకై పోరాడితే ఆయన్ను బైటికి రాజీనామా చేయునట్లు వత్తిడి తెచ్చిరి. తుదకు తానే కాంగ్రెసు ప్రెసిడెంటు పదవిని కూడా నెత్తిపై పెట్టుకొనిరి. తరువాత తన కుమార్తె (యిందిరా గాంధి)ను, కాంగ్రెసు ప్రెసిడెంటుగా నిల్పి, కాబినెట్టుయొక్క పైపెత్తనానికి యెదురులేకుండా చేసుకోగల్గిరి.

ఇటు బాపుజీకాని, అటు సర్దారుకాని, రెండు సంస్థలు, వాటి పరస్పర బాధ్యతలు, అధికారాల గురించి యేస్కూత్రాలు సూచించు వ్యవధికాని, శారీరక, మానసిక శక్తిగాని పొందలేక పోయిరి.

'కాంగ్రెసును రాజకీయపార్టీగా యిక సాగించవద్దు, కాంగ్రెసులో యింతవరకు వున్నవారు, వారివారి కిష్టమగు రాచకీయ పార్టీలను పెట్టుకోవడం మంచిది' అన్న తన చివరి సందేశం (మరణ శాసనమా?) యిచ్చిపోవుటకు కారణం ఇలాగా కాబినెట్టు ప్రధాన పెత్తనం వారికి రుచించక పోవడమే కావచ్చు.

జవహర్‌లాల్ గారు కాబినెట్టులోకి రమ్మని మమ్మల్ని కొందరిని (నన్ను, డా॥ కుమారప్ప ప్రభృతులను) ఆహ్వా

నించినప్పుడు, 'అలాగా చేరండి' అని బాపూజీ సలహా ఇవ్వడానికి కూడా కారణం - జవహర్ కాబినెట్టు అధికారాన్ని ఆపలేము కనుక అందులో చేరే నిర్మాణ కార్యక్రమాలసాగించుకోవడం మంచిదనే వారిభావం కాబోలు.

రాజేంద్రబాబు రాజీనామా చేసినపుడు, తిరిగి జైరాందాను దౌలత్ రామ్ తొలగినప్పుడు రంగాజీని ఫుడ్, అగ్రికల్చరల్ మంత్రిగాచేరి, రైతులకు, బస్తీలవారికి ఉభయత్రారక్షణగా, ఆహార ధాన్యాల సరఫరా యేర్పరచు బాధ్యత శిరసావహించవలెనని జవహర్‌లాల్ కోరిరి. అవసరమొచ్చినప్పుడు, బస్తీవారికే ప్రాధాన్యత యిస్తూ, రైతాంగముపై శీతకన్ను కల్గుఛోరణియే జవహరునకున్నదనే భయంతో రంగాజీ అందుకు అంగీకరించలేదు. 1958-59లో మరోమారు రంగాజీని కాబినెట్టులోకి రమ్మని జవహరుపట్టుపట్టిరి. ఐతే సహకార వ్యవసాయాన్ని అమలు పరచుటకు రంగాజీ నిరాకరించిరి.

కాంగ్రెసు అధ్యక్ష పదవికి పైపెత్తనం తిరిగి సంపాదించాలని కామరాజు నాడారు ప్రయత్నించిరి. అపజయమందిరి. తుదకిప్పటికి, ప్రధానమంత్రికి తోడుగా లోబడి సహకరించుటే కాంగ్రెసు ప్రెసిడెంటు ధర్మమనే ఆచారం స్థిరమైనది. ప్రెసిడెంటుగావున్న వారెట్లయినా కాబినెట్టులోకి ఎక్కాలనే తాపత్రయములోనే వుంటున్నారు. ఇందిరాగాంధి నాయకత్వము బలపరచుటె కాంగ్రెసు ప్రెసిడెంటు ప్రధాన బాధ్యత.

* * *

ఆర్థిక ప్రోగ్రాము కమిటీలో రంగాజీ వుండాలన్నారు జవహరులాల్జీ. అందుకెంతో తృప్తిజెందిరి బాపూజీ. ఆ కమిటీ మూడు సబ్‌కమిటీల నేర్పరచింది; అందు, వ్యవసాయం-వ్యవసాయకుల సబ్‌కమిటీ, గ్రామీణ పరి

శ్రమలు - చేతివృత్తులవారి సబ్‌కమిటీలో రంగాజీని సభ్యులుగా ఆహ్వానిస్తూ, వ్యవసాయపు సబ్‌కమిటీకి కన్వీనరుగా నియమించిరి జవహరులాల్‌గారె! ఆ సబ్‌కమిటీల రిపోర్టులను అంగీకరించిరి. వారి సిఫారసులకు వ్యతిరేకంగా ప్లానింగు కమీషనువారు ప్లాను తయారుచేస్తే, విమర్శించిరి రంగాజీ.

ఈనాటికి (1977) కాంగ్రెసు ప్రెసిడెంటు పదవి ప్రధానమంత్రి భోరణి, దృష్టి, తీర్మానముపై ఆధారపడే స్థితిలోనే వున్నది. ప్రెసిడెంటైన శ్రీ బారువా, గౌహతి ఎ.ఐ. సి.సీ లో చెప్పుకున్నట్లు, అసలైన జాతీయ నాయకులు శ్రీమతి ఇందిరాగాంధి, తానొక ప్రెసిడెంటు మాత్రమేగదా! వర్కింగు కమిటీకింక యేమాత్రం ప్రాధాన్యత వుంటుందన్న సంగతి విచారించాలి. సెంట్రలు కాబినెట్సు సభ్యులైన మంత్రులకు మాత్రం ప్రధానమంత్రి దృష్టిలో తమ వుద్యోగ మెంతవరకో తెలియకుండ స్థితి మంచిదా? ఆ 1947 నుండి యీ 1977కు వచ్చిన మార్పు యింతేనా?

పం.

22. వయోజన ఓటింగు హక్కుకు బాపూ సమ్మతి

1925లో జాతి సామరస్యంకోసం గావించిన సుదీర్ఘ ఉపవాసాన్ని బాపూజీ త్యజించిన వెంటనే నేను వారిని కలుసుకొన్నాను. మహమ్మద్ ఆలీ ఇంటి ఆవరణలో ఆసమావేశం జరిగింది.

అది చలికాలం ఉదయం. ఆ డాబామీద సంధ్యారుణ కాంతులలో వారిని నేను కలుసుకొన్నాను. విప్లవ భారత నాయకులైన ఆ మహాత్ములని నేను కలుసుకోవడం అదే మొదటిసారి. వారిని నేను 1917 నుండి గౌరవిస్తూనే వున్నాను. నేను వారిని కలుసుకొన గోరుతున్నానని లండన్ నుండి కార్లహాకు వారికి వ్రాశారు. మహమ్మదాలీ నిర్వహిస్తున్న గ్రామీణ 'కామ్రేడ్' పత్రిక ద్వారా వారు నన్ను అప్పటికే కొద్దిగా ఎరుగుదురు. ఆ పత్రికే తరువాత 'హిందూస్థాన్ టైమ్స్'గా మారింది. అస్పృశ్యతను నివారించడానికి వెనుకబడిన తరగతుల నిస్సహాయతను పోగొట్టడానికి ఒక రాజకీయ సాధనంగా నేనప్పటికే వయోజన ఓటింగును అంగీకరించ వలసినదిగా ప్రచారం గావిస్తూ వున్నాను. ఆక్స్‌ఫర్డ్‌లో ఐదేండ్లు చదువుకొని భారతదేశానికి తిరిగి వచ్చినప్పుడు వారిని కలుసుకొనడంవల్ల నాకు ఎలాంటి అపూర్వ అనుభవంకలిగిందో దానిని గూర్చి నా స్వీయచరిత్రలో* ఇదివరకే వ్రాసివున్నాను. అప్పటి నుండీ వారు నాకు ధ్రువతారలాగా వుంటున్నారు.

---

* ఫైట్ ఫర్ ఫ్రీడమ్ (స్వాతంత్ర్యం కోసం సమరం) అనే ఆంగ్ల గ్రంథమే రంగాజీ స్వీయచరిత్ర.

ఆక్సఫర్డునుండి తిరిగి వచ్చినప్పుడు ఆసీబీసెంటు వయోజన ఓటింగుకు వ్యతిరేకంగా వుండడం, ఆమె రచించిన 'భారత్ కామన్ వెల్తు రాజ్యాంగ శాసనం'లో ఆస్తిగల వారికి, చదువుగలవారికి మాత్రమే ఓటింగుహక్కు- ఉండాలనడం నాకు చాల ఆశాభంగాన్ని కలిగించింది. 'వయోజన ఓటింగు' అనే ఆయుధాన్నిపూని పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల ప్రజలు పొందిన లాభాలను నేను గ్రహించాను. అందువల్ల నేను రామేశ్వరంనుండి హుటాహుటిగా ఢిల్లీకి వెళ్ళాను. ఆ సమయంలో ఆమె, గాంధీజీ, అలీ సోదరులు, మోతీలాల్ నెహ్రూ, లాలా లజపతిరాయ్ మొదలైన వారందరూ అక్కడే వున్నారు. అందువల్ల వారిని కలుసుకొని పీడిత పరిజోద్ధరణకై వయోజన ఓటింగు హక్కును అంగీకరించవలసినదిగా వారిని కోరడానికి నేనచ్చటికి వెళ్ళాను.

బీసెంటుగారితో నేను జరిపిన చర్చలు చాల ఆశాభంగాన్నేకలిగించినవి. చదువు సంధ్యలు లేని, సాంఘికంగా వెనుకబడి, అణచివేయబడిన భారత గ్రామీణప్రజలు తమ ఓటును సక్రమంగా బాధ్యతతో ఎలా వినియోగించగలరని ఆమె నన్ను ప్రశ్నించింది. అంతకంటె నీచమైన పరిస్థితిలో వున్న మన స్త్రీలు - పురుషులకంటె చాల కాలం ఓటింగు హక్కుకొరకు వేచివుండవలసి వస్తుందని ఆమె అభిప్రాయపడింది. మొట్టమొదట అవిద్యనుండి, అస్పృశ్యతనుండి, 'మన కర్మ ఇంతే'నన్న దృక్పథం నుండి వారికి విముక్తి నీయాలని ఆమె అన్నది. స్త్రీలను పరదా

మరుగునుండి వెలికితీయాలన్నది. ఈ పరదా పద్ధతి దక్షిణాపథంలో లేదు.

"చీకటి దయ్యాలలాగా పరదాలు వేసుకుని తిరుగుతున్న స్త్రీలను ఢిల్లీలో మనం చూడలేదా?" అని ఆమె నన్ను ప్రశ్నించింది. ఆమె అందమైన దుస్తులలో రజిత కాంతల నీనుతున్న శిరోజాలతో ఎంతో హుందాగా కనబడుతున్నది. ఆమె మన స్వాతంత్ర్యంకోసం ఎలా పోరాడిందో నాకు తెలుసు. అందువల్ల నేను నమ్రతతో "వారిని ఓటింగుహక్కు అనే ఆయుధం తప్పక ఉద్ధరించగలదు. మీరుగూడ ఓటింగు హక్కుకోసం పోరాడినవారు. కనుక మీరు నా ఆలోచనను అంగీకరించగల రనుకుంటాను" అన్నాను నేను.

అందుకామె "నిజమే - నేను ఓటింగు హక్కుకోసం పోరాడుతున్నమాట వాస్తవమే. నేను నీలాగా సామ్యవాదిని గూడ. కాని భారత ప్రజలు ఓటింగు హక్కు అనే ఆయుధాన్ని సమర్థవంతంగా ఉపయోగించడాని కింతవరకు సిద్ధంగాలేరు. వారి ఓటు వృధాఅవుతుంది. లేక దానిని వారుపయోగించలేని స్థితి లోనైనా వుంటారు. అమెరికాలోని నీగ్రోల అనుభవం అలాంటిది" అన్నది.

ఆమె దృక్పథంతో నేను ఏకీభవించలేనన్నాను. "క్రమంగా మనం ముందుకువెళ్ళాలి. అస్పృశ్యతను మొదట నివారిద్దాము. మన ప్రజలలో నిరక్షరాస్యతను నిర్మూలిద్దాము. ఈలోగా కామన్వెల్తుద్వారా, విద్య ఆధారంగా

పర్చడిన ప్రాతినిధ్య సంస్థలద్వారా హక్కులువంకకు సాగుదాం. అదే గొప్ప అభివృద్ధి" అన్నారామె నాతో.

కౌన్సిళ్ళకు, అసెంబ్లీలకు జరిగే ఎన్నికలలో వయోజన ఓటింగు హక్కును ప్రవేశపెట్టాలని కేంద్ర అసెంబ్లీలో చాలమంది స్వరాజ్యపార్టీ శాసనసభ్యులు ఒక తీర్మానాన్ని లోగడ ప్రవేశపెట్టారని నేనామెతో అన్నాను.

"మోతీలాల్ నెహ్రూగారు మీ ప్రతిపాదనకు అంగీకరిస్తున్నారా?" అని ఆమె ప్రశ్నించింది.

"వారు దీనిని వ్యతిరేకించడంలేదు" అన్నా నేను.

"నీకిష్టమయితే మీ విధానాన్ని మీరు ప్రచారం చేసుకోండి. వయోజనులందరికీ ఓటింగు హక్కు రావడానికి మీరు చాలకాలం వేచివుండాలి." అన్నారామె. తరువాత నేను మోతీలాల్, మాలవ్యా ప్రభృతులతో కూడ చర్చించాను.

అనంతరం బాపూజీ వద్దకు వెళ్ళాను. బీసెంటు, మోతీలాల్, మాలవ్యా మొదలైన వారితో నేను జరిపిన చర్చల వివరాలను బాపూజీకి చెప్పాను.

బాపు: వయోజన ఓటింగు హక్కు దేనికి కావాలంటావు నువ్వు?

రంగా: వారికి ఓటింగు హక్కు యిస్తే - సవర్ణులైన అభ్యర్థులు, వారిని బలపరచేవారు అస్పృశ్యులున్న ప్రాంతాలకు వెళ్ళి వారిని ఓట్లకోసం అభ్యర్థించ

వలసి వస్తుంది. వారిని సంతోష పెట్టవలసివుంటుంది. అందువల్ల అస్పృశ్యులుగా వున్నవారు తమ వెనుక బడినతనాన్ని మరచి తమ విలువను గుర్తించ గలుగు తారు. తాముగూడ ఇతర పౌరులతో సమానులమని వారెంచ గలుగుతారు.

బాపు: అది నిజమేకావచ్చు. కానీ వారికి ఓటింగు హక్కు వస్తే, ఆ ఓట్లను తమకే వేయమని సవర్ణులు వారిని బాధించరా?

రంగా: అప్పుడు ప్రత్యర్థులుగావున్న అభ్యర్థులు వారిని రక్షిస్తారు

బాపు: (నా వైపుకు తిరిగి) సవర్ణుల రాజకీయాలకు, వారి పోట్లాటలకు హరిజనులను గురిజేయడం మంచి దేనా?

రంగా: బాపూజీ! ఇంతవరకు వారిని విస్మరించిన సవర్ణులు, వారి అభ్యర్థులు ఎన్నికలు వచ్చినప్పుడు వారి విలువను తప్పక గుర్తిస్తారు. వారిని తోడి మానవు లుగా అంగీకరిస్తారు. దురదృష్టవంతులైన ఈ ప్రజ లను అస్పృశ్యత తన కబంధ హస్తాలనుండి తప్పని సరిగా వదలివేసుంది.

బాపూజీ నామాటకు సుముఖతను వ్యక్తం చేశారు.

బాపు: ఎన్నికలలో నిరక్షరాస్యులు తప్ప దారిని పట్టించ బడుతారని, వారు తమ ఓటును సక్రమంగా వినియో గించలేరని బీసెంటుగా రన్నమాటకు నీవేమన్నావు?

రంగా: అలా జరిగేవీలుంది. అయినా వారికి ఓటింగు హక్కు నివ్వడమే మంచిది. దీని ద్వారా మన శాసన సభ్యులను, ప్రభుత్వాలను వారికి సన్నిహితం చేయవచ్చు. వారిలో నిరక్షరాస్యతను త్వరగా పోగొట్టవచ్చు.

నేను మాట్లాడుతున్నంతసేపు గాంధీజీ నూలు వడకుతూనే వున్నారు.

బాపు: వయోజనునికి ఒటింగు హక్కు నివ్వడానికి బీసెంటు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? వేదప్రజలు రాజకీయాధికారాన్ని పొందడాన్ని ఆమె వ్యతిరేకించకూడదు.

రంగా: ఆమె స్త్రీల ఓటింగు హక్కుకై పోరాడివున్నారు.

బాపు: అది నాకు తెలుసు. మన ప్రజలు అక్షరాస్యులు కారుగనుక ఆమె అలా అభిప్రాయపడి వుంటుంది. అందులో వారికి రాజకీయానుభవం గూడ లేదని ఆమె అనుకొని వుంటుంది. రాజకీయాలలో పాల్గొనక పోతే ప్రజలకు అందులో అనుభవం ఎలా వస్తుంది? ఓట్లు లేకుండా రాజకీయాలలో జోక్యమెలా లభిస్తుంది? కాని వారి స్త్రీలకుగూడ ఓట్లివ్వడానికి నన్నంగీకరించమంటున్నావు! పురుషులకంటె వారు చాల అధ్వాన్న స్థితిలో వున్నారుగదా!

రంగా: స్త్రీలనుగూడ మీరు ఉద్ధరించాలను కున్నారు. సరోజినీదేవి మీ శిష్యురాలు గదా!

బాపు: కాని ఆమె సరోజిని. కవికోకిల. మంచి వక్త.

రంగా: వారికి సమానమైన ఆస్తిహక్కు ఇవ్వక పోయినప్పటికీ ఓటింగు హక్కైనా ఇవ్వనవసరంలేదా?

బాపు: ఇవ్వవలసిందే. మన హరిజనులకు స్త్రీలకుగూడ ఓట్లను మనం కోరాలి. అవి వారిని బంధవిముక్తులను చేస్తాయి.

రంగా: ఓటుహక్కు నివ్వడానికి ఆస్తివుండాలని చాలమంది అంటున్నారు.

బాపు: (నవ్వుతూ) ఆస్తివుండాలనడ మెందుకు? నాకెక్కడా ఆస్తి అంటూ లేదు. ఆవిధంగా అయితే నాకు ఓటేవుండదు గదా? ఆస్తి ఎవరికీ వివేకం కలిగించదు. ఇతరుల అవసరాల నది గుర్తించ నివ్వదుగూడ! వ్యక్తిని ఆస్తి హెచ్చు బాధ్యత గలవానిగా చేయగలుగుతుందా?

రంగా: 1834 నుండి 1840 వరకు ఇంగ్లండులో పురుషులకే గాక స్త్రీల కందరికీ ఓటు హక్కివ్వబడింది. ప్రథమ ప్రపంచయుద్ధం తరువాతనే స్త్రీలకు ఓటు హక్కు ఇవ్వబడింది.

బాపు: అవును. అప్పుడు వారు ప్రాతినిధ్యవిధానాన్ని ప్రయోగిస్తున్నారు. ఆ ప్రయోగంవల్ల వయోజన ఓటింగు సాధ్యమేనని, సురక్షితమైనదని, సాంఘిక అభివృద్ధికి దారి తీస్తుందని వారు బుజువు చేశారు. వారు విజయమందినపుడు మనం దానినెందుకు ఇచ్చట ప్రవేశపెట్టకూడదు? జాన్‌స్టూవర్టు మిల్

స్త్రీలకుకూడ ఓటుహక్కు కావాలని వాదించినట్లు నాకు గుర్తుంది.

గాంధీగారితో నేను జరిపిన చర్చలనుగూర్చి వెస్టర్ను కోర్టులోనున్న మోతీలాల్ నెహ్రూగారికి నేను వివరించి నప్పుడు వారు ఇలా అన్నారు, "బ్రిటీషు లిబరల్ పార్టీవారి కంటే గాంధీగారు చాల అభివృద్ధి కాముకుడని నే నెల్లప్పుడు అనుకొంటున్నాను. రాజులు, బ్రాహ్మణులు, వెట్టి, హరిజనుల దగ్గరికి వెళ్ళి వారి ఓట్లను అర్థించే దృశ్యం, దేవతలు చూచి తీరవలసినదే!"

మోతీలాల్ నెహ్రూ చీఫ్ విప్ అయిన శ్రీ టి. సి. గోస్వామిగారి నైపుచూచి నా ప్రతిపాదనను అసెంబ్లీలో ప్రతిపాదిద్దామన్నారు. ఈ విషయాన్ని తాను తన మనస్సులో వుంచుకుంటానన్నారు.

తర్వాత నేను ఆచార్యుణ్ణయ్యాను. ఆ సమయంలో (1928-29) మదరాసులో జరిగిన కాంగ్రెసు సభల తరువాత ఈ విషయమై నివేదిక నివ్వడానికి మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతను ఒక అఖిలపక్ష సంఘం యేర్పాటు చేయబడింది. అప్పటికి 'వయోజన ఓటింగు' అనే నా సిద్ధాంతము ప్రచురితమై మోతీలాల్‌గారికి పంపబడింది. మన సాంఘికాభివృద్ధికి అదొక పరిష్కార మార్గమని అప్పటికే లిబరల్ వాది అయిన సర్ఫూ, స్వతంత్రుడైన జిన్నా మొదలైనవారు అనుకొనసాగారు. నేను గాంధీజీని, మోతీలాల్‌గారిని మరొకసారి కలుసుకొని 'వారు ఎలాటిరాజ్యాం

గాన్ని ప్రతిపాదించినా దానికి వయోజన ఓటింగు పునాదిగా ఉండా' లని అర్థించాను. గాంధీజీ దాన్ని తప్పనిసరిగా బలపరుస్తానన్నారు. నెహ్రూ సంఘం దాన్ని అంగీకరించింది.

నాటినుండి (1929) భారత ప్రజ అభిప్రాయం యీ విషయమై ఒకటిగానే యున్నది. బాపుజీ దీన్ని ఆశీర్వదించి నందుకు వారికి నా ధన్యవాదాలు. ప్రజలను సముద్ధరించే దానికి ఓటింగు హక్కును గాంధీజీ ఒక ప్రాతిపదికగా తీసుకున్నారు గనుక ఏ రాజ్యాంగ సవరణలు ప్రతిపాదించ బడినా దానికి అదే పునాది అయింది.

తమ హస్తాలలో వుంచబడిన యీ అధికారాన్ని మన ప్రజలు ఎలా వినియోగించారు? దానివల్ల వారు లాభం పొందారని మనం చెప్పగలమా? అది అస్పృశ్యతను నివారించిందా? పతిత ప్రజలను సాంఘికంగా సముద్ధరించిందా? లేదనే చెప్పాల్సి వస్తున్నది!

నీతి నియమాలు లేని చాలమంది రాజకీయ వేత్తలు హరిజనులనుండి, వెనుకబడిన తరగతుల నుండి, గిరిజనుల నుండి, తదితర పీడిత ప్రజలనుండి నానారకాలయిన తప్పుడు మార్గాల ద్వారా, బెదిరింపుల ద్వారా వారి ఓట్లను లాక్కొన్నారు.

అత్యవసరమైన నిరక్షరాస్యతా నిర్మూలనోద్యమం ప్రారంభించబడనేలేదు. ఈ పతిత ప్రజలకోసం జీవితా న్నంతా వెచ్చించిన మాలాటివారు ఎన్నికలలో పలుమారు

ఓడించబడినారు. ఎందువల్ల ఈవిధంగా జరుగుతున్నదని ప్రజలయెడ ప్రేమ గలిగిన వారందరు నన్ను అడుగుతున్నారు. ఈలాటివారికి గాంధీజీ ఓట్లు యెందుకు ఇచ్చారని అడుగుతున్నారు. నిరక్షరాస్యతా నిర్మూలనోద్యమం ప్రారంభించకుండా ఎన్నికల చిహ్నాలను ప్రవేశపెడుతారని గాంధీజీ అనుకోలేదు. వయోజన ఓటింగును మీరు బలపరచినప్పుడు, బలపరచామని మిమ్మల్ని ప్రోత్సహించినప్పుడు, వారు ప్రజల శ్రేయస్సునే మనసులో నుంచుకున్నారని నాకు గట్టి విశ్వాసమున్నది. బాహ్యజీవితాలు త్వరలోనే నెరవేరగలవని, సాంఘికాభివృద్ధి నిరోధకులనుండి, కమ్యూనిస్టులనుండి, ఇతర విచ్ఛిన్న తత్వవాదుల నుండి, మన ప్రజలను మన ప్రజాస్వామ్యం రక్షించగలదని మనం విశ్వసించాలి.

వయోజన ఓటింగు హక్కును మనప్రజలు చక్కగా ఉపయోగించ లేనప్పటికీ, దానివల్ల చాల మంచిఫలితాలే కలిగాయి. ఎన్నికల సమయాలలో ఇతర ప్రాంతాలకంటే హరిజనవాడలలో తిరగటానికే అభ్యర్థులు హెచ్చుప్రాధాన్యతను ఇస్తున్నారు. చాలమంది హరిజనులు జనరల్ నియోజక వర్గాలనుండే శాసనసభలకు, పార్లమెంటుకు ఎన్నికవుతున్నారు. పోలింగు స్టేషనులకు తమకు తాముగా గాని, ఇతరుల ప్రోద్బలం వల్లగాని యీ రెండు దశాబ్దాలుగా వస్తున్న హరిజన ఓటర్లు తామిక అంటరానివారుగా భావించడం లేదు. పంచాయితీ రాజ్యావతరణంతో వందల మంది హరిజనులు, గిరిజనులు, తదితర వెనుకబడిన తరగతుల

వారు సభ్యులుగా, అధ్యక్షులుగా ఎన్నికొంటున్నారు పాలిటెక్నిక్ విద్యాలయాలలో, సాంకేతిక కళాశాలలలో, పెద్ద ఉద్యోగాలలో వారి యువకులకు పెచ్చు అవకాశాలు ఇవ్వబడుతున వి. ఇదంతా వయోజన ఓటింగు ఫలితమే గదా?

1971లో, తిరిగి 1972లో, బహుజనాలు మొదట పార్లమెంటు ఎన్నికలలో, పిమ్మట అస్సెంబ్లీ యెన్నికలలో మేల్కొన్నారు. ఒక్కమ్మడి, "బీదతనాన్ని పారదోలుదాము" అనే యిందిరాజీ అందించిన ఆశాజనకమైన నినాదాన్ని విన్నారు; బలపరచారు. ఆమె పార్టీయైన క్రొత్త కాంగ్రెసును కొగిలించుకున్నారు రెండో యుద్ధానంతరం, ఇంగ్లీషు ప్రజలెట్లు 1945లో లేబరు పార్టీని పెత్తనానికి పిల్చినారో, ఆలాగా యింది రాజీకి అత్యధిక మెజారిటీ యిచ్చిరి. కాన్స్టిట్యూషన్ను (మూలచట్టము) మారుస్తానన్నారామె. అదేకావాలన్నారు ప్రజలు. ఆస్తి హక్కును పరిమితం చేయాలన్నారు ఆమె. సరేనన్నారు ప్రజలు. దిక్కులేని జనాలకు దిక్కు చూపెట్టాలంటే, మిగతా పైవారిని అదుపులో వుంచుతామన్నారు ఆమె. అంతేనన్నారు ప్రజలు!

తాను 1925 నుండి యిలాగు యింతగా బహుజనాలు తమకు అందవలసిన ధర్మం, దేశసౌభాగ్యమండలి భాగం పొందుటకు, పొందాలనే ఆశ, ఆరాటం ప్రకటించుకొనుటకు అవకాశం ఇవ్వగల్గిన "ఓటింగు హక్కు" కోరుచుండిరి రంగాజీ! ఇంతకాలం రైతుకూలీలు, తదితర జనాలు ఆ హక్కును వుపయోగించుకోలేకున్నారే యని దిగులుపడు చుండిరి. 1952లో కృషికార్ లోక్ పార్టీ పెట్టి, ఆ ప్రజల పిల్చిరి. వారు వినరైరి. ఆ ప్రజల స్వయంవృత్తులను, స్వంతఉద్యోగములను రక్షించు కొనడానికై, అందుల కాధారమైన – స్వయంగా సాగుచేసుకొనే భూకమతాల రక్షణకై, ప్రజలను మేల్కొల్పజూచిరి; స్వతంత్రపార్టీని స్థాపించి;

జనాలు నిద్రలోనే యుండిరి. తుదకు, అంతచనుక పెత్తనమే, తమకు కావలసినదంటూ వస్తూన్న అధికార కాంగ్రెసునే పటాపంచలు చేస్తూ ప్రజాశయాలను శిరసావహిస్తూ పైకి వచ్చిన ప్రధానమంత్రి ఇందిరా జీని ప్రజలు గుర్తించగల్గిరి. తమ నాయకులుగా ఎన్నుకొనిరి.

ఆ సమయంలో, అకస్మాత్తుగా అలాగా పైకొచ్చిన యీ నూతన నాయకత్వమును యెందరో, ఆ పెనుకనుండిన స్వరూపాన్ని మరువలేక పూర్వమువలెనే యెదిరించసాగిరి. రంగాజీ అట్టిపొరపాటుచేయలేదు. ఇందిరమ్మ పూర్వపు అధికార స్వరూపముతో మనకు అంతగాపనిలేదు. ఆమెపై ప్రజలు పెట్టిన నూతన అధికార స్వరూపాన్నే గుర్తించుదా మన్నారు. ప్రజల వాక్కే మనకు శిరోధార్యమన్నారు. "పేదతనం పారద్రోలాలి గదా! అందుకు ప్రజలు ఇందిరమ్మపై విశ్వాసముంచినారు, ఆ ప్రజల ఆశయం, ఆదేశాన్ని అంగీకరం అంగీకరిద్దాం" అన్నారు. అలాగా విప్లవాత్మకంగా, ఎందరు తమతమ పేర్వేరు రాచకీయ పంథాలనుండి వైదొలగి ముందుకు రాగలరు? ముందడుగు వేయగలరు? ప్రథమశ్రేణిలో వున్న కాంగ్రెసేతర పార్టీ నాయకులలో, రంగాజీయే ధైర్యముతో, నిష్ఠం డితముగా, ప్రజాభ్యుదయము కాంక్షించిరి. వయోజన హక్కును ప్రప్ర థమంగా 1925 నుండి కోరుచూ వస్తూవుండి, కాన్స్టిట్యూషనులో వయో జనహక్కును స్థిరపరిపించుకున్నరంగాజీయే 1971, 1972లో వెలువడిన దీనజన బాహుళ్య శంఖారావమును గాంధీజీమాటగా గమనించుకున్నారు. రాజాజీతో ఆ సంగతి తెల్పుకున్నారు. క్రొత్తకాంగ్రెసును తమదిగా తమ్మందరిదిగా గుర్తించుకున్నారు.

23. గాంధీయిజం, నెగటివిజం, సోషలిజం

1936-44 లో ఒకరకమైన రాజకీయ వాతావరణం నెలకొన్నది. ఆ సమయంలో గాంధీగారు 'నిజమైన దేశ భక్తులు, సంఘసేవకులు ఎంతవరకు సామ్యవాద ధోరణిలో వెళ్ళగలరన్న ఆలోచనలో పడ్డారు. 'గాంధీ మరణించినా, గాంధీతత్వం నశించ'దని గాంధీగారు చెప్పినప్పుడు, ప్రాథమిక హక్కుల పత్రాన్ని ప్రకటించినప్పుడు సంప్రదాయ గాంధేయులకు, బ్రిటిష్ పద్ధతి సామ్యవాదులకు అంతగా భేదం లేదనిపించింది. అందువల్ల 1933లో అఖిలభారత కాంగ్రెస్ సభల సందర్భంలో మేము చాలమంది పూనాలోని గోఖలే హాలులో సమావేశమై కాంగ్రెస్సులోనే వుండి, ప్రతికూలీలకోసం పనిచేయడానికి కనువుగా కాంగ్రెస్సులో సోషలిస్టు వేదికను సృష్టించడానికి తాత్కాలికంగా ఏర్పాట్లను చేయడానికి నిర్ణయించాము. ఆ నిర్ణయమే 1934 లో పాట్నాలో సోషలిస్టు పార్టీ ఏర్పడడానికి దారి తీసింది. కాని జయప్రకాశ్ నారాయణ్ "సామ్యవాదమెందుకు?" అన్న గ్రంథాన్ని ప్రకటించారు.

గాంధీగారు రూపొందించిన, ప్రతాంగ ఉద్యమానికి చెందిన మేమందరం బలపరుస్తూ వచ్చిన, నిర్మాణ కార్యక్రమానికి అది చాల వ్యతిరేకంగా ఉన్నందువల్ల, మార్క్సు ధోరణిలో వున్నందువల్ల నేను ఆ పార్టీతోటి తీవ్రంగా భేదించవలసి వచ్చింది. ప్రతులలోకి చొచ్చుకొని వెళ్ళి ప్రతుల ఆర్థిక పరిస్థితిమీద, సాంఘిక ప్రజాస్వామ్యం మీద

ఆధారపడిన ఇటాలియన్, దచ్ సోషలిస్టులలాటి సోషలిస్టు లైనప్పటికీ నేను ఆ పార్టీతో తెగతెంపులు చేసుకొన్నాను.

జవహర్‌లాల్ నెహ్రూ కూడ సామ్యవాదే. అయితే అతడు ఫ్రూధి మార్కున పద్ధతిలోని సామ్యవాది కాక పోయినా యూరపుఖండ పద్ధతిలోని సామ్యవాది. కాని అతనికి లైతుతత్వంలోగాని, లైతాంగ సాంఘిక ప్రజా స్వామ్యంలోగాని విశ్వాసం లేకపోవడంవల్ల మాయెడల వారి అభిప్రాయాలకు, మార్క్‌స్టుల అభిప్రాయాలకు యేమీ తేడాలేకపోయింది. అందువల్ల నెహ్రూ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి చెందిన వారు కలసి పనిచేయగలిగారు. కాని నేను, నాలైతాంగ సహచరులు వారితో భేదించి గాంధేయపథంలో వర్తించబూనుకొన్నాము.

1936లో జరిగిన కాంగ్రెస్సు మహాసభలలో నెహ్రూ, తదితరులు నన్నెందుకు సామ్యవాదిగా గ్రహించలేదని గాంధీగారు నన్నడగడం తటస్థించింది. ఆ ప్రశ్న విని నాకాశ్చర్యం కలిగింది. వారు నన్నెందుకలా ప్రశ్నించారని నాలో నేనే తర్కించుకున్నాను. కాంగ్రెస్ సోషలిస్టుపార్టీలో నేను చేరాలని వారి అభిప్రాయమా? లైతాంగ సామ్యవాదంలో నేను ముడిపడి వుండడంవల్ల వారి సిద్ధాంతంలో నా కేమాత్రం విశ్వాసమున్నదో వారు నన్ను పరీక్షిస్తున్నారా? బాపూజీయే నెహ్రూ సామ్యవాదం వైపు మొగ్గుతున్నారా?

ఆ రోజులలో నెహ్రూ గారితోను, వారికి కావలసిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీతోను సంబంధం కలిగివుండాలని

నాలాటి ప్రజాసేవకుల కందరికి చాలా కోరికగా వుండేది. అయినప్పటికీ కరాచీ ప్రకటన, బార్డోలీ సత్యాగ్రహాల తత్వాన్ని వదలి, రైతాంగానికి ఆసరాగా వున్న గాంధేయ పథాన్ని వదలి కాంగ్రెసు సోషలిస్టు పార్టీతత్వాన్ని కొగిలించుకొనడానికి నే నిష్టపడలేదు. అందువల్ల గాంధీజీకి నాకు ఈ క్రింది చర్చ జరిగింది.

బాపు :- నన్ను కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో చేర మంటున్నారే? చాలమంది యువకులు అందులో చేరుతున్నారు. నీవు జమీందార్లు పోవాలంటున్నావు. వారూ అదే అంటున్నారు. అయినప్పుడు నీవెందుకు వారితో వేరుపడ్డావు?

రంగా : మీరు నిజమైన సామ్యవాదులు కాదా? మీరు భారతదేశంలో మాకోసం రూపొందిస్తున్న కార్యక్రమంకంటె మెరుగైన కార్యక్రమాన్ని భారత సోషలిస్టులు మా కందించగలరా? హరిజనాభ్యుదయం, అస్పృశ్యతా నివారణ, స్త్రీల విముక్తి, కార్మిక సంక్షేమం, రైతుల రక్షణ ఇవన్నీ సామ్యవాద కార్యక్రమాలు కావా?

బాపు: ఇవన్నీ అభివృద్ధి నిరోధకమైన కార్యక్రమాలుగా వారు భావిస్తున్నారు.

రంగా: బాపూ! నేను చాల యూరపు దేశాలలో పర్యటించాను. చాలమంది సోషలిస్టు నాయకులను కలుసుకొన్నాను. ఇటలీ, ఫ్రాన్సు, హాలండు, డెన్మార్కు మొదలైన దేశాలలోని సోషలిస్టు

పార్టీల కార్యక్రమాలను గమనించాను. వారికి, రైతులకు ఎంత సాన్నిహిత్యమున్నదో, వారేలాటి కార్యక్రమాలను చేబడుతున్నారో పరిశీలించాను. మన కాంగ్రెస్సు సోషలిస్టులతో కూడ కొంతకాలం గడిపాను. కాని భారత ప్రజలకు మన కార్యక్రమమే సరియైన సామ్యవాద కార్యక్రమమని నేననుకొంటున్నాను. కాంగ్రెసు సోషలిస్టు పార్టికి భారత రైతుల గ్రామీణ ప్రజల సమస్యలకు ఏమాత్రం సంబంధం లేనట్లనిపిస్తుంది.

గాంధీజీ నా అభిప్రాయాలతో ఏకీభవించారు. అహింసాయుతంగా రైతులమధ్య పనిచేయమని నన్ను ప్రోత్సహించారు. బార్డోలీలో సంభవించినట్లుగా రైతులను క్రమంగా జాతీయోద్యమంలోకి తీసుకువచ్చే విధంగా వారిని వ్యవస్థీకరించమని చెప్పుతూ ఆ చర్చనంతటితో చాలించారు.

గాంధీగారి అహింసాధోరణికి సాధనాల యెడల ఆయన దృక్పథానికి కాంగ్రెసు సోషలిస్టుపార్టీ ఎలా వ్యతిరేకమో నేనప్పటికి అంతగా గుర్తించలేకపోయాను. మన లక్ష్యాలను సాధించడానికి అనుసరించే మార్గాలు, ఆలక్ష్యాల వలెనే పవిత్రంగా ఉండాలన్న అంశాన్ని నేనప్పటికి పూర్తిగా గ్రహించానని కూడ చెప్పలేని స్థితిలోవున్నాను. ప్రజా ఉద్యమాల యెడల సి. యస్. పి. ధోరణినిగూర్చి గాంధీ గారు కూడ నావలెనే ఇతమిద్ధమని చెప్పలేని స్థితిలో వుండినా, కాంగ్రెసు కార్యవర్గ సభ్యుల నియమించే అవకాశం లభించినప్పుడు, జవహరులాలు తన 'ఇండియా ఎచ్చ

టికి?' అన్న గ్రంథంలో వెలిబుచ్చిన "నెగటివిజాన్ని" ఆరాధించే యువకులను చేర్చుకొని, ప్రజా ఉద్యమాలతో సంబంధమున్న నాబ్‌గోటి గాంధేయులగువారిని వదలివేశారు. ఆవిధంగా కాంగ్రెస్‌సోషలిస్టు పార్టీ కొరకై నెహ్రూచేత, సాంప్రదాయ పెద్దల కొరకై సర్దారుచేత మాబోంట్లము వదలివేయ బడడాన్ని మేమంతగా ఖాతరు చేయలేదు. కారణం బాపు పేరిమ మాకు గొప్ప ప్రోత్సాహంగా ఉండడమే. గాంధీగా రనుకరిస్తున్న అహింసావాదానికి సోషలిస్టుల కున్న పూర్తివ్యతిరేకతను ప్రోత్సహిస్తున్న నెహ్రూపై కాంగ్రెసు పెద్దలు తిరుగుబాటు చేయడం జరిగింది. తరువాత (నెహ్రూగారి 'బంచ్ ఆఫ్ లెటర్సు'ను చూడండి) బాపు వారిమధ్య ఒకవిధమైన ఒడంబడిక కుదిర్చారు. కాని బాపుమాత్రం సి. యస్.పి పద్ధతి తనది కాదని మాకు స్పష్టంచేశారు.

తరువాత ఏ డెనిమిదేండ్లకు (1945-46) తానుకూడ ఒక సామ్యవాదినని అంగీకరించడానికి బాపూ సిద్ధపడ్డారు. ఆ సమయానికి భారతదేశంలో కరుడుగట్టిన సోషలిస్టులలో చాలమంది మార్క్సిజంలో విశ్వాసాన్ని కోల్పోయారు. కమ్యూనిస్టులకు దూరమయ్యారు. "సామ్యవాదమెందుకు?"అన్న చోటునుండి వారు "గాంధేయవాద పునఃపరిశీలన; సామ్యవాద పునఃపరిశీలన" అనేవరకు పయనించారు. కాని నైతాంగ ధోరణివున్న మాబోటివారము క్విట్ ఇండియా ఉద్యమం తరువాత కూడా సి.ఎస్.పి.లో

విశ్వాసముంచడానికి సిద్ధపడలేదు. ఎందువల్ల అలా చేస్తున్నారని బాపు నన్ను అడిగారు.

రంగా: జయప్రకాశ్, నరేంద్రదేవ్ లాటి సోషలిస్టునాయకులంటే నాకేమీ అయిషతలేదు. 1922 నుంచి నేను సామ్యవాది ననుకొంటూనే వున్నాను. అయితే నా సామ్యవాదం బెయిల్స్‌ఫర్డ్, కోల్, గాంధీజీల సామ్యవాదం. మీ నిర్మాణయుక్తమైన ప్రయోగాలవల్ల నిజమైన, పవిత్రమైన తత్వాన్ని సంతరించుకుంటుంది. ప్రజల సమస్యలకు నైతికమార్గం ద్వారా పరిష్కారాలను సూచించేదిగా వుంటుంది.

బాపు: మనమెచ్చట వారితో భేదిస్తున్నాము? మనమిప్పుడు వారి దృక్పథాలతో భేదిస్తున్నామా?

రంగా: అవును బాపూ! మనకు వారితోనున్న భేదాలు మూలికమైనవి. వారు గూడ ప్రజాస్వామ్యంలో శ్రమైతు కూలీ ప్రజారాజ్యంలో విశ్వాస మున్న దంటారు. కాని వారు సామ్యవాద సమాజాన్ని అహింస ద్వారా సాధించడానికి, ఆ సమాజంలో శ్రమైతు స్వతంత్రులుగా వుండడానికి అంగీకరిస్తారా?

బాపు: ఎందువల్ల నీవలా అంటున్నావు?

రంగా: ఒక ఇంగ్లీషు క్వార్టర్లీలో ఇటీవలనే జయప్రకాశ్ వ్రాసిన ఒక వ్యాసాన్ని చదివాను. అందులో వారు మార్క్సు రూపొందించిన కార్మిక

నియంత్రత్వ నినాదంయందు సోషలిస్టులకు పూర్తి నమ్మకమున్నట్లు, సమాజంలో శ్రమజీవులు అధిక సంఖ్యాకులుగా వుంటారు గనుక కార్మికనియంత్రత్వం ప్రజాస్వామ్యానికి దగ్గరగానే వుంటుందన్నట్లు ఋజువు చేయడానికి ప్రయత్నం చేశారు.

బాపు: నేను అహింసా వాదినైన సామ్యవాదిని. నా సామ్య వాదం వారి సామ్యవాదం ఒకటి కాకపోవచ్చును. హరిజన్‌లో సామ్యవాదం మీద నేను వ్రాసిన వ్యాసాలను నీవు చదవలేదా?
అప్పుడు అతని కార్యదర్శి (బిజ్‌కిషన్) ఆపత్తులను నాకు చూపాడు.

రంగా: చాలమంది సోషలిస్టులు మార్క్సిస్టులుగా చెలామణీ కావడానికి ప్రయత్నిస్తున్నారు. కాని వారు "గాంధీ వాదాన్ని పునఃపరిశీలించాలి" అన్న ధోరణిలో తామునూడ గాంధేయులమేనంటున్నారు. కానివారేమో పట్టణాలకి సంబంధించినవారు. మేమేమో పల్లెలకు సంబంధించిన వారము. వారు కార్మిక నియంత్రత్వ ధోరణిలో ఆలోచిస్తారు. మేమేమో రైతుకూలీ ప్రజా రాజ్యం లేక రామ రాజ్యం అనే ధోరణిలో ఆలోచిస్తాము. వారికి రైతాంగ తత్వం, గ్రామీణ పరిశ్రమల తత్వం బూజుపట్టినదిగా వుంటుంది. అది మాకు సాంఘిక ఆర్థిక విధానానికి పునాది. వారికి ఆస్తి అంటేనే వ్యతిరేకం. కాని మాకు ముఖ్యంగా రైతుల

భూకమతాలు, చేతి వృత్తులవారి పనిముట్లు ఆర్థిక స్వాతంత్ర్యాన్నివ్వగల సాధనాలు నియంతృత్వంలో ఏభయోత్పాతాలూ లేవని వారి నమ్మకం. కాని అది నైతికమైన అన్ని విలువలకు, సాంఘిక స్వాతంత్ర్యాలకు వ్యతిరేకమని మా విశ్వాసం. వారి గురువులు పాశ్చాత్య రాజ్యాలలో ఉన్నారు. మా గురువులు మీరే. వారి పుస్తకాలు మార్క్సిజంలోనుండి స్టాలినిజంలోనుండి ఉద్భవించాయి. మా గ్రంథాలు బార్డోలీ, చాంపరాన్ సత్యాగ్రహాలనుంచి, అహమ్మదాబాద్ కార్మికుల ఉపవాసాలనుండి ప్రోత్సాహాన్ని పొందుతాయి. వారు పాశ్చాత్య సామ్యవాద పోరాటాలనుండి ఉదహరిస్తారు. అహింసాత్మకంగా మేము సత్యంతో మీరుచేస్తున్న ప్రయోగాలను, భారత స్వాతంత్ర్య సమరాలను ఉదహరిస్తాము.

నేను చాల ఉద్రేకంగా మాట్లాడసాగాను. కాని వారు చాల సహనంతో విన్నారు. వారు చిరునవ్వుతో నా మాటలకు ఆమోదముద్ర వేశారు. నా విశ్లేషణవల్ల వారి మనస్సులో పొదుకొనివున్న కొన్ని ప్రశ్నలకు వారు సమాధానం పొందారని నాకు అనిపించింది.

బాపు: భారతదేశం తన దారిని తానే తెలుసుకోవాలి. కరాచీమార్గాన్ని (ప్రాథమిక హక్కులు) విస్తృతం చేయాలని, బలపరచాలని నీవన్నది సమంజసమే. మనం అహింసాయుతంగా వున్నంతవరకు, నైతిక

పంథా ననుసరిస్తున్నంతవరకు మనం మన ప్రజలకు సాయం చేస్తూ వుండవచ్చు. మన ప్రజలందరనూ ప్రతికరణ శుద్ధిగా వుంచవచ్చు.

రంగా: ఇదేగదా గాంధేయ మార్గం బాపూ! నేను మీ యాశీస్సులతో సంతృప్తి చెందగలను.

బాపు: నీకు వాటికొరతేమీ వుండదు.

క్రమంగా ఆనాటి కమ్యూనిష్టులు మూడు పార్టీలుగా, సి. పి. ఐ. సి.పి.ఐ. మార్క్సిస్టు); సి. పి. ఐ. (మార్క్సిస్టు-లెనినిస్టు)గా విడివడి పోయినారు. యిక సోషలిస్టులు మరో నాల్గు విభాగాలైనారు. సి.పి.ఐ. వారు కాంగ్రెసును బలపరుస్తూనే యెదిరిస్తుండుటకు తయారౌతారట. కమ్యూనిష్టు మార్క్సిస్టులు ఇందిరా కాంగ్రెసు నెదిరించుటకై, ఇతరు లందరితో చేరగలరట. జనసంఘమువారు, స్వతంత్రవారు, బి. యల్ డి. వారు, కొందరు సోషలిస్టులు, కమ్యూనిస్టులతో కలిసి జనతాపార్టీగా మారుతారట.

అందరూ సోషలిస్టులే! ఏరకమైన సోషలిజము? భారత దేశపు ప్రజలు, సాంప్రదాయము, అవసరాల ననుసరించి, సర్వప్రజల క్షేమమును ఆస్తిపరులకు లొంగకుండా అసమానతల కింకా తావివ్వకుండా ముందుకు ముందుకు, బహుజనాల సౌభాగ్యోదయము సాధించునదే మనకు కావలసిన సోషలిజము, అంటున్నారు ఇందిరా కాంగ్రెసు. అది యిప్పటికి తృప్తికరమైన ధోరణే అంటున్నారు రంగాజీ! 25 సూత్రాలు, మహాత్ముని నిర్మాణ కార్యక్రమము ద్వారా శాంతియుతమగు, సాంఘిక విప్లవము; పరిశ్రమల నిర్వహణలో కార్మికులకు యజమానులు, ప్రభుత్వముతో బాటు సమాన యాజమాన్యపు, సహకారమగు హక్కు బాధ్యతలు వుండాలి. అప్పుడే యూగోస్లావియాలో పెరుగుచున్న గిల్డు సోష

లిస్టు, స్వంత ఉద్యోగ సౌకర్యము, సంపత్తి, ఆర్థిక స్వాతంత్ర్యము అందగల్గును. అటులె యింతదనుక యెటులో బ్రతికివుండిన, కోట్లాది రైతులు, చేతివృత్తులవారు, తదితర స్వంతవృత్తి, స్వయంపోషక భూకమతాలు, వృత్తి స్థావరాలు కల్గిన వారందరికి, సహకార సంఘాల బలం కల్గించి, ప్రభుత్వం సోదరతోడ్పాటు కల్గించు సోషలిస్టు ప్రతిపత్తి గావాలి.

అట్టి, నిర్మాణాత్మమగు, అభివృద్ధి దాయకమగు. సంఘం కావాలి. అనర్థపు అంతరాలను, అన్యాయపు అసమానతలను తొలగిస్తూ, వొక్కరు మరొక్కరిని, వ్యక్తులుగాగాని, వర్గాలుగాగాని, సంస్థల ద్వారా గాని శోషింపజేసే పద్ధతులు, సంస్థలను విసర్జిస్తున్న సంఘాన్ని నిర్మించు కోవాలి. ఆలాంటి సంఘ పునర్నిర్మాణ ప్రయత్నమే వ్యక్తులను రక్షించగల్గును. ప్రజల స్వాతంత్ర్యముల పెంచగల్గును. అలాంటి పూర్ణ పురుషులు గలిన సంఘమే గాంధిజీ ధోరణిలో పయనించగలునని రంగాజీ విశ్వాసము.

24. స్మృతిచిహ్నం

రైతులు, కూలీల సంక్షేమం కోసం పనిచేయడం విషయమై ఒకసారి గాంధిజీతో చర్చ జరిగింది.

రంగా : భూమి రైతుకు చెందుతుందనీ, తప్పని సరిగా చెందాలనీ మీ రంటున్నారు. రైతుకు భూమి మాత్రమేవుండి రాజకీయాధికారం లేకపోతే అతని స్థితి సోవియట్ రష్యాలోలాగా చాల అధ్వాన్నంగా వుంటుంది అచ్చట రాజకీయాధికార మంతా కార్మిక నియంతృత్వం ద్వారా పూర్తిగా ప్రభుత్వ గతమైపోయింది. ఆ దేశంలో మొదట రైతులకు కొంతభూమిని వుండ నిచ్చారు. తరు వాత ఆ భూమిని గూడ సమిష్టి వ్యవసాయమనే పేరుతో లాగేశారు.

బాపు : సోనియట్ రష్యాలో ఏమి జరిగిందో నాకు తెలి యదు. కాని మనకు ప్రజాస్వామ్య స్వరాజ్యమే వున్నట్లయితే, ఆ స్వరాజ్యాన్ని అహింసాత్మకంగా సంపాదిస్తే రైతు రాజకీయాధికారంతోపాటు అన్ని అధికారాలను పొందుతాడు.

రంగా: వ్యవసాయం చేయని భూస్వాములకుగాని, జమిం దార్లకుగాని భూమి చెందరాదనీ, తుట్టతుదకు జమిందారీ విధానం, అహింసాపద్ధతి ద్వారా తొలగించబడుతుందనీ మీమాటల్నిబట్టి అర్థంచేసు కోవాలా?

బాపు : అవును. ప్రభుత్వంచేత ప్రమబద్ధం చేయబడిన ధర్మకర్తృత్వ విధానాన్నిగూర్చి నేను ఆలోచిస్తూన్నానని నీవు గుర్తించుకోవాలి. అంతే కారణం లేకుండా జమీందార్లనుగాని, మరో వర్గాన్నిగాని వ్యతిరేకించ దలచలేదు.

రంగా : భూస్వామి తమ్ము దోపిడీ చేయలేని విధంగా రైతు వర్తించాలని మీరంటున్నారు. అహింసా విధానం ద్వారా పోరాడడమేగాక; శాసన, పరిపాలనా సంస్కరణల ద్వారానేగాక తమ ఓటుహక్కు ద్వారా భూస్వాముల అధికారాన్ని తగ్గించాలని అర్థం చెప్పుకోవచ్చునా?

బాపు: రైతుకు రాజకీయాధికారం లేనప్పుడు శాసనోల్లంఘనం, సహాయనిరాకరణలను ఉపయోగించవచ్చు. వారికి గనుక రాజకీయాధికారం వున్నట్లయితే సహజంగా శాసనాలద్వారా వారి పరిస్థితే మార్చి వేయబడుతుంది గదా!

కాని రైతుకంత రాజకీయాధికారం రాకపోవచ్చునని నువ్వు అనవచ్చు. దానికి నా జవాబేమంటే ప్రజల చేత అహింస ద్వారా స్వరాజ్యం సాధించ బడితే, అప్పుడు రైతులదే పైచేయి అవుతుంది. శాసనసభలు రైతుల ప్రయోజనాలను రక్షించలేక పోతే వారి చేతులలో శాసనోల్లంఘనం, సహాయ నిరాకరణ అనే ఆయుధాలు వుండనే వుంటాయి.

25. శాశ్వతుడైన బాపూ

ఆంధ్ర కాంగ్రెసు నాయకులు బాపూను 1944 డిశంబరులో కలుసుకొని కిసాన్ - కాంగ్రెసు సంస్థల మధ్య వుండవలసిన సంబంధాలను సరిపెట్టడాన్నిగూర్చి చర్చించిన తరువాత, కొన్ని విషయాలను బాపూ నానుండి తెలుసుకొనగోరారని కుర్షిద్ బేన్ నాతో అన్నది. అందువల్ల నేను 1945 చలికాలంలో సేవాగ్రాంలో వారిని కలుసుకొన్నాను. అప్పుడు నేను మగన్‌వాడిలో సేట్ జే. జమ్నాలాల్ బజాజ్ గారితో వుంటున్నాను.

స్వరాజ్య ఉద్యమాన్ని పటిష్ఠం గావించడానికి కాంగ్రెస్సు అనుసరించదలచిన నిర్మాణ కార్యక్రమంతో నేనెందుకు సంతృప్తి చెందలేదని ఆ సమయంలో బాపూ నన్నడిగారు.

రంగా: బాపూ! మీరే నిర్మాణ కార్యక్రమ పరిధిని విస్తరింప జేస్తున్నారు. మీ రిటీవల వెలువరించిన పత్రంలో విద్యార్థులను, యువకులను, స్త్రీలను, కార్మికులనుగూడ ఆ కార్యక్రమంలో చేర్చారు. నిజానికి ఈ కార్యక్రమం 1920లో సహాయనిరాకరణోద్యమ కాలంలో వున్నరీతిగా వుండడానికి వీలు లేదుగదా

బాపు: నిజమే!

రంగా: చాలమంది కాంగ్రెస్సువారు అభివృద్ధి కాముకులు కారు. స్త్రీలు స్వరాజ్య ఉద్యమంలో చేరాలని

మీ రనుకొన్నప్పుడు అన్నపూర్ణ, కమలాదేవి, సరోజినీదేవిగార్ల ఆదర్శాలు మీ దృష్టిలో ఉన్నాయి. ఉప్ప సత్యాగ్రహంలోనికి వేలాది స్త్రీలను ప్రవేశింపజేసి, మీరు వారిని త్యాగమూర్తులను చేశారు.

బాపు: కాని ధాన్యం, వేరుసెనగ మార్కెట్లకు తమ సరకును రానివ్వకుండా రైతులచేత సమ్మెలు చేయిస్తున్నావని వారంటున్నారు.

రంగా: తప్పుడు తూకాలకు, ధరలలో తప్పుడు తగ్గింపులకు వ్యతిరేకంగా అసమ్మతి తెలపడం తప్పంటారా? నేను మీతో స్పష్టంగా చెప్పదలచుకొన్నాను. నేనిప్పుడు ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలోని మిల్లు యజమానులకు వ్యతిరేకంగా చెరకుఉత్పత్తి దార్ల సమ్మెలను నిర్వహిస్తున్నాను.

బాపు: నీవే ఈ సరికొత్త విధానాలకు కనిపెడుతున్నావా? లేక నీ సహచరులు రూపొందించిన ఆయుధాలను నీ అమ్ముల పొదిలో చేర్చుకొంటున్నావా?

రంగా: రెండు రకాలా.

బాపు: నిర్మాణకార్యక్రమం పేరుతో రంగా తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ అదంతా గాంధేయ మార్గమని చెబుతుంటాడని వారంటున్నారే?

రంగా: అవును బాపూ! వారు ప్రజలకు కావలసిన దానిలో ఏకొద్దిపాటో చేసి తాము గాంధీ యిజానికి విధేయుల మనుకుంటారు. నేనూ, నై తుకూలీ రంగాలలో పని చేస్తున్న నాసహచరులు వారుచెప్పే గాంధీయిజంతో తృప్తిచెందడం లేదు. గాంధేయ మార్గంలో నడ వడమే మా విశ్వాసానికి గుర్తు! దానిని విస్తృత పరచాలని గదా! మాఆకాంక్ష - ప్రజలను సేవించ డంలో కొత్తపద్ధతుల ననుసరించడంపై మీరు ఆంక్షలు పెట్టదలచారా?

బాపు: అంతే నేను చెప్పినంతవరకే చేయాలన్న స్థితిలో మీరు లేరన్నమాట.

రంగా: అవును బాపూ! మీరు మాతో వున్నందుకు దేవు నికి ధన్యవాదాలు! ఇప్పుడు మేము మీ వద్దకు వచ్చి చర్చించి మీ సలహాలను తీసుకోవచ్చు. ఇకముందో? మాకుతోచినమార్గంలో మేము వెళ్ళ డాన్ని మీరంగీకరించరా? మా కార్యక్రమాన్ని నిర్వర్తించడంలో మేము కొన్ని తప్పిదాలను చేయవచ్చు.

బాపు: తప్పని సరిగా మీరు చొరవ తీసుకోవచ్చు. కాని ప్రమాదకరమైన తప్పిదాలను మీరెలా తప్పించ గలరు?

రంగా: మనిషి మనిషిచేత చేయబడే అన్నిరకాలైన దోపిడికి; సంస్థలు ప్రజలను, ప్రభుత్వాలు పౌరులను దోచు

కోవడానికి మీరు వ్యతిరేకమని నా విశ్వాసం. ఈ గీటురాతి నాధారం గావించుకొనే మా వర్కర్లు ప్రజల ఉద్యమాలన్నీ సడుపుతున్నారు. ఉదాహరణకు బ్రిటీషు ప్రభుత్వం విధించిన ఆహార కంట్రోళ్ళనే తీసుకొందాము. అవి, వారి ధాన్యాల రవాణా మీద, వారి గిడ్డంగులమీద, వినియోగం మీద విధించబడ్డాయి. బెంగాలు క్షామానికి అవే కారణం గాదా? రైతులు అధికోత్పత్తి గావించడానికి అవి అవరోధాన్ని కలిగించడంలేదా? అట్టి వాటిని యెదిరించవద్దా?

బాపు: మీరు అట్టి అవరోధాలను యెదిరించే మీ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నారులే!

రంగా: అట్టి స్వాతంత్ర్యమే నాకు కావాలి. అది వుంటేనే మీ రైతులను, దరిద్రనారాయణులను సేవించడానికి సాధ్యమవుతుంది.*

బాపు: సహజానంద సరస్వతి, ఇందూలాల్ యాజ్ఞిక్ నాతో కిసాన్ సభలనుగూర్చి చర్చించాలని అన్నారట. నీకు నా మనస్సు తెలుసునని అందువల్ల ఆ విషయమై నీతో మాట్లాడమని చెప్పి పంపాను.

రంగా: మీకు ధన్యవాదాలు బాపూ.

---

*1976లో, శ్రీ సంజయగాంధి ప్రయోగపరచిన పంచ సూత్రములు యీ విధంగా కాలానుగుణమైన గాంధేయ నిర్మాణ కార్యక్రమమే.
సం.

వారెంతో ఆనందపడ్డారు. ఉల్లాసవంతమైన వారి చిరునవ్వు నన్ను తన్మయుణ్ణి గావించింది. వారు నన్ను తన హస్తంతో స్పృశించారు. వారి మరొక హస్తం చరఖా మీద పనిచేస్తూనే వున్నది.

ఆకాశవాణి - న్యూఢిల్లీ 1.

నేను ధ్యానించుకొనే గాంధీజీ

[జాతీయ కార్యక్రమములో రంగాజీ చేసిన రేడియో ప్రసంగం]

(నవంబరు 30, 1969)

ప్రార్థన లప్పుడు మనకు కనిపించే గాంధిజీయే మన 'బాపు'!

ఇతర సమయాలలో వారు ఇతర గొప్పనాయకుల లాగే వుండేవారు. కాని ఆయన చమత్కార భాషణలలో విజ్ఞతలో; ప్రేమానందాలలో ఇతరులను మించినవారు.

ఆయన ఒకసారి ప్రార్థనకు కూర్చుంటే సాధకుడు, నిర్మలుడు, పవిత్రమూర్తి, బాహ్య ప్రపంచంతో సంబంధం లేక, తన అంతరాత్మలో తాను ఐక్యం 'కాగల్గువారు.

ఒక్కొక్కప్పుడు ఆయన ప్రక్కవుంటూ ప్రార్థనా సమావేశానికి నడిచే అవకాశం నాకు కల్గేది. వేరొకప్పుడు భక్తసమూహం మధ్య చేరుకొనేవాడను. వారు కూర్చున్న తదుపరి, మేము మా స్థలములందు చేరెడివారం. ప్రార్థనా ప్రారంభాన్ని జేగంట సూచించేది!

వారొక స్వర్గవాసియేనే!

మా ప్రార్థనా గీతములతో ఆయన తాళము కలిపే వారు. మా నిశ్శబ్ద ప్రార్థనలలో పాల్గొనేవారు. భక్తులలో ఆయనొక భక్తుడు.

ఆయన ధ్యానోపాసనలో ఉన్నప్పుడు - బలహీను డుగా మూడు అడుగుల ఎత్తెగల వృద్ధుడేకాదు, ఆయన స్వర్గం నుండి అవతరించిరా అనిపించే దివ్యమూర్తిగా నాకు చాల సార్లు అన్పించేది.

వారి నప్పుడు చూస్తుంటే, ఈ పుస్తకంలోనే చెప్పి నట్లుగా ఆయన స్వర్గపు టంచులను తాకుతున్నారనీ, ఆయన భుజములు ధ్రువములవరకు వ్యాపించినవనీ, ఆయన ముఖం సాయంసంధ్యవలె అందంగా వున్నదనీ నాకుతోచేది. ఆ బాపుజీయే ప్రజలను ఉత్తేజపరచిరి. వారిలో రాజకీయ చైతన్యము మేల్కొలిపిరి. వారి మనసులను జాతీయ తత్పరత, అభిమానములతో పెనవేసిరి.

కనుకనే, నేను యింకా బలముగా, ధైర్యముగా పెరుగుతున్నానని నమ్మకొను చుంటిని.

నేను ప్రతిరోజు ప్రార్థన చేయునప్పుడు ఆ బాపును గురించి ఆలోచించుచుందును. ఆ పాటల మాధుర్యము నా చెవులలో ప్రతిధ్వనిస్తూనే వుంటుంది.

గాంధిజీ హరిజనోద్ధరణకు, వారి ఆలయ ప్రవేశము నకు అస్పృశ్యతా నివారణకు ఖాధీ, మద్యపాన నిషేధము, గ్రామీణ పరిశ్రమలు, సహాయ నిరాకరణ, స్వాతంత్ర్యో ద్యమములలో వారుపలుసారులు సంచారము చేసిరి. రాజ కీయంగా, సాంఘికంగా; స్పందించునట్లు అన్ని ప్రాంతా లలో ఆయన చేసిన పర్యటనలు సాటిలేనివి. ఆయన బోధ నలు ఈ గ్రామీణ దేశంపై చెరగని ముద్రవేసినవి.

మూడు నాలుగు తరాల ప్రజలు తమతమ గ్రామములలో వారిని చూచు అదృష్టము పొందిరి. వారి వారి తల్లిదండ్రుల ద్వారా, బాపుజీవారిగ్రామములను సందర్శించిన కథలను, వారి ఉత్సాహకరమైన, ప్రబోధపు పలుకులను గూర్చి యీనాటి విద్యార్థులు, యువకులు తెలుసుకొనుచున్నారు.

అదొక మహత్తరావకాశం

ఆయన మావూరు - నిడుబ్రోలునకు 1928 లోను, 1933 లోను వచ్చిరి. అది మాకొక గొప్ప అవకాశము. మా గ్రామస్థులతోపాటు ఆయనను కలుసుకొనుటకు నేను, నా భార్య శ్రీమతి భారతీదేవి మద్రాసునుండి 1928 లో వచ్చితిమి.*

గాంధీజీ మాయింటికి వచ్చి మా పూలమాలలు, విడాళము స్వీకరించినందుకు మా తల్లి మంగమ్మగారు తన కొడుకును జూచుకొని తన్ను గురించి చాల గర్వించిరి. అదే విధముగా గాంధిజీని దర్శించిన భాగ్యము పొందినందులకు ప్రతి గ్రామములోని ప్రతి కుటుంబం గర్వించినది.

హెచ్చుమంది ప్రజలు ఆయన హిందీ మాటలను అర్థము చేసుకొనలేకపోయిరి. కాని అది వారి నేమీబాధించ లేదు. ఆయన వారి మధ్య నుండుటన్నదే వారికి తృప్తి! వారి సందేశము స్వరాజ్య మంత్రమని, బాధితులగు ప్రజ

---

* అప్పుడు రంగాజీ మద్రాసు విశ్వవిద్యాలయపు పచ్చయప్ప కళాశాలలో ప్రధానాచార్యులు.

లకు ఆదరణ కల్గించునదని, అణగద్రొక్కబడిన వారికి ప్రోత్సాహము, బాధలనుండి విడుదల కల్గించునదని వారు విశ్వాసము పొందుచుండిరి. జీవనోపాధి కల్గించు ఖద్దరు ఉత్పత్తిలాంటి ఉద్యోగము, నిలువనీడ, భోజనము, బట్టలు, మానసిక వికాసము ఎన్నోరకములుగా ప్రజలను కొల్ల గొట్టువారినుండి స్వేచ్ఛ సంపాదించుటకు వారు పూను కొన్నారని ప్రజలు నమ్ముకున్నారు. దీనులు నిరాభగ్యులగు ప్రజాసామాన్యానికి పలుమార్లు శ్రీరామునివలె అన్ని మత ములందలి ఋషులవలె తమ జాతీయ వృత్తుల ధర్మమును ఆత్మగౌరవముతో పాటించుమని బాపూజీ నిండైన విశ్వా సముతో బోధించెడివారు.

వేలకొలది ప్రజలు వారు నడచుచుండిన, లేదా కారులో ప్రయాణించుచుండిన మార్గములకు యిరుప్రక్కల చేరుచుండిరి.

వారు చెప్పుచుండిన పల్కులను, అభిప్రాయములను ఈ రోజువరకు ప్రజలు ప్రేమతో, గౌరవముగా తలచు కొనుచుందురు. మననము చేసుకొనుచుందురు. ఉదాహర ణకు ఒక పసిబిడ్డ గాంధిజీకి సమర్పించిన బంగారు నాణె మును గట్టిగా పట్టుకొనుట చూచిన గాంధిజీ 'పట్టుకొనుట గాక యివ్వడము నేర్పు'మని ఆ పసిబిడ్డ తాతకు చెప్పినారు.

ఒకసారి ఆయన నన్ను "మనీ" అనే యింగ్లీషు మాటకు తెలుగుమాట అడిగి తెలుసుకొన్నారు. మద్రాసులు విజయవాడకు వచ్చిన తరువాత ఆయన చేయిజాపి "డబ్బు, డబ్బు!" అని మంత్రంవలె అనసాగిరి. ప్రజలు ఆమాటలు విని

ఉల్లాసపడి వారి దగ్గరవున్న డబ్బు అంతా ఇచ్చుటకు ముందుకు రాగా, వారిని జూచి హృదయ పూర్వకంగా నవ్వారి. అలా వసూలైన డబ్బు కొన్ని వేలయినది.

బుద్ధునివలె నే!

వారు ప్రజలను ఏ విధముగా వేరువేరు ప్రదేశములలో తన సందేశములను మృదువైన స్వరముతో పల్లుల ద్వారా - (ఆనాటి బుద్ధభగవానునివలె) - పలికిడివారు. ఎందరో ప్రజలు వారికి గాంధిజీతో కల్గిన అనుభవములను గూర్చి నేను దేశసంచారము చేయునపుడు నాకు చెప్పెడి వారు.

శ్రీరాముని పాదయాత్రల ద్వారా పవిత్రమైన ఈ దేశములో గాంధీజీ పాదయాత్రలు మరల ఒకసారి అంతకు మించిన సమతా ధర్మమనే బంగారు బీజములను మానవకోటి హృదయాలలో వెదజల్లినారు.

గాంధీజీకి హిందూమత శాస్త్రములందు, వేదములందు నమ్మకమున్నది. కాని ఆయన మానవత్వమున కంటే అవి గొప్పవని అంగీకరించరు. పండితులు అస్పృశ్యతకు అనుకూలముగా శాస్త్రాలను ఉదహరించగా ఆయన ఉద్రేకముతో వారిని వ్యతిరేకించెను. 'ఏ పురాణమతము నైతే వారు అంటరానితనాన్ని బలపరచుటకు ప్రమాణముగా నెంచెదరో అది హిందూమతము కానేర'దని ఆయన చాటి చెప్పిరి. "లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" అను ఆత్మీయమైన ప్రార్థనను ఆయన విశ్వసించెడివారు. ఆయనకు సర్వ

మత సహనమందు నమ్మకము. మతాచారములను పాటించుటలో మహమ్మదీయుల హక్కులను రక్షించుట కొరకు చాలసార్లు ఉపవాసములతో ఆయన తన ప్రాణములనే పణముగా పెట్టెడివారు. స్వయం ఉద్యోగముతో - అది కూడ స్వయంవృత్తి ద్వారా ప్రజలు తమ స్వశక్తిమీద నమ్మకము పొందుదురని, ఆర్థిక స్వాతంత్ర్యమును పొందగల్గుదురని ఆయనకు తెలుసు. కనుకనే ఆయన కుటీరపరిశ్రమలను, చేతిపనులను, అందు ముఖ్యమైన ఖాదీని పెంపొందించిరి. ప్రచారముచేసిరి. ఆయన పూర్తిగా ఖాదీలో నిమగ్నులైనను మిల్లు దారముతో చేనేత వస్త్రములు నేసే వారిని నిరుద్యోగమునుండి రక్షించుటకు పూనుకొనిరి. మేము పెంచుచున్న చేనేత కాంగ్రెసును అభిమానించిరి.

శ్రమించు రైతు ఆయన కంటిపాప

శ్రమించురైతు ఆయన కంటిలోని పాప యంతటి ప్రేమపాత్రుడు, సన్నిహితుడు. తన దృష్టికి తేబడిన ప్రతి సాంఘిక సూత్రము, రాజకీయ ఘోరణుల ఉపయోగము ఎంతటిదో కనుగొనుటకు, అది యెంతగా రైతునకు రక్షణ కల్గించునో లేక కష్టములు కల్గించునో అనే పరీక్షచేస్తూ వుండేవారు.

స్వయంవృత్తి స్వశక్తిపైన నమ్మకము పెంపొందించు నంతకాలము రైతుల మధ్య సహకారోద్యమమును బలపరచవలెననిరి.

వ్యక్తుల స్వార్థపరత్వాన్ని సమాజపు అన్నివిధమైన స్వార్థపరత్వాన్ని, యితరులను శోషింపజేయు కార్య

ములను - ఆయన వ్యతిరేకించెడివారు. కనుకనే ఆయన మన జమీందారీ విధానమును, బానిసత్వమును నిర్మూలించుటకు అంగీకరించిరి.

అణగిపోయిన మన పేదరైతు కూలీల భుజములపై అన్యాయమైన, శిస్తులబరువులు మోపుట భరించలేకపోయిరి. కనుకనే ఉప్పుపన్నును, భూమి శిస్తును ఆయన యెదిరించిరి. తాము పండించిన ధాన్యమును మార్కెట్టులో యథేచ్ఛగా అమ్ముకొనుటకు అడ్డంకు కల్గిస్తుంది కనుక, గిట్టింపు ధరలు అందకుండ చేస్తున్నవి కనుక, కంట్రోళ్ళను గాంధిజీ యెదిరించిరి. కంట్రోళ్ళవల్ల రైతులు నిర్బంధింప బడుదురని, ఉద్యోగులు లంచగొండులగుదురని, బ్లాకు మార్కెట్టులు పెరుగుననీ, భోక్తలగు బీదవారు కొనవలసిన ధాన్యాల ధరలు పెరుగుననిగూడా వారు కంట్రోళ్ళను వ్యతిరేకించిరి. ఆలాంటి పీడితులగు రైతులను షావుకార్లనుండి వర్తకుల నుండి రక్షింపదలచిరి. కనుకనే రాజాజీ ప్రకటించిన రైతుల ఋణాలపై మారటోరియము (వాయిదావేయడం)ను, కాంగ్రెసు ప్రభుత్వము సాధించిన రైతుఋణ విమోచన చట్టములను హృదయ పూర్వకముగా బలపరచిరి.*

---

* 1936లో రంగాజీ రైతురక్షణ సంఘము, సభలు, యాత్రలు సాగించి రైతాంగ ఋణాలమీద "మారటోరియం" ప్రకటించమనిరి. 1976లో యిరవై సూత్రములలో దీనిని వ్యవసాయ కూలీలకు వర్తింప జేయగల్గిరి. 1976 నాటికి మాత్రము ప్రభుత్వము దాక్షిణాత్య రాష్ట్రా లన్నిటిని ఒక జోనుగా ప్రకటించి ఆహారధాన్యాల కంట్రోళ్ళను సుళువుగా చేయించగల్గిరి

జమీందారీ విధానము రద్దయినప్పటికీ, కౌలుదార్లగు రైతులను తమ భూములను స్వయంగా సాగుచేసుకొనని పట్టాదారులనుండి రక్షించాలనే గాంధీజీ తలంపు. ఐదు లేక పది సంవత్సరాల నిలకడైన సాగు గడువు యిప్పించడం, మక్తాధాన్యం సుళువైన గిట్టింపు రేట్లకు నిర్ణయించడం ద్వారా కౌలుదారులకు రక్షణకోరిరి. ఐనప్పటికి, ఆలాంటి పట్టాదారులకు న్యాయంగా అందవలసిన కౌలు మొత్తమును రద్దు చేయదలచలేదు. వారే తమ భూములను స్వయముగా సేద్యము చేయదలచినచో, అట్టి హక్కునుగానీ, ఆ భూమి పట్టాగాని రద్దు చేయరాదనిరి.

అన్నిటికి మించి, లేక, ఏది యెట్లయినా, స్వయం వృత్తి హక్కును, రైతాంగ పట్టా హక్కును రక్షించడమే వారు కోరినది.

పారిశ్రామిక కూలీలకు తగినంతకూలి, శ్రమించుటలో గౌరవాత్మకమైన, శ్రామిక రక్షణతో కూడిన సౌకర్యము లతో మాత్రమే వారు తృప్తిపడలేదు. ఆయా పరిశ్రమ లలో అందు లాభాలలోనూ, యాజమాన్యపు పెత్తనాల లోనూ, పారిశ్రామిక శ్రామికులకు తగిన భాగస్వామ్యమును కోరిరి. ఎంతెంతకూలీ, భత్యములు-యజమానులు, కూలీలు ఉభయత్రా జరుపుకొను సంప్రదింపుల ద్వారా నిర్ణయించ వలెను. శ్రామికులను శోషింపజేయుటకు వీలుగాని విధంగా ఆ నిర్ణయాలు చేయవలెను.

భారతదేశపు స్వాతంత్ర్యమును శాంతియుతంగా సంపాదించుటలో ఎంతటి సామర్థ్యము, రాచకీయ వివేకము

ప్రదర్శించిరో ప్రపంచాని కంతటికి తెలిసినదే! యుద్ధానం తరం, ఆఫ్రికా, ఆసియాదేశాల ప్రజల స్వాతంత్ర్యయోధు లకు గాంధీజీ రాచకీయ విజ్ఞత, దూరదృష్టితో కూడిన నాయకత్వము మార్గదర్శనమైనవి గదా!

మార్టిను లూథరు కింగు అనే అమెరికా నీగ్రో నా యకులు, ప్రపంచాన్ని గాంధేయస్ఫోరణిలో (ఉప్పు సత్యా గ్రహపు యాత్రలాగా) నీగ్రో బిడ్డలకు తెల్ల వారి బిడ్డలకు సమానంగా విద్యాబోధ, విద్యాలయాల ప్రవేశం కోరుతూ, శాంతియుతంగా మార్చి చేసినప్పుడు గాంధిజీ విజయులైరి. ఆ స్ఫోరణిలో విశ్వాసము భారతీయులకు వుండుటవలననే, బుద్ధభగవానుని 2500 సంవత్సరముల "పరినిర్వాణ" ఉత్సవ మును భారతీయులందరు ఉత్సాహముతో జరుపుకొన్నారు. దయ, ప్రేమ, పరస్పర సేవాకాంక్షలుగల మానవత్వమందు దేవునికి నమ్మకము వుండువరకు, సర్వసృష్టియెడల దయ, సర్వులకు స్వేచ్ఛ, స్వరాజ్యము, మానవత్వములకై జీవిం చిన మహాత్ములు చిరంజీవులే! అవును, చిరంజీవులె!

నేనే రక్తసిక్త మగుచున్నాను

పాకీస్తాన్ ఏర్పడడం, అటువారు యిటువారు, కుతాల వారీగా లక్షలాదిగా వలసపోవడం, పదుల వేలమందిని అక్కడా, యిక్కడా నిర్దయులైనవారు చంపడం, హింసిం చడం, రెండు దేశాలు చూచి, దుఃఖించక తప్పలేదే!

---

* "కొంగ్రొత్తగా జనించు బిడ్డల ద్వారా, మానవులలో తనకింత విశ్వాసమున్నదనే భగవానుని సందేశము" అన్నారు రవీంద్ర కవివరులు

కనుకనే మహాత్ముడు భరింపజాలనంతటి దుఃఖమును పొందిరి. ఇంకా యీ దేశాల యిట్టి నైపరీత్యపు హత్యా కాండల చూస్తూ జీవించుచుండుటకువారికి భారమైపోయినది.

ఆ బాధనుండి మహాత్ముని విముక్తి కల్గించుటకా అన్నట్లు రక్తపిపాసకులగు కొందరు మతోన్మాదులు వారిపై బాంబుల విసరుటకు సాహసించిరి.

ఆ 1948 జనవరి 30 తేదీ మనదేశపు, ప్రపంచపు చరిత్రలో గొప్ప దుర్దినము. మన బాపుజీ ఆనాడే కను మూసిరి. ఐనా వారే విజయులు. వారెల్లప్పుడు విజయులే నని నా నమ్మకము. ఆ నమ్మకాన్నే అఖిల ప్రపంచ విజ్ఞాన వేత్తలు, గాంధేయులు చేరివున్న యునెస్కో (United (Nations Social and Cultural Organisation) వారు పారిసు నగరంలో నడిపిన సభలో (1969 సెప్టెంబరు) ప్రకటించితిని.

వివిధంగా 560 పైగావుండిన స్వదేశ సంస్థానాలను భారతదేశ రాజ్యాంగమందు సర్దారు పటేలు శాంతియుతంగా చేర్చగల్గినప్పుడు (1957-59) మహాత్ముడు విజయుడైరి.* ఆటంబాంబులతో యుద్ధ ప్రయత్నమునుండి అమెరికా ప్రెసిడెంటు కెన్నడీ, రష్యా ప్రధాని క్రుశ్చెవు వెనుకంజవేస్తూ, కూర్చాలో ఆటంబాంబు ప్రయోగశాలను రద్దు చేసుకొన్నప్పుడు గాంధిజీ విజయులైరి. శ్రీ మార్టిను

---

* రాజాజీ, గాంధిజీ శాంతి మిషను వారి ప్రబోధంపై ఆటంబాంబుల కవాతుల నాపుకొని, అటంభూమి ప్రజలను ఆవరించనట్లు చేయుటకై రష్యా, అమెరికా, యింగ్లండు, తదితర దేశాలు తోపులాడం చేసుకున్నప్పుడు కూడా గాంధీజీ విజయం పొందిరి. సం.

లూథర్ కింగు హృదయాన్ని ఉత్తేజపరచిన రంగుజాతుల పౌరసత్వ సంపాదనా యాత్రల ద్వారా, గాంధీజీ ధోరణి ప్రపంచము నందంతటా, మానవుల హక్కు-లు స్వాతంత్ర్యములను సంపాదించుటకు, రక్షించుటకు పూనుకొన్న స్వాతంత్ర్య యోధులను ఇప్పటికీ మున్ముందుకు సాగిపోవుటకు ప్రోత్సహించుచున్నదిగదా - గాంధీజీ చేసినబోధ, చూపిన మార్గము! అటులే, వియత్నాములో బౌద్ధాచార్యులు, చెకోస్లోవేకియాలో కమ్యూనిస్టులైన దేశభక్తులు ఆత్మాహుతి చేసుకొంటూ, తమ తమ దేశాల ప్రజల స్వతంత్రతముల రక్షించుకోజూచుట గాంధీజీ ధార్మిక మార్గము ననుసరించుటయేగదా!

ఏ విధమైన భరింపరాని అధర్మాన్ని ఎదిరించాలన్నా ఇతరులకు అత్యంత బాధ కల్గించక శాంతియుతంగా తమ్ము తామే ఆహుతి చేసుకొంటూ, స్వార్థ త్యాగులైన వారు వ్యవహరించాలి. కనుకనే, స్వరాజ్యము వస్తున్నప్పుడు, వచ్చిన తరువాత, వివిధమతాల ప్రజల మధ్య చెలరేగిన, ద్వేషభూయిష్టమైన హింసాకాండలు తత్ఫలితమైన దుర్మరణాలు చూచి, గాంధీజీ గాఢమగు బాధ నొందిరి. భారత దేశపు విభజనను అతితీవ్రంగా వ్యతిరేకించిరి. 'పాకిస్థాను యేర్పడ్డందువల్ల మతద్వేషాలు, కలహాలు సమసిపోవు. దేశవిభజనవల్ల అగ్నిపర్వతం లోలోపల రగులుకొనుచునే యుండును. పోను పోను, హిందూ మహమ్మదీయ వైషమ్యములు పెరుగుచునే యుండును. పైగా వేర్వేరుగా వుండే ప్రయత్నాలచేత బలపరచబడును. ఆ దౌర్భాగ్యము కలుగ

కుండునట్లు చేయుటకే, జిన్నాగారిముందు తానెంతో వినయంగా, 'అంత దారుణమైన, దేశవిభజనను కోరుకోవ' ద్దంటూ ప్రాధేయపడిరి. కాని, ఫలితములేదాయె! తానే ఓడిపోయె. పాకిస్థానే ఉద్భవించె. *

---

* ఆ పిమ్మట ఆపాకిస్తాను నాయకులు ఇప్పటికి మూడు సారులు భారతదేశంపై దండెత్తి వచ్చిరి. తూర్పు పాకిస్థానీయులపై దారుణమగు హత్యాకాండ జరిపిరి. తుదకా పాకిస్థానే రెండు ముక్కలై పోయిందిగదా!

సం.

పారిస్‌లో - మహాత్మాగాంధి శతజయంతి సెమినార్‌లో - (1969 సెప్టెంబరు)

గాంధిజీ శతజయంతి ఉత్సవాలలో రంగాజీని యిథియోపియా, సుడాను, యీజిప్టు, ట్యునీసియా, ఆల్జీరియా, స్పెయిను, ఫ్రాన్సు, ఇంగ్లాండులలో గాంధిజీ సందేశముల ప్రచారము చేయుటకు, ఆ దేశాల ప్రజలు సాగించు గాంధిజీ సంస్మరణోత్సవములందు పాల్గొనుటకు, అఖిలభారత గాంధిజీ శతజయంతి సంఘమువారు రంగాజీని ఆహ్వానించిరి. సుడాను, యీజిప్టు, స్పెయిను, ఫ్రాన్సులలో టెలివిజను వారికి రంగాజీ ఇంటర్వ్యూలు యిచ్చిరి. పారిసులో జరిగిన 90 నిమిషాల టెలివిజన్‌లో "బాపుజీ, స్వయం వృత్తులందుండు రైతాంగము, చేనేత, చేతివృత్తుల వారే సోషలిజము సమతా ధర్మము త్వరితంగా అందుకొనగలరని గాంధీజీ సందేశము" అని రంగాజీ పల్కిరి: ఆ ఘంటానినాదమును ఫ్రెంచి సోషలిస్టులు ప్రతిధ్వనించిరి. సం.

గాంధిజీ అహింసా సిద్ధాంతము చైతన్యవంతమైనదే నని యీ సభలో కొందరు పెద్దలు సరిగానే చెప్పినారు. కొందరు 'గాంధీజీ సంఘదృష్టిలేని, వంటరితనాన్ని అభిలషించేవాడు' (Individualist) అంటూ ఆశ్చర్యపరచినారు. నా ఉద్దేశంలో గాంధి వ్యక్తికి, సంఘమునకు తగిన ప్రాముఖ్యత నిచ్చే ప్రజానాయకుడు. అహింసను తాను పాటించడమే కాక, పూర్తిగా అహింసావాదులుకాని చాలమంది ప్రజలను తన సత్యాగ్రహం ద్వారా అహింసాపద్ధతిని అవలంబించుటకు శిక్షణ నిచ్చినారు. అందువల్లనే లక్షలాది

ప్రజలు సత్యాగ్రహోద్యమములందు (1930-33, 1940-44) పాల్గొనగల్గిరి.

గాంధీజీ సహాయ నిరాకరణోద్యమమునకు ఒక చైతన్యవంతమైన సిద్ధాంతము, ధోరణి, పంథా ఉన్నవి. ఆయన శాసన సభలతో సహాయ నిరాకరణ చేయమని, 1920 లోని ఎన్నికలను బాయ్‌కాట్ చేయుమని భారతీయులను కోరిరి. తిరిగి ఆయనే 1934 లో కాంగ్రెసు వారు కౌన్సిళ్ళకు పోవుటకు అంగీకరించిరి. ఆ పిమ్మట 1946 లో కాంగ్రెసు శాసన సభల ద్వారా అధికారము సంపాదించుకొనుటకు సమ్మతించిరి. అన్ని పరిస్థితులలోను వారి సహాయ నిరాకరణోద్యమము ఒకే విధంగాలేదు.

గాంధిజీ బౌద్ధమతమునుండి ఎంత అందుకున్నారని అడుగుచున్నారు. ఐతే ఈనాడు బౌద్ధమత బోధ తొలగిస్తే హిందూమతంలో మిగిలేది యేమి అని అడుగుదామా? హిందూమతము చాలభాగము ధర్మనియమములమీద ఆధారపడివున్నది. బౌద్ధ మతాన్ని హిందూమతము తనలో కలుపుకొన్నది. వారికి బౌద్ధము, వేదాంతము, ఉపనిషత్తులు ప్రమాణమే.

గాంధిజీ హిందూమతములోనే పాదుకొనిపోయినారా? కాదే! ఉదాహరణకు ఉపవాసమునే తీసుకోండి, దానిని తన తల్లిదగ్గర నేర్చుకొంటినని ఆయన తన జీవితచరిత్రలో చెప్పారు. ఈ ఉపవాసము అన్నది హిందువులకే ప్రత్యేకతా? మహమ్మదీయులు, క్రైస్తవులు ఉపవాసము

చేయరా? అన్నిమతముల ప్రజలు ఆత్మ పారిశుద్ధ్యము కోరినపుడు లేదా వారి స్నేహితులకు, బంధువులకు హృదయాన్నత్యము, పరిశుద్ధత కోరినపుడు వారు ఉపవాసమును సర్వసామాన్యమైన సాధనముగా ఆచరించుచుందురుగదా!

తరువాత అహింస అనే ప్రశ్న వచ్చినది. గాంధిజీ అభిప్రాయములకు, వీరిలాంటి గొప్పవారి అభిప్రాయములకు దేనిలో భేదం? గాంధిజీ సిద్ధాంతములు - వికసించిన పరిసరముల, పరిస్థితుల స్థితినిబట్టి ఉన్నవని కొందరు చెప్పినారు. ఇది కొంతవరకు నిజమే! ఐనా వియత్నాంలోని బౌద్ధులు ఆత్మాహుతి గావించుకొన్నారు. చెకొస్లవేకియాలో కమ్యూనిస్టు యువకుడు ఆత్మాహుతి గావించుకొన్నాడు. కాబట్టి ఆహింస అనునది భారతదేశమునకే పరిమితమైనదికాదు. అంతేకాదు, ఏ ఒక్క మతమునకు చెందినది కూడా కాదు.

గాంధిజీ వివిధములైన పరిశోధనల ద్వారా తాను నడిపిన ఉద్యమాలద్వారాప్రజలుకనుక అహింసా వాతావరణమునకు, ధోరణికి సిద్ధమైతే అహింసను వ్యక్తులు, గ్రూపులు, సమూహములు, ఆపైన ప్రజలందరిచేత ఆచరింప చేయవచ్చని నిరూపించినారు. వారి అహింసా ధోరణిని ధార్మిక నియమముగా తీసుకొన్నవారిని - రాజనీతి సాధనముగా తీసుకొన్నవారినుండి వేర్వేరుగా నిరూపించిరి. వ్యక్తిసత్యాగ్రహులంతా అహింసను ధార్మికవ్రతముగా ఆచరించాలన్నారు. కాని గొప్ప ప్రజాఉద్యమాలలో చేరిన

వారు అహింసను వ్యవహారికముగా ఆచరించుటకు అనుమతించిరి. కాబట్టి గాంధిజీ అహింసాసూత్రము, ధీరణి చైతన్యవంతమైన సిద్ధాంతమే గాక వేరువేరు దశలలో ఆత్మవికాసమునకు వ్యవహారముల సాధించు సాధనము, ఆయుధముగా ఉపయోగపడినది. గాంధిజీ నాయకత్వము లోను అటు తరువాత నేను, మాలాంటి వారు సాగించిన సాముదాయక, వ్యక్తి సత్యాగ్రహముల అనుభవము దృష్ట్యా, అహింసావాదము చాల ఉపయుక్తమైనదని నేను చెప్పగలను.

బ్రిటిషువారే కనుక మొత్తముమీద మానవతావాదులు, క్రిస్టియనులు కానిచో భారతదేశంలో అహింస యింతటి యిలాంటి అద్భుతమైన ఫలితములను అందుకోగల్గేదా? అటు అమెరికనులు క్రైస్తవులుకానిచో ఆత్మాహుతి గావించుకొన్న బౌద్ధసన్యాసులు పొందిన విజయము అంతతొందరలో, అంతవరకు సాధించగలిగేవారా?* ఇట్టి ప్రశ్నలుండనేవున్నవి.

ఈనాటి ప్రపంచములో యజమానులు, కూలీల మధ్య కల్గు స్పర్ధ, విరోధములు ముఖాముఖిగా చెలరేగుచున్నవి. ఈ ప్రతిష్టంభన, వైమనస్యము ధనికులకు చెందిన పెట్టుబడి

---

* వియత్నాం వారిని అంతదారుణ హింసాకాండకు గురిచేసినదికూడ అమెరికావారేనే! క్రైస్తవులేనే? నాజీలైతే ఆ మాత్రంగానైనా, చివరకు మానవత్వాన్ని అంతవరకైనా గుర్తించేవారా? అహింసావాదులు హృదయ రహితంగా వుండజాలరుగదా. సం.

దారీ విధానముగాగాని జాతీయ ప్రభుత్వపు పెట్టుబడి దారీ విధానముగాగాని చూచిన యజమానులు, కార్మికులనే రెండు బలగముల మధ్య పరస్పర స్పర్ధ చెలరేగుచుండుట కాదనలేము. దానిని పరిష్కారము లేక సర్దుబాటు చేయుట యెట్లు? ఒకమార్గము సోవియట్ రష్యాలోవలె, ఇంకొక విధం ఇంగ్లండులోవలె*, వీటిమధ్యగా యుగస్లేవియాలో ఆ వైరుధ్యమును జయించుటకు - వారు తమ సొంతంగా ప్రయోగిస్తున్న సెమీ కమ్యూనిస్టు, సెమీ మానవతా వాదము ద్వారా - సామరస్యము, సహకారము సాధించ ప్రయత్నము చేయుచున్నారు.

గాంధిజీ దృష్టిలో ఈ పారిశ్రామిక వర్గములమధ్య చెలరేగు స్పర్ధను పరిష్కరించుటకు రెండు మార్గములున్నవి. వారు ఒకరితో మరొకరు ఆలోచించుకొని చర్చించుకొని, రాజీపడుట ఆ తీర్పును, ఆయాపార్టీల ద్వారాగాని, అవి విఫలమైనచో గవర్నమెంటు ద్వారాగాని ఆచరణలోనికి తెచ్చుకొనవచ్చును. అంటే రెండుపక్షాల మధ్య రాజీ! అది సాధ్యము కానప్పుడు మూడుపక్షములు (యజమానులు, కార్మికులు, ప్రభుత్వము చేరి సాధించు పరిష్కార పద్ధతిని అంతర్జాతీయ కూలీల సంఘము (ILO) అవలంబిస్తున్నది.

గాంధిజీ ట్రేడ్ యూనియనిస్టుగా అహమ్మదాబాదులో కార్మిక సంఘమును 1918 లోనే ఏర్పరచినారు. కార్మికులు

---

*రష్యాలో ప్రభుత్వపు నిర్ణయం శిరోధార్యం. ఇంగ్లండులో యిరు పక్షాల మధ్య వొడంబడిక.

సమ్మెచేయుటకు నిశ్చయించుకొనగా ఆయన వారిని బలపర చారు. కాని యజమానుల ప్రోత్సాహాముచల్ల కొందరు కార్మికులు సమ్మెనుండి విరమించుకొనుచున్నప్పుడు, వారిని తిరిగి కార్మిక బలగాలలో చేర్పించుటకై సత్యాగ్రహము చేసిరి. ఆయన అట్లు ఉపవాసము చేయడం ద్వారా, యితర ప్రశామికుల సత్యాగ్రహము ద్వారా, పెట్టుబడిదారులు ప్రశామికులతో ధార్మిక మగు ఒడంబడికకు వచ్చునట్లు చేసిరి. ఆ సూత్రము (Tripartite Agreement) నే ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసువారు యిప్పుడునూ అనుసరిస్తున్నారు.

ఈవస్తు, విషయ ఉత్పత్తుల నిర్వహణములో మరొక దృష్టి, ధోరణినుండికూడా ఉత్పత్తిదారుల పరస్పర సంబంధములను చర్చించుకోవాలి! ప్రపంచమంతా యెప్పుడూ యజమానులు - కార్మికులనే వేర్వేరు వర్గములు, వారి మధ్య చెలరేగు స్పర్ధ, వైరుధ్యములలోనే పయనించవలెనా? స్వయంవృత్తికలవారికి ఎవరైతే తమకు తామే యజమానులో, ఎవరైతే తమ స్వంతశ్రేయస్సుకోసం, సమాజపు శ్రేయస్సుకోసం పనిచేస్తారో (Self employed Toilers) అట్టి వారికి సంఘములో తగు స్థానము, స్వంత ఉద్యోగులు ఆర్థిక స్వాతంత్ర్యము అనుభవిస్తున్నారు గదా! పాశ్చాత్య దేశాలలో కూడ ఇప్పటికీ కొందరు స్వయంవృత్తికలవారున్నారు. కాని హెచ్చుగా కూలికి పనిచేసే విధానమునకు యజమానులు, కూలీలనే పరస్పరంగా స్పర్ధతో కూడిన విధానమునకు - పాశ్చాత్య ప్రజలు అలవాటు పడ్డారు. స్వయం

వృత్తినుండి బైటపడిరి. కాని అదృష్టవశాత్తు ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికాలలో అటుల జరుగలేదు. కమ్యూనిస్టు దేశమైన యుగస్లేవియాయే స్వయంవృత్తికలవారిని బలపరచుటకు, స్వంత ఉద్యోగులను వృద్ధిపరచుటకు ప్రయత్నించుచున్నది. ఆ దేశములో చాలమంది కళాకారులున్నారు. వారంతా సహకారసంఘములుగా ఏర్పడినారు. వారికి అన్నివిధములైన ప్రభుత్వ సహకారము అందుచున్నది. కాని ఇంగ్లండులో అమెరికాలో స్వయంవృత్తికలవారిని ప్రభుత్వములు నిరుత్సాహ పరచుచున్నవి. ప్రతివారిమీద ప్రభుత్వపు కంట్రోలు కావాలనుకొంటున్నారు. స్వయంవృత్తి కలవారు ఆర్థిక స్వాతంత్ర్యమును హెచ్చుగా అనుభవిస్తున్నారు. కూలితనపు నిరుత్సాహం, బాధ్యతా రాహిత్యములనుండి విడుదలగుచున్నారు. ఉత్పత్తి పెంచుటకు వారి ఉత్సాహము పెల్లుబుకుట, పనితనము ప్రదర్శించుట, వృత్తిలో ఆత్మ గౌరవము పొందుట, స్వంత ఉద్యోగులకు, స్వయంవృత్తిదారులకు సహజముగదా! స్పర్ధలకు వారిమధ్య తావులేదుగదా!

భారతదేశంలో కోట్లకొలది స్వయంవృత్తిగలరైతులు, చేతివృత్తులవారు యిప్పటికీ ఉన్నారు. భారత రైతులలో హెచ్చుమందికి ఒకటినుండి అయిదు ఎకరము లున్నవి. ఎక్కడైతే రైతాంగ వ్యవస్థ వుండునో అచ్చట స్వయం ఉపాధి ఉండును. ఈ స్వయంవృత్తిలో, రోజువారీ కూలీవిధానమునందున్న యజమాని - కూలీల సంబంధ మందుగల వైరుధ్యము, ఎడతెగని స్పర్ధలులేవు. కనుక

స్వయంవృత్తి యితరుల దోపిడికి లోనగుటకు అవకాశ మివ్వదు. కష్టజీవుల శోషింపచేయు విధానమునకు తావం తగా యివ్వనిది. స్వయంవృత్తిగల రైతులు ప్రతపనికి కూలీలను ఎక్కువగా పెట్టుకోరు. సంవత్సరం మొత్తము మీద ఎక్కువ సారులు ఎక్కువమంది కూలీల అవసరం వారికి కలుగదు. కొన్నిదఫాలుమాత్రం కోతలు నూర్పిళ్ళ సమయాలలో రోజుకు 20-50 మంది కూలీల సహకారము పొందుతారు. ఈ వ్యవసాయ కూలీలను శోషింపచేయ కుండా వుండుటకై తగు రక్షణశాసనాలను, వ్యవహార మార్గ ములను అన్వేషించవచ్చును. అందుకే కనీసపు వేతనాల నివ్వ మని, సౌమనస్యముగా, సోదరుల నాదరించుకొనునట్టి పరిస్థి తుల నేర్పరచమని గాంధిజీ చెప్పిరి. ఈ వ్యవసాయ కూలీలు దోపిడికి లోనుగాకుండుటకై బాపూజీ శిష్యులమైన మేము పట్టుపట్టు చున్నాము. కొందరు రైతులు వారి పొలములను వ్యవసాయ కూలీలైన కౌలుదారులకు కౌలు కిచ్చేవారు. వారి రక్షణకై కౌలుదారీ చట్టమును చేయవచ్చును. ఇట్టి రక్షణ పద్ధతికి గాంధీజీ అనుకూలురే.

ఈనాటి యజమానులు కూలి విధానానికి బదులుగా స్వయంవృత్తివిధానాన్ని అభివృద్ధి పరచవలెను. ఐతే ఈనాటి ప్రపంచానికి యీ అభివృద్ధికరమగు మార్గము ననుసరించుట సాధ్యమా? వాస్తవంగా యిది యీనాటికే అనేకదేశాలలో అభివృద్ధి అగుచునేయున్నది. ఈనాటి చాలా కమ్యూనిష్టు దేశాలవారుకూడా యీ మార్గములో కొంతగా పరిశోధన చేస్తూనే వున్నారు. వారు కూడా తిరిగి

నెమ్మదిగా పైతాంగ వ్యవస్థకే వస్తున్నారు. కాని యీ నిర్మాణ వ్యవస్థను అంగీకరించలేదు. క్రమంగా కమ్యూనిస్టు దేశాలలో పైతులు చిన్న చిన్న కమతాలను తమవిగా చూచుకొని, సాగు చేసుకొనుటకు అనుమతిస్తున్నారు. భూములు వారి స్వంతము కాకపోయినను, వారు స్వంతముగా వ్యవసాయము చేసుకొని పండిన దానిని అనుభవించుకొనుటకు అంగీకరిస్తున్నారుగదా! ఈ విధముగా కమ్యూనిస్టు - సోషలిస్టు దేశాలలో క్రమముగా స్వయంవృత్తి తిరిగి వచ్చుచున్నది.

ఈ స్వయంవృత్తి అనునది ఒక్క వ్యవసాయమునకే పరిమితమైనదని భావించరాదు. వివిధ చేతివృత్తులలో కూడా వున్నది. దీనిని పరిశ్రమలకుకూడ వ్యాప్తి చేయవచ్చును. ఇంగ్లండులో అన్ని పరిశ్రమలు భారీ పరిశ్రమలచే సాగించబడుటలేదు. చాల పరిశ్రమలలో చిన్నచిన్న కార్ఖానాదారులు స్వయంవృత్తివారున్నారని, కొత్తగా అవకాశాలకు వారు వెతుకుకొనుచున్నారని ప్రముఖ సోషలిస్టు జాన్ స్ట్రాచీ నిరూపించి యున్నారు.

మార్క్స్ సందేశ మేమిటి? ఎవరైతే స్వయంవృత్తిని కోల్పోయి కూలీలైనారో, అందువల్ల శోషితులైపోయిరో వారికి ఆశాకిరణాలను అందించారు. వారికి ఉత్పత్తి సాధనములమీద అధికారమును, అదనపువిలువను కలిగించుటకు రాజకీయముద్వారాను, పరిశ్రమల పునర్వ్యవస్థీకరణము ద్వారాను సహాయముచేయవలెనని ఆయన కోరుకొన్నారు. ఎందులకు? వారు స్వయంవృత్తిని పోగొట్టుకొన్నారుకనుక.

పారిశ్రామిక కూలీలను వారికి వారే యజమానులుగా జీవించుటకై గాంధిజీ, వారి అనుచరులు ఏమిచేయుటకు ప్రయత్నించిరో, ఇప్పటికి ప్రయత్నించుచుండిరో పరిశీలించాలి. దోపిడీ విధానంనుండి, శోషిత దౌర్భాగ్యమునుండి వారికి విడుదల కలిగించుటకు సహాయము చేయవలెనని గాంధిజీ సందేశము. వారి యీ ఆలోచనను సూచనను ధార్మికమగు నిర్మాణ మార్గము గురించి ప్రపంచప్రజలు, నాయకులు శ్రద్ధగా ఆలోచించాలి. స్వయంవృత్తులవారికి, స్వంత ఉద్యోగులగు శ్రామికులకు సహకార సంస్థలు అవసరం. ఉత్పత్తికి అవసరమగు పరికరాలు, వస్తువులు కొనుటకు వారు నిర్మించే తయారుచేసే వస్తువులు అమ్మడానికి అవసరమగు పరపతులు పొందడానికి సహకారసంఘములు అవసరంగదా! ఆ సంస్థల నిర్వహణవారికే వదలాలి! ఆర్థిక సహాయం, పరపతి, పారిశ్రామిక పరిసరాల నిర్మాణ సౌకర్యములు, అమ్మడం, కొనుగోలు చేసుకొనే సౌలభ్యము ప్రభుత్వం స్వయంగాగాని, సహకార సంఘాల ద్వారాగాని, వారికి కల్గించాలి, ధరల నిర్ణయంలో వారికి శోషణ జరుగనివ్వరాదు. వారిని ప్రభుత్వము అన్నివిధాల బలపరచుట ధర్మము.

గాంధిజీ యీనాటి రాజకీయములకు అభివృద్ధి మార్గమును చూపుటలేదా? భారతదేశం ఇప్పటికే గాంధీజీకి "గుడ్‌బై" చెప్పినదనే భావము కొందరికి కలిగినట్లున్నది. కాని ఇది సరికాదు. ఆటంబాంబు విషయమే తీసుకొందాం! భారతదేశం తలుచుకొంటే ఆటంబాంబును తయారు చేయగలదని ప్రతి ఒక్కరికి తెలుసును. 15 సంవత్సరముల

క్రితమే భారతదేశము దానిని నిర్మించు శక్తిని సాధించినది. కాని ఎందుకని భారతదేశము యుద్ధములలో వాడుటకు ఆ బాంబులను తయారు చేయుటలేదు? అందులకు చాల కారణములు చెప్పబడినవి. ఈనాటికిగూడా గాంధీజీకి భారత దేశము తన హృదయాన్ని నివేదించుచుండుటయే దీనికి ప్రధానకారణము. మేము చాలమందిమి అధికారపార్టీకి చెందినవారము కాకపోయినను* అణుబాంబులు తయారు చేయకుండుటలో ప్రభుత్వమును బలపరచుచున్నాము. కాబట్టి నేను గాంధీజీ చనిపోలేదని చెప్పుచున్నాను. ఆయన గత కాలమునకు సంబంధించిన వారుకారు. వారిని భారతదేశం మరువలేదు. ఆయన చిరంజీవియే!

చివరిప్రశ్న : గాంధీజీ ప్రపంచమునకు చెందిన వారా లేక ఒక్క భారతదేశమునకేనా? ఫర్ హాడిగారు వాదించినట్లు గాంధీజీ యునైటెడ్ నేషన్స్ చార్టర్; ఫిలడెల్ఫియా చార్టర్ ఆఫ్. ఐ. యల్. ఓ. (అంతర్జాతీయ కార్మిక సంస్థ) మానవుల హక్కుల చార్టర్లను స్వయంగా ప్రేరేపించిన వారు కాకపోవచ్చు కాని యునైటెడ్ నేషన్స్, ప్రపంచ కార్మిక సంస్థలవారు యీ మానవుల, కార్మికుల హక్కుల చార్టరులను సాధించుటకు వలయు వాతావరణాన్ని సాధించిన గొప్ప ప్రపంచశక్తి గాంధిజీయే గదా!

ఆరుకోట్ల అస్పృశ్యులకు ఇతర ప్రజలతో సమానమైన పౌరసత్వ హక్కులు తన నలభై సంవత్సరాల ప్రయత్నంపై గాంధీజీ సాధించిరిగదా! అట్టి వారికంటే

---

*అనాటికి రంగాజీ ప్రతిపక్ష నాయకులుగా వుండిరి. సం.

మరెవ్వరు ఎక్కువ మానవతావాది అని కోటానుకోట్లు ప్రపంచ ప్రజలు అడుగుచున్నారు.

ఆ సెమినారు చర్చలు రెండు రోజులు జరిగినవి. పిమ్మట రెండు గంటలసేపు - టెలివిజను చర్చలో శ్రీరామచంద్రన్, రంగాజీ, ఫ్రెంచి, బ్రిటిషు, దక్షిణాఫ్రికా ప్రొఫెసర్లు, పత్రికా రచయితలు, తుది వైప్రాయి మౌంటుబాటెను కుమారి శ్రీమతి పమేలా పాల్గొనిరి. ఆ ప్రదర్శనాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శించబడినవి. స్వంత ఉద్యోగ వ్యవస్థను గురించి మహాత్ముని బోధపై రంగాజీ చెప్పిన విషయాలు హెచ్చుగా అందరి దృష్టిని ఆకర్షించినవి. యునెస్కో వారా ఉపన్యాసాలను అన్ని భాషలలో ప్రచురించినారు.

సం.

[రంగాజీ వ్రాసిన 'డిస్టింగ్‌విష్డ్ ఎక్వాయిన్‌టెన్సెస్' ఆంగ్ల గ్రంథం సుండి]

బాపూ స్వర్గారోహణము

అప్పుడు - ఆతదుపరి

అది 1948 జనవరి 30 సాయంత్రం... బాపూ ఆకస్మిక మృతిచెందారు. స్వాతంత్ర్య ప్రజాస్వామ్యాలకోసం, శాంతి ధర్మాలకోసం పాటుబడుతున్న మహాత్ముడు కన్నుమూయడం 'తీరనిలోటు' అని యావత్ప్రపంచం దుఃఖించింది.

నేటికీ అస్తవ్యస్త పరిస్థితులలో వున్న - రైతులు, స్వయంవృత్తులవారు, కూలీలు బాపూ స్వర్గారోహణంతో దిక్కు లేనివారైనారు.

ఆ దురదృష్టకరమైన రోజున కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ కార్యవర్గ సమావేశానంతరం, పార్లమెంటు భవనం లోని పశ్చిమానగదిలోకి నేను వెళ్ళాను. శ్రీ నెహ్రూ గది లోకి వచ్చారు. కార్యదర్శులమైన నాతోను, అయ్యంగారి తోను అప్పటి సమావేశానికి సంబంధించిన అజెండాను గురించి మాట్లాడుకొంటున్నాము. అంతలో ఎవరో ఫోనులో శ్రీ నెహ్రూను పిలుస్తున్నారని కబురు వచ్చింది. ఆయన ఫోనుఉన్న ప్రక్కగదిలోనికి వెళ్ళారు.

ఆ స్వల్పవ్యవధిలోనే అక్కడున్న సభ్యులంతా నాటి పార్లమెంటు విశేషాలను గురించి ముచ్చటించుకో సాగారు.

శ్రీ జవహర్ త్వరగానే వచ్చారు. కానీ ఆయన మోము విషాదంతో నిండి, గంభీరంగా మారిపోయింది.

ఆయన మూడ్ సరిగా లేనప్పుడు జరిగే సమావేశాలలో ఆయన ఎదురొక్కనవలసి వచ్చే కష్ట పరిస్థితి నాకు తెలుసు గనుక ఆఫూట సమావేశంలో ఆయన ఎలాంటి పరిస్థితిని ఎదురొక్కనవలసి వస్తుందో నని భయపడ్డాను.

"ఘోరం జరిగిపోయింది" అన్నారాయన! ఒక్క క్షణం ఆగి మళ్ళీ అన్నారు "బాపూని ఎవరో కాల్చి వేశారట! డాక్టర్లు వెళ్ళారు. మనమూ వెంటనే బిర్లా భవనానికి వెళ్ళాలి."

నా తల గిర్రున తిరిగిపోయింది. క్రమంగా మొద్దు బారిపోతున్నది. అన్నీ అపసవ్యమైన ఆలోచనలే వస్తున్నవి. చుట్టూగల ప్రపంచమంతా ఒక్కసారి భగ్నమై పోయి నట్లనిపించి బెదరిపోయాను.

నే నెక్కిన కారు బాపూవద్దకు అతివేగంగా ఉరకలు వేస్తుంటే - అప్పటికి కొద్ది రోజుల క్రితం జరిగిన దుర్ఘటన గుర్తుకు వచ్చింది. ఆ మధ్యనే బాపూ ప్రార్థన సమావేశపు గుంపుపై ఎవరో బాంబు వేశారుగదా!

అప్పటికి వారంక్రితం నేను బాపూను కలుసు కున్నాను. అప్పుడాయన పలికిన పలుకులు నాకు గుర్తుకు రాసాగినవి. "నేను అలసిపోయాను. బాగా అలసిపోయాను. నిద్రపోవాలని.....శాశ్వత నిద్రపోవాలని అనిపిస్తున్నది. నా కళ్ళు మండిపోతున్నవి. నా చుట్టూ జరుగుతున్న ఘోరాలను గమనించి నా హృదయం క్షోభిస్తున్నది."

మత విద్వేషం, ప్రతీకారం చెలరేగి, జరుగుతున్న దారుణాలు, హింస ఆయనకు తీవ్రమైన మనోవేదనను

లిగించినవి. వీటినుండి ఆయనకు విముక్తి కలగబోతున్నదా? అని భీతితో ఆలోచన చేస్తున్నాను.

చిట్టచివరికెట్లో ఆచోటు చేరుకొంటిమి. అక్కడ ఎన్నో సారులు కాంగ్రెసు కార్యవర్గ సమావేశాలందు ఆయనను చూచితిని. నేనుకూడ ఒంటరిగా ఆయనతో అక్కడే ఎన్నో సార్లు చర్చలు జరిపితిని.

ఓ!...గేటు దగ్గరనుంచి ఆయన ఉన్నచోటుకు చేరుకొనడానికి ఇవాళ...ఎంతకాలం పట్టుతున్నదీ! అడుగడుగున శోకంతో తపిస్తున్న సోదరులు గుమిగూడి యుండిరే! ...ముందడుగు వేయుట ఎంత కష్టమవుతున్నది!

ఆయన...మన బాపూ - అక్కడ తెల్లని గుడ్డమీద పడుకొని ఉన్నారు. పైన...మరొక తెల్లని ఖద్దరు వస్త్రం కప్పబడి వున్నది.

ఆయన మామూలుగా కూర్చుండే - ఆ చిరపరిచితమైన, మహనీయమైన స్థలాన్ని చూచాను...ఆయన నిశ్చలముగా, గంభీరంగా ఉన్నారు.

ఆశ దిగజారుతున్నది. దానికి ఎదురు తిరిగి నేను ఆశలు కల్పించుకొనడానికి — ఆయన గాయపు బాధకు అలా పడివుండిరని సహించుచుంటిని! ఆయనను చూస్తుంటే - ప్రాణము పోయినట్లే అనిపించడములేదు.

1945 జనవరిలో ప్రొద్దుట - సూర్యరశ్మిలో సేవాగ్రామములో ఆయన విశ్రాంతిగా పరుండి నిద్రిస్తున్నప్పుడు ఎలా ఉండిరో, ఇప్పుడును అట్లే - అంత ప్రశాంతంగా

ఉండిరి. ఆ మోమును చూడగా నాకేమీ భేదం కన్పించ డంలా!

అందువల్ల మా ప్రార్థనలు ఫలిస్తాయని - ఆనాడు ఢిల్లీ, పంజాబులలో జరిగిన మత కలహాలకు వ్యతిరేకంగా తాము సాగించిన ఆమరణ నిరాహార దీక్షలో మృత్యువును జయించిన విధంగానే - బాపూ నేడుకూడా మృత్యుంజ యులౌతారని...ఆ మంచిమాటను డాక్టర్లు అందిస్తారని ఆశలు పెంచుకుంటున్నా...నిద్రోకుకుంటున్నా..... కానీ విధి?

— బాపూ...మనబాపూ...పవిత్రులైన మన పెద్ద లలో చేరిపోయిరి - అప్పటికే...మేము అక్కడకు చేరు నప్పటికే...అని డాక్టర్లు ప్రకటించిరి.

ఆ దుఃఖమయ, బాధామయ సుదీర్ఘక్షణాలను మేము ఎలాగా గడిపామో...నే నిప్పుడు వర్ణించలేను. మేము శోకించాము. ఒకరి నొకరం కౌగలించుకొని శోకించాము. ఆ దుర్భరశోకం స్త్రీ పురుషులను చుట్టుముట్టి - అదిమి పట్టింది. అంతటా శోకమే!

అగ్ని దేవునకు అర్పణ

బాపూ స్వర్గారోహణం జరిగి అరగంట కాలేదు — అప్పుడే సాంప్రదాయిక విధులనుగురించి ఆలోచన! జీవితం నిర్దయగా ఆదేశించే కర్మకాండలు మమ్మలను స్పృహా లోనికి తెచ్చినవి. ఇందుకు బాపూ ఆత్మశక్తి ప్రేరణయే కారణ మనుకొంటిని! రాజఘాటువద్ద బాపూ భౌతిక

కాయాన్ని అగ్నిదేవునకు అర్పించాలని మేము నిశ్చయించు కొంటిమి.

మాస్కో-లో లెనిన్, స్టాలిన్‌ల భౌతికాయములను; ఈ జిప్సీలో ఫారోల భౌతికకాయములను పరిమళ ద్రవ్యములతో శాశ్వతంగా భద్రపరచినట్లు బాపూ భౌతికకాయమునుకూడ భద్రపరచవలెననే సూచన మేము అంగీరించ జాలకపోతిమి. అలా భద్రపరిచినట్లుయితే - ముందుతరాల వారికి ఆయన దేహం చెక్కచెదరకుండా ఉన్నదా, లేదా అనే చర్చకు అవకాశము నిచ్చిన వారమౌదుముగదా! ముందు తరాలవారు బాపూ సమాధిపట్ల భక్తిశ్రద్ధలను చూపడమందు లోటుపాట్లు చేయుటకుకూడ ఆస్కారము కల్గించిన వారమౌతాముగదా! అంతేగాక బాపూకే ఇష్టము కాని ఒకవిధమగు విగ్రహారాధనను ఇలా భద్రపరచటం ద్వారా మేము పోత్సహించి నట్లుగునుగదా!

బాపూను గురించి - మనప్రజానీకం వారివారి దృక్పథముల ననుసరించి ఆలోచించుకొనగల స్వేచ్ఛగలవారుగా ఉండవలెనని మా అభిప్రాయము. అంతటి మహాత్ముని కేశ రహితమైన శిరస్సు చుట్టూ ప్రకాశించే కాంతివలయము, ఆ వదన మండలములో నెలుగుతూ చూపరులను మంత్ర ముగ్ధులను చేసే ఆ చిరునగవు, ఆ మృదువైన పెదవుల నుండి వెల్లువగా ఊరకలువేస్తూ వచ్చే ఆ తీయని పల్కులు, ఆ పల్కులలో మానవత, శాంతి వర్ధిల్లవలెననే దీవెనలు... వీటినన్నిటిని మన జనాలు తమంతట తాముగా కనుగొన గల్గాలని మా అభిప్రాయము.

బాపు - నా పాపు, నా ధ్యానం

బాపూతో గడిపిన ఆ మధుర క్షణాలు, మరెన్నో సందర్భాలు; అట్టి గొప్ప అవకాశం గల్గిన నా అదృష్టం - ఇవే ఆ రాత్రి అంతా మళ్ళీమళ్ళీ నా మెదడులో సుళ్ళు తిరగ సాగినవి. పైళ్ళలో, కార్లలో, కాలిబాటలలో, పచ్చిక బయళ్ళలో; సేవాగ్రాం, వెంకటగిరి గోడ్డుమీద; నిడుబ్రోలు - తాళ్ళపాలెం మట్టిగోడ్డుమీద; కావూరు ఇసుక తిన్నెలపైన; గంగా, యమున, గోదావరి నదులపై పడవలపైన బాపు, నేను కలిసి తిరిగి, ఎన్నో చర్చలలో గడిపిన మధురసమయాలు ఎన్నో! అలహాబాదు, బొంబాయి కలకత్తా, ఢిల్లీ, పాట్నా, మద్రాసు, విజయవాడ మున్నగు పట్నాలలో మాత్రమేకాదు, లెక్కకు మించిన గ్రామాలలో, సేవాగ్రామములో, భంగీలోని హరిజన కాలనీలలో ఆయనతోపాటు పర్యటనలలో పాల్గొని, ఆయన చల్లని సమక్షంలో గడిపిన అమూల్య క్షణాలు ఎన్నెన్నో!

నలుబదికోట్ల భారత ఉపఖండ ప్రజానీకం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించుకొనుటకు ఏ శాంతియుత సత్యాగ్రహోద్యమము అనే మహోద్భుత ఆయుధాన్ని ఆధారంగా చేసుకున్నారో - దానిని ప్రపంచమంతటా పరదేశీయుల పాలనలోగల ప్రజలు కూడా ఆయుధంగా స్వీకరించుటకై, దానిని ప్రచారంచేయుటకై ఆయన నన్నొక దూతగ చేసి; పాన్ - అమెరికన్ కాంగ్రెసు, కలోనియల్ ఫ్రీడమ్ ఫ్రంటు అమెరికన్ - నీగ్రో అసోసియేషన్ మున్నగు వాటికి తన వాణిని ప్రతిధ్వనించే ప్రతినిధిగా నన్ను పంపిరిగదా!

ఆయన స్వయంగా పాల్గొని తన ఆత్మశక్తిచేత దివ్యత్వాన్ని కలిగించే ఆత్మోన్నతి సాధనములైన ప్రార్థనలలో నేను పాల్గొను అదృష్టమును నాకు కల్గించి, నన్ను ఆశీర్వదించిన బాపూ స్మృతి పదేపదే నా మెదడులో మెదలుతున్నది.

ఆయన వెంటనంటి అడుగులువేస్తూ, ఆయన తార్కిక చర్చల ద్వారా మా సేవాపథకాలకు రూపులు దిద్దుకొని, నిగ్గు తేల్చుకొను భాగ్యము నాకు, నావంటి దేశసేవకులకూ ఇంకెక్కడున్నది?

బాపూ - మానవత్వపు విలువలలో సాధించిన అద్భుత విజయాలన్నీ ఆ 1948 జనవరి చివరి రోజున ఒక్కమ్మడి వెల్లిపోయినవి గదా! జిన్నాగారు, లీగు యిచ్చిన ప్రోత్సాహముతో ముస్లిములు లేవనెత్తిన దౌర్జన్యహింసాకాండకు ప్రతీకారం చేయాలని కలకత్తాలో హిందువులు ఉరకలు వేయుచున్నప్పుడు బాపూ కలకత్తా వెళ్ళిరి; నిరాహార దీక్ష సాగించిరి. వారిని ఆ ప్రతీకారదృష్టినుండి మరల్చగల్గిరే! పాకిస్థానులోని ముస్లిములుకానివారిపట్ల, భారతదేశమందు అభిమానముగల వారిపట్ల అక్కడివారు సాగించిన హింస, దోపిడి, మహిళలను అవమానించుట మున్నగు దౌర్జన్యాలకు దిగినప్పుడు - ఢిల్లీలోని భారతీయులు దానికి ప్రతీకారం చేయాలని ఉవ్వెత్తున లేచినప్పుడు ఆ మహాత్ముడే గదా మరల నిరాహారదీక్ష సాగించి వారిని ఆ మార్గంనుండి ధర్మమార్గమునకు మరల్చ గల్గిరి!

ఈ తీరుగా మహాత్ముడు శాంతియుత సత్యాగ్రహం, నిరాహార దీక్ష అను ఆయుధాలతో ఎన్నో ప్రాణాలను, ధర్మమును కాపాడుతూ వుంటే - ప్రపంచంలో ఎక్కడెక్కడో అప్పుడప్పుడు చెలరేగుతూ ఉండే దౌర్జన్య హింసాశక్తులుకూడా ఈ అహింసావాది, మానవతావాది ప్రభావానికి లోనై తమ అధర్మ విధానాన్ని అనుసరించడానికి ఎంతో భీతి చెందుతూ వుండిరే!

.....

బాపూ దీవెనలతోనే నేను కాంగ్రెసు వర్కింగు కమిటీ లోనికి పిలువబడినాను. ఆయన సమక్షమందు జరిగిన సమావేశములందే నేను గ్రామీణ జనాల హక్కుల రక్షణను కాంగ్రెసు ధ్యేయములందు ఒక్కటిగా ఉండి తీరాలంటూ పట్టుపట్టి చేర్పించితిని.

మరి యిప్పుడో...

బాపూ మరణముతో స్వయంవృత్తుల వారి కోట కూలిపోయినదే! సైతాంగం ఒక సాహసవీరుని కోల్పోయినదే! గ్రామీణులు దిక్కులేని వారైరే!...అనుకుంటున్నాను. కానీ నిజానికి బాపూమృతి చెందిరా? లేదు. ఆయన మార్గమందు నడిచేవారు ఉన్నంతకాలము ఆయన మృత్యుంజయుడే! శాంతి, మానవత్వములపట్ల ప్రేమ; దరిద్రనారాయణ సేవాభావము, పీడిత ప్రజలకు ఓదార్పు యిచ్చే బాపూ సైతు కూలి ప్రజారాజ్యాశయాన్ని సాధించే దీక్ష గల నేను, నా వంటివారు గాంధేయ మార్గమందు భక్తి

విశ్వాసాలను కలిగి వున్నంతకాలము నిస్సందేహముగా సజీవుడే!

బాపూ అంతిమయాత్ర

మరునాడు ఉదయం - ఎన్నోలక్షలుగా ఉన్న సోదర ప్రజలతోపాటు నేనుకూడ బాపూ అంతిమ దర్శనానికై వెళ్ళాను. ఆ దర్శనం నాకు - వ్యక్తిగతముగా నాకు ఎంతో వేతనాపూరితం. ఎందుచేత? ఆ 1921 లో నాకు జన్మనిచ్చిన తండ్రికన్నుమూసిననాడు నేను ఆయన అంతిమదర్శనమును చేసికొనలేక పోతిని - అప్పుడు నేను ఆకర్ష్ణలో ఉంటిని గదా! అందువల్లనే బాపూ దర్శనం చేయాలనుకుంటే - నా హృదయం ఎంతో కలత చెందిపోయినది.

నేనూ స్పీకర్ మావలంకర్ - ప్రేమ, మానవత, ధర్మం ఆధారముగాగల గాంధేయ ధోరణిపట్ల ఉభయులకు గలభక్తివిశ్వాసాలను పరస్పరం ఆధారం చేసుకొనుచు శోకిస్తూ, శోకతప్తులగుచున్న ప్రజాప్రవాహములో పడి కొట్టుకొని పోవుచుంటిమి.

ఏ మహాత్ముని పవిత్రాత్మను గుండెల్లో దాచుకొని ప్రేమించు కొనుచున్నామో, ఆరాధించుకొనుచున్నామో ఆ మహాత్ముని పవిత్ర భౌతిక శరీరమును రాజఘాటులో అగ్నిదేవుడు నాల్కలు జాపి స్వీకరిస్తుంటే చూస్తూ అలా దిగ్భ్రాంతులమై నిలుచుంటిమి. బాపూ స్మృతులను, పలుకులను, నవ్వులను తలచుకొంటూ దుఃఖనివశులమై, ఒకరి నొకరు ఓదార్చుకొంటూ, ఆయన కనుమూతవల్ల కలిగిన

నష్టాన్ని ఆయన ప్రబోధాల ప్రభావంచేత దాటుకుంటూ ఊరడిల్లుతూ, మరల దుఃఖిస్తూ అలా ఉండిపోయాము.

* * *

"ఈ భూమిమీద ఇంతటి మహాన్వ్యక్తి అడుగు జాడలు పడినవా - అని కొన్ని శతాబ్దాల తదుపరి మానవాళి అబ్బురపడుతుంది" అని ఐన్‌స్టీన్ మహాశయుడు ఉద్ఘాటించినాడు.

"మిక్కిలి మంచిగా ఉండటం మంచిదికాదు" అన్నారు బెర్నార్డ్‌షా.

బాపూ అంటే మరొక బుద్ధుడేననీ, మరొక ఏసు ప్రభువు అని సజ్జనులంతా సంస్తవం చేసిరి.

జవహర్ శ్రద్ధాంజలి

(బాపు గతించిన మొదటి సంవత్సరమందు)

బాపూ వీడిపోయినందుకు దేశములోను, వెలుపలి ప్రపంచ మందంతటను దుఃఖితులైన జనాలకు ఓదార్పు పలుకులు పలుకవలసినదిగా కాంగ్రెసు వర్కింగ్ కమిటీ లోపలను, దానికి సన్నిహితముగాను గల మిత్రులు పత్రికలవారు, ఆకాశవాణి వారు, పత్రికలవారు అడిగిరి.

జవహర్ ఇలా అన్నారు: "మనజీవితాల్లో నుండి వెలుగు వెడలిపోయినది...కాని యిలాంటిదనడం సరికాదు. ఇన్నేళ్ళుగా ఈదేశాన్ని తేజోవంతం చేసిన వెలుగు, మరెన్నో ఏండ్లు ఈదేశాన్ని వెలిగిరేచిగిలదు. వేయేండ్లు గడచిన తరువాత కూడా దేశంలో ఈ జ్యోతి వెలుగుతూనే ఉంటుంది. ఆ తేజస్సును లోకం చూస్తుంది. అది ఎన్నెన్నో హృదయాలకు ఊరట కలిగిస్తుంది....."

తరువాత ఇలా అన్నారు: ఆయన ఒక దివ్యాగ్ని. అది మనలను మార్చివేసింది. ఆ అగ్నినుండి మనము చిన్ని చిన్ని రవ్వలను తీసుకొన్నాము. అవే మనకెంతో బలాన్ని యిస్తూన్నవి. ఆ దివ్యాగ్ని క్రోల్లుకోలది జనాల హృదయాలను వెలిగించగలవు. ఎందువల్ల? మనం ఆ మహాగ్నితో ప్రత్యక్షంగానూ దీక్షిత వారము కాకపోయినను, ఎంతో కొంత - రవంతైనా ఆ తేజస్సును పొందిన వారమై నందున!.....

"దయతో వెలిగే ఆయన మోములో చిరునవ్వు చిందులాడుతూవుండేది. తరాలెన్నో తరలిన తదుపరికూడా మానవాళి ఈమహాద్భుతవ్యక్తిని గురించి ఆలోచిస్తారు... ఈ వ్యక్తిని గురించి మాత్రమేకాదు; ఆయన ముందు మన మెంతటి చిన్నవారమైనా—ఆయన అడుగుజాడల వెంట నంటి నడిచిన మనను గురించికూడా ఆలోచిస్తాము.

"ఆయనది సత్యవాణి. సత్యమును అనుసరించే విధానము చెడ్డదైనప్పుడు ఆ సత్యము తప్పుదారి పడుతుంది—అని ఆయన తన సత్యవచనము ద్వారా ప్రకటించిరి. చెడు విధానముల ద్వారా మంచి ముగింపు సాధ్యం కాదని ఆయన చాటి చెప్పినారు. స్వేచ్ఛా, సత్యమార్గాలలో ఆయన మనను మహోన్నత దశకు కొనిపోగల్గిరి. ఆయన ప్రబుకున, చావున కూడ అద్వితీయ విజయులే!

"భారత మాతను, సత్యమును సేవించడం ఆ మహాత్ముని పాదాలకడ కూర్చుండి నేర్చుకొన గల్గడమే తన అదృష్టమన్నారు. మనకెంతో ఉపద్రవం వచ్చినప్పుడు తప్ప మనము మన నైతికమైన విలువలను విడువరాదని; భారతదేశానికి, ప్రపంచానికి సంబంధించిన చెడుగుల నన్ని టినీ పోగొట్టడానికి మనముసంఘర్షణను, ద్వేషాన్ని ఆధారం చేసుకొనరాదని; పుట్టుక చేతనే వచ్చినట్లు చెప్పబడు కులము, మతము, జాతి మున్నగు భేదములను నిర్మూలించుటకు గట్టిగా ప్రయత్నాలు చేయవలెనని, ఆ మహా

---

* పైన ఉదహరించిన జవహరు పలుకులు "ఇండిపెండెన్స్ అండ్ ఆఫ్టర్" గ్రంధము 1949 నుండి తీసుకొన బడినవి.

త్తుడు తన బ్రతుకు ద్వారా, మృతిద్వారా గొప్ప పాఠం నేర్పినారు."

గ్రామీణ జనాలతోపాటు రంగాజీ శోకవివశత

"బాపూ స్వర్గారోహణముచేసిన ఈ సమయంలో... నా హృదయం రైతుల, కూలీలవద్దకు పోతూ వున్నది. ఈ దెబ్బ, ఈ దుఃఖంచేత ఈ జనాలంతా శోక వివశులు కావడం సహజమే. వేదనతో, ఓదార్చుతో జవహర్‌లాల్జీ యిచ్చిన సందేశాన్ని వింటిమి. మన పరితాపమును, మన ఆశలను ఆయన ప్రతిధ్వనించిరి గదా! నేనుకూడ దానిలో పాలు పంచుకొంటున్నా. బాపూశక్తిచేత, స్మృతిచేత మన సాంఘిక, ఆర్థిక స్వాతంత్ర్యము; మన స్వయం వృత్తి; మన ప్రజాస్వామ్యము, మానవత్వము ఇప్పటివలెనే ఈలాగే కొనసాగాలంటూ ప్రార్థన చేస్తున్నా.

మన ప్రియతమ బాపూను హత్య చేయడంద్వారా - హైందవ మతతత్వవాదులు, ఏక పక్షాధికార తృష్ణాళువులు-జమీనులెంలో ఫార్సీలవలె - సాంఘిక సమానత్వము, మానవత్వము, సర్వజనాల స్వేచ్ఛ మొదలగు గాంధేయ ప్రబోధాలను, ప్రభావములను నాశనం చేయగల మనుకొంటిరా? ఆత్మత్యాగియైన జీసస్ క్రైస్తు ఆత్మశక్తి వలె - మహాత్ముని ఆత్మశక్తికూడా విశ్వశాంతిని, మానవతను కొనసాగించ గల్గుతుంది.

మన బాపూ గొప్ప ప్రజాస్వామ్యవాది. సాంఘిక మైన ఆర్థికమైన అసమానతలకు, బహిష్కరణలకు వ్యక్తి

రేకంగా మహాత్ముడు తన సర్వశక్తులతోను పోరాటం సాగించిరి. దళిత, పీడిత జనాలను, దరిద్రనారాయణులను పైకి లేవనెత్తడానికి ఆయన కృషిచేసిరి. హరిజనులను అస్పృశ్యత నుండి విముక్తులను చేసిరి. బుద్ధుని విజయం వలెనే మహాత్ముడుకూడా కులం - మతం, స్త్రీ - పురుషుడు అనే వివక్షత లేకుండా సర్వజనులకు సమాన హోదాస్థాన్ని అందించిరి.

శ్రమైతు - కూలీ - కళాకార్ - బుద్ధి జీవులకు సంపూర్ణ స్వాతంత్ర్యముగల ప్రజాస్వామ్యమే కావాలంటూ వున్న మా సిద్ధాంతమును బాపూ ఆశీర్వదించిరి. శ్రమైకాంగం స్వేచ్ఛా స్వాతంత్ర్యముగల స్వయంవృత్తిపరులుగా ఉండే ప్రజాస్వామ్యాన్నే ఆయన కోరిరి. శ్రీకృష్ణునివలె, బుద్ధుని వలె, క్రైస్తువలె ప్రజల బాపూ ఆత్మగౌరవం, స్వేచ్ఛగల మానవాళి హృదయాలను ఉత్తేజ పరచగల మహోన్నత స్థితిని పొందగలరు.

జవహర్ పాలనలో

ఏవో కొన్ని విషయములందు తనతో భేదించి నప్పటికి, మొత్తముమీద తన పలుకులకు రూపమీయగల వారసుడు జవహరులాలని గాంధీజీ విశ్వసించిరి. అన్నే నాతో, డాక్టర్ కుమరప్పతో జవహరు కొన్ని అంశములలో వేరు అభిప్రాయములు కలిగివున్నను; జాతీయ ప్రణాళికా సంఘకాలములో — కుటీర, చేనేత పరిశ్రమల పునరుద్ధరణ, అభివృద్ధిని; చేతివృత్తుల కళాకారులపై ఆధార

పడిన ఆర్థిక విధానమునకు సంబంధించిన మా ప్రణాళికను-
కొంత ఆలస్యంగానైనా పూర్తిగా అంగీకరించిరి. ప్రపంచ
శాంతికి దోహద మిచ్చుటకు గాంధేయ మార్గమునే అనుస
రించుటలో జవహరు విజయులైరి.

భారత దేశమును ఏ కూటమికి చెందించక జవహర్
అలీన విధానమునే పట్టువిడువక సాగించుటచే, అగ్రరా
జ్యాలు తమలో తాము నిలువరించుకొనుట, అణుశక్తి
విజృంభణను అరికట్టుకొనుట తప్పని సరియైనది. ఆయన
విధానమును మరింతగా వేళ్ళూనునట్లు చేయటంద్వారా
శ్రీమతి ఇందిరా గాంధీ ఈ ఉపఖండమందు భారతదేశ
నాయకత్వమును నిలుపగల్గిరి.

అయితే అమెరికాలో, రష్యాలోగల పెద్దపెద్ద భూక
మతాల విధానానికి ముచ్చటపడిన ప్రణాళికా కర్తల
పలుకులకు జవహర్ చెవియొగ్గి సహకార వ్యవసాయ విధా
నమును తేవలె ననుకొనిరి. అప్పుడే నేను గాంధేయ మార్గ
ములో, గ్రామిక జనాలపై ఆధారపడిన చిన్న తరహా కమ
తాలు గల వ్యవసాయమే కావాలని, నైతుల స్వయంవృత్తి
నిలవాలని నా యావచ్ఛక్తిని, రాజకీయములందు నాకుగల
స్థానమును పణముగా పెట్టి ఎదిరించవలసి వచ్చినదిగదా!

అదృష్టవశాత్తు, గాంధేయమైన చిన్ననైతుల స్వయం
వృత్తి పరిబోధమే విజయమందినది. మరి ఇప్పుడు శ్రీమతి
ఇందిరా గాంధీ పరిపాలనలో భూపరిమితి, మిగులు భూముల
పంపిణీ విధానములు అమలులోనికి వస్తూ, వ్యవసాయ

కూలీలు చిన్నచిన్న భూఖండముల పొంది స్వయంవృత్తి, ప్రతిపత్తిగల రైతాంగముగా రూపొందుచుండిరి గదా!

ఇట్టిదే మరొక అడుగువేసిరి జవహరు. రాజ్యాంగము నకు పదిహేడవ సవరణ చేయటం ద్వారా రైతుల భూము లను జమీందారీ ఎస్టేటు భూములవలె మార్చునొందించు టకు, జమీందారీలు రద్దయినట్లే ఇవి కూడ రద్దగునట్లును యోచించిరి! దీనిని నిలువరించుటకు దేశంలోను, పార్లమెంటు లోను గాంధేయుల, కమ్యూనిష్టేతర సభ్యులబలం పొందు టకు మరల నేను ఎంతో కష్టముతో, దీక్షతో పోరాటం, ప్రచారం రెండేండ్లు పర్యంతం సాగించవలసి వచ్చెనే! దేశంలో అత్యధిక సంఖ్యలోవున్న, కేలింగుకు లోబడిన భూములుగల రైతాంగపు స్వంతవృత్తిని నిల్పుటకు; వారిని ఈ చట్టమునుంచి మినహాయించుటకు క్రమంగా అంగీకరించు కొంటూ వచ్చి తమ రాజనీతిజ్ఞతను చూపుకొనిరి జవహర్!

దేవిజీకి లేఖ

(31-1-48)

[బాపూ స్వర్గారోహణ మందిన దుర్దినమున తాము పొందిన వ్యధను - ఆ మరునాడు భారతీదేవికి లేఖద్వారా కనుల యెదుట చిత్రించినాడు - రంగాజీ. 'స్వర్గారోహణ' మనే నెనుకటి అధ్యాయంలో పేర్కొన్న విషయాలను ఈ లేఖలో పునరుక్తం కాకుండ - మిగిలిన ముఖ్యభాగాలే ఈ శీర్షికక్రింద ప్రచురితమైనాయి. లేఖ పూర్తిపాఠం రంగాజీ రచించిన 'భారతీదేవి స్మృతులు' గ్రంథంలో 312వ పేజీలో 'స్వర్గారోహణం' శీర్షికలో చూడవచ్చును. సం.]

4, విండ్సర్ క్రెసెంట్, న్యూ ఢిల్లీ,

నా ప్రియమైన భారతీ!

పత్రికల్లో చదివితివా? లేక రేడియోమీద విన్న వారు వచ్చి చెప్పిరా? ఎంతటి దారుణానుభవము!

నిర్వ్రణులమైతిమి. డాక్టర్లు, మందులు, వగైరా సాయమేది? అవసరం మాత్రం యేది? నాల్గు అడుగుల దూరంలో నుండియే షూటుచేసినాడట. దెబ్బ తగలడంతోటే రెండు చేతులెత్తి దణ్ణంపెట్టి, హేరామ్ అన్నారట! అంతే, తిరిగి కళ్ళు తెరవలేదు. అర్ధగంటలో ప్రాణంపోయింది. రామకోటి వ్రాసే వారి కలా 'హేరామ్' అనే అదృష్టము కల్లునా? మేము 20 మందిమి చేరితిమి. ఆ పిల్లలు, మహాత్ముని 'గీతా పాఠముల' ప్రార్థన చేయుచుండిరి. వారి దుఃఖమేమని చెప్పాలి? ఐనా పండితులు, సర్దారు, మేము ఓర్చుకుంటూ

వుంటిమి. మాకంతా తల దిమ్మెక్కినట్లేయుండెను. దేవదాసు వచ్చెను - లక్ష్మితో! మహాత్ముని దర్శకు వెళ్ళెను. అంతటితో దుఃఖము ఆపుకోలేక, మొగాన్ని ముద్దాడుతున్నాడా అన్నట్లు వాలి 'బాపూ' అంటూ యేడ్చేను. అందరం యేడ్చేం. పట్టుకోలేక పోతిమి.

కొంత సేపటికి తేరుకున్నాము.

ఐతే, చనిపోయినారా? నిజంగానే? మొన్న 24 నుండి 26 వరకూ మాతో కూర్చొని వుండెనే? 26 వ తేదీన తన ఆశయాలేవో, జనుల కేలాంటి పంచాయతీపాలనం రావలెనో చెప్పచుండిరే? ఆ 26 తేదీనన్ స్నానప్రదేశమునుండి తన పరుపువరకు, నాభుజముపై చేయివేసి, తాను నడచివెళ్ళి నన్నాశీర్వదించెనే? హైదరాబాదు గురించి, కాంగ్రెసు కాన్స్టిట్యూషను గురించి నాతో ముచ్చటించిరే?

క్రిందటి 26 సంవత్సరాలనుంచి నా ఆలోచనా ప్రపంచమందు దివ్యజ్యోతిలాగా వెల్గుచుండిన మహాత్ముడొక తుపాకికి లొంగిపోవునా? అంతటి బ్రిటీషు ప్రభుత్వమునకు లొంగలేదే? ఇట్లా ఎన్నో ఆలోచనలు పరుగులెత్తుచుండినాయి?

ఏదో వేదన. దానితో ప్రార్థన! ఏమని? తిరిగి ఆయన రావాలని, ప్రాణం పొందాలని? కళ్ళు తెరవాలని? ఆయన ప్రేమవాహినుల ఆహ్వానించుకుంటూ, ఆయన ఆశీస్సుల పొందుచూ, దేశానికింత బలమిచ్చుచున్న యీ పండితుడు, సర్దారు లేమనుకొంటున్నారో!

ఎట్టకేలకు ఆ గది వదలితిమి. అయిపోయిందను కున్నాము. ఐనా ఆ ఇల్లు వదలగలమా? రాత్రి 8 గంటలకు బైటికి వచ్చితిని; రేడియో కేదో చెప్పితి. మరొక్కరితో మాట్లాడాలనిపిస్తుందా?

నీవెంత బాధపడుచున్నావో అనే భయం కలదు. ఐతే, ధైర్యస్థురాలవుగదా? మన హృదయాల్లో బాపూజీని నిల్పుకున్నాము, పూజించుకుంటాము. మన 'బాపూ'ను మన ద్వారా మన ప్రజలకు అందించుకొంటూ వుండగలము లే.

ప్రేమ,

రంగ

అనుబంధము*

రంగా: మేము కాంగ్రెసులో ప్రవేశిస్తాము. కానీ మేము అధికారం కోసం, పదవుల కోసం పోరాడేది లేదు. అహమ్మదాబాదు కార్మిక సంఘాన్ని చూచిన దృష్టితోనే మీరు మమ్ములను కూడ చూడగల్లుదురా?

బాపు: తినేదాన్ని బట్టి రుచిని తెలుసుకోవచ్చు. అదంతా పనిచేసే ఉత్సాహ శక్తిమీద ఆధారపడి వుంటుంది. నా ఉద్దేశాన్ని స్పష్టంగా చెప్పాను. ఇక ఆచరించటం మీ వంతు. మీరు మీ సంఘాలను అహమ్మదాబాదు కార్మిక సంఘం మాదిరిగా మలచుకోవాలి. కార్మిక సంఘసభ్యులంతా కాంగ్రెసు రిజిష్టరులో ఉన్నారు. వారంతా కాంగ్రెసు ప్రమాణికతకు లోబడే ఉంటున్నారు. అయినా వారు కాంగ్రెసులోను మునిసిపాలిటీలోను ఒక శక్తిగా పనిచేస్తున్నారు. మీరు మీ ఆంధ్ర విషయం చూడండి. రైతులంతా సభ్యులు కావాలి. సభ్యత్వాన్ని వారు ఇష్టపూర్వకంగా పొందాలి. కాంగ్రెసు దృక్పథాన్ని, రాజకీయ చైతన్యాన్ని పొందేవిధంగా వారిని సభ్యులుగా చేసుకోవాలి.

రంగా: స్వతంత్ర భారతదేశం, జాతీయ ప్రభుత్వంపాలాల్లోను, పరిశ్రమల్లోను, తదితర రంగాల్లోనూ శ్రమించే కష్టజీవులకే చెందగలవని బొంబాయి ఎ. ఐ. సి. సి. జనాలకు హామీ నిచ్చింది. అంటే దీనినిబట్టి - స్వాతంత్ర్యం లభించిన తర్వాత

కాంగ్రెసుపార్టీ ప్రజాస్వామ్య హైతు-కూలీ-ప
రాజ్యానికే కట్టుబడి వుండగలదని ఈ తీర్మానం
నం చేస్తున్నదని మనం జనాలకు చెప్పుకోవచ్చు

బాపు: స్వరాజ్యం వచ్చిన తర్వాతనే కాదు - ఎ
కూడా! ప్రజాస్వామ్య హైతుకూలి ప్రజారా
యానికే కాంగ్రెసు కట్టుబడి వుంటుంది.

---

* శ్రీ పెండూల్కర్ సంపాదకీయంలో వెలువడిన 'మహా
గ్రంథం 6వ సంపుటంలోని 378-379 పుటలలో గల 1944-
సంవత్సరపు 'బాపూ దినచర్య' నుండి ఈ భాగం గ్రహించబడిన